
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
మంగళవారం 10, జూన్ 2025

అతనో గ్రామస్థాయి వైసీపీ నాయకుడు. గత ప్రభుత్వంలో నియోజకవర్గ కీలక ప్రజాప్రతినిధికి ముఖ్య అనుచరుడు. విద్యుత్ కాంట్రాక్టర్ అవతారం ఎత్తాడు. ముఖ్య నాయకుల అండదండలు పుష్కలంగా ఉండటంతో నియోజకవర్గవ్యాప్తంగా ఆ శాఖలో అతను చెప్పిందే వేదంగా నడిచింది. చట్టాలను, నియమాలను ఉల్లంఘించి ఎన్ని తప్పులు చేయాలో అన్నీ చేశాడు. కన్‌స్ట్రక్షన్ కాంట్రాక్టర్లతో చేయాల్సిన కీలకమైన పనిని కూడా నిబంధనలకు విరుద్ధంగా తన పలుకుబడిని ఉపయోగించి దక్కించుకున్నాడు. ఈక్రమంలో ప్రభుత్వ పనులకు వచ్చిన సామగ్రి సొంతానికి వాడుకున్నాడు. ఆ మెటీరియల్‌ను కిందిస్థాయి సిబ్బందే చోరీ చేసినట్లు నెపాన్ని వారిపై మోపాడు. ఆ క్రమంలో చివరికి మండల ఏఈపైన రికవరీ భారం పడింది. పనులు ప్రారంభించి మూడేళ్లు దాటుతున్నా నేటికీ పూర్తిచేయలేదు. వైసీపీ ప్రభుత్వం పోయి కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ అధికారులు మాత్రం అతనిపై కనీస చర్యలు కూడా తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కండక్టర్ వైరు బిగించని విద్యుత్ స్తంభాలు

విద్యుత్ శాఖలో వైసీపీ కాంట్రాక్టర్‌దే పెత్తనం

అతని నిర్వాకంతో మూడేళ్లుగా నిలిచిన పనులు

అప్పట్లో మెటీరియల్‌ను సొంతానికి వాడుకున్నా చర్యలు శూన్యం

అలా వదిలేశారు!

- గతంలో మార్కాపురం నేతకు ముఖ్య అనుచరుడిగా హవా
- ప్రభుత్వం మారినా పట్టించుకోని ఆ శాఖ అధికారులు
- ఉన్నతాధికారులు దృష్టిసారించాలంటున్న ప్రజలు

మార్కాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడు మండలంలోని మీర్జాపేట గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ శాఖను శాసించాడు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన విద్యుత్‌శాఖ పనులన్నీ అతని కనుసన్నల్లోనే నడిచాయి. ఎవరైనా ఎదురుచెబితే వారిని ఇబ్బందులకు గురిచేయడం అతని నైజం. మండలం నుంచి జిల్లాస్థాయి అధికారుల వరకు అతని పేరు చెబితే హడలిపోయే పరిస్థితులు అప్పట్లో నెలకొన్నాయి. మార్కాపురం పట్టణానికి రెగ్యులర్ ఏఈ పోస్టును

మిగతా 6వ పేజీలో



చోరీకి గురైంది ఇలాంటి వైరే



పీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా ప్రమాణం చేస్తున్న డాక్టర్ సీతారామయ్య, వేదికపై ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్ తదితరులు

రాజకీయ జోక్యం ఉండదు

పీడీసీసీబీ ద్వారా రైతులకు అండ

- ఎమ్మెల్యేలు జనార్దన్, విజయ్‌కుమార్
- బ్యాంక్ చైర్మన్‌గా డాక్టర్ సీతారామయ్య పదవీ బాధ్యతల స్వీకరణ
- శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

సెంట్రల్ బ్యాంక్ కార్యకలాపాలు, రైతు సేవా కార్యక్రమాల నిర్వహణ విషయంలో ఎలాంటి రాజకీయ జోక్యం ఉండకూడదని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చెప్పారు. బ్యాంక్ చైర్మన్‌గా డాక్టర్ కామేపల్లి సీతారామయ్య పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సోమవారం మధ్యాహ్నం పీడీసీసీబీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. నిష్పక్షపాతంగా రైతులకు అండగా ఉండాలన్నదే రాష్ట్రప్రభుత్వ లక్ష్యమన్నారు. అందుకనుగుణంగా టీడీపీపరంగాకానీ, తాము కానీ బ్యాంక్ కార్యక్రమాల నిర్వహణలో ఎలాంటి జోక్యం చేసుకోబోమని స్పష్టం చేశారు. చైర్మన్ సీతారామయ్య నిర్భయంగా, నిష్పక్షపాతంతో పనిచేసి రైతులకు సేవలందించాలని ఆకాంక్షించారు. గత సాధారణ ఎన్నికల సమయంలో పార్టీ కొత్తపట్నం మండల ఇన్‌చార్జిగా డాక్టర్ సీతారామయ్య సమర్థవంతంగా పనిచేశారని కొనియాడారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో బ్యాంక్ ద్వారా రైతులకు రుణపరపతి బాగా ఉండేదని, ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదని చెప్పారు. తిరిగి రైతులకు విరివిగా రుణాలు ఇచ్చేందుకు కృషిచేసేలా చర్యలు

మిగతా 6వ పేజీలో



ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు

నిరసనాగ్రహం

- అమరావతి మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఆందోళనలు
- పలుచోట్ల సాక్షి ప్రతుల దహనం
- పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు

ఒంగోలు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని ప్రాంత మహిళల పట్ల సాక్షి మీడియాలో అనుచిత వ్యాఖ్యల ప్రసారంపై జిల్లావ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. ఆ మీడియా సంస్థపైనా, అందులో లైవ్ డిబేట్ నిర్వహించిన కొమ్మినేని శ్రీనివాసరావు, ఎనలిస్టు కృష్ణంరాజులపై మహిళలు, టీడీపీ శ్రేణులు మండిపడ్డారు. వారి చర్యలను ఖండిస్తూ సాక్షి మీడియాపైన, వారిరువుపైనా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు పలుప్రాంతాల్లో నిరసనలు తెలిపారు. సాక్షి ప్రతుల దహనం, పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. ఒంగోలులో తెలుగు మహిళలు స్థానిక తాలూకా పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలపడంతోపాటు ఫిర్యాదు ఇచ్చారు. తెలుగు మహిళా నేతలు రావుల పద్మజ, అరుణ, కుసుమకుమారి, సునీత, ఆర్ల వెంకటరత్నం, పావని తదితరులు పాల్గొన్నారు. దర్శిలో తహసీల్దార్ కార్యాలయం వద్ద తెలుగు మహిళలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎర్రగొండపాలెంలో సాక్షి పత్రిక ప్రతులను తగులబెట్టి నిరసన తెలిపారు. పలు ఇతర ప్రాంతాల్లోనూ ఆందోళనలు జరిగాయి.

యోగాంధ్ర ర్యాలీలు

- జిల్లావ్యాప్తంగా నిర్వహణ
- పలుచోట్ల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరు



ఒంగోలులో ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్ తదితరులు

ఒంగోలు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా సోమవారం యోగాంధ్ర అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పలుప్రాంతాల్లో కీలక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. ఆ రోజున విశాఖలో ఐదు లక్షల మందితో యోగాడే నిర్వహిస్తుండగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొననున్నారు. అదేసమయంలో రాష్ట్రవ్యాప్తంగా లక్ష కేంద్రాల్లో రెండు కోట్ల మంది యోగా కార్యక్రమంలో పాల్గొనేలా చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. అందులోభాగంగా జిల్లాలో పది లక్షల మంది పాల్గొనేలా లక్ష్యం నిర్దేశించింది. అందుకు ప్రజలను సమాయత్తం చేసేందుకు, వారిలో అవగాహన కల్పించేందుకు బహుముఖ కార్యక్రమాలను నెలరోజులుగా నిర్వహిస్తున్నారు. సోమవారం జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున యోగాంధ్ర అవగాహన ర్యాలీలు చేపట్టారు. ఒంగోలులో కలెక్టర్ తమీమ్ అన్సారియా ర్యాలీని ప్రారంభించగా, ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయ్‌కుమార్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, మేయర్ గంగాడ సుజాత, జేసీ

మిగతా 6వ పేజీలో

ముండ్లమూరులో భూప్రకంపనలు



ముండ్లమూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. పసుపుగల్లు, పెదఉల్లగల్లు, కెల్లంపల్లి, పులిపాడు, సింగనపాలెం, వేంపాడు, శంకరాపురం, పోలవరం, నూజెండ్లపల్లి, సుంకరవారిపాలెం, తూర్పుకంభంపాడు, భట్లపల్లి గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి 12.20 గంటలకు రెండు సెకన్లపాటు భూమి కంపించింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు బయటకు పరుగులు తీశారు. ఈ ఏడాది పలుమార్లు భూమి కంపించింది. దీంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అర్ధరాత్రి భూకంపం రావటంతో నిద్రిస్తున్న ప్రజలు ఒక్కసారిగా లేచి జాగారం చేయాల్సి పరిస్థితి ఏర్పడింది.

ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజామొహిద్దీన్‌పై వేటు

- హెడ్‌క్వార్టర్‌కు బదిలీ
- నెల్లూరు డీఎం అయేషాబేగం నియామకం

ఒంగోలు క్రైం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఖాజామొహిద్దీన్‌పై బదిలీ వేటు పడింది. ప్రస్తుతం నెల్లూరు ఎక్సైజ్ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న షేక్ అయేషా బేగంను ఈఎస్‌గా నియమిస్తూ సోమవారం ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్‌మీనా ఉత్తర్వులు జారీ చేశారు. ఖాజామొహిద్దీన్‌కు హెడ్ క్వార్టర్‌లో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు అందాయి. ఇంకా ఎక్సైజ్ శాఖలో మరికొన్ని బదిలీలు జరిగే అవకాశం ఉంది.

మార్కెటింగ్ శాఖ ఏడీగా వరలక్ష్మి

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా ఎం.వరలక్ష్మి నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం వరలక్ష్మి కలిదిండి స్పెషల్ గ్రేడ్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న కేవీఎస్ ఉపేంద్రను నర్సరావుపేట స్పెషల్ గ్రేడ్ సెక్రటరీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ప్రతి విద్యార్థీ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

- షైనింగ్ అవార్డుల ప్రదానోత్సవ సభలో కలెక్టర్ అన్సారియా
- పాల్గొన్న ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్

- 6వ పేజీలో

గ్రామీణాభివృద్ధి పథకాల పరిశీలన

- జిల్లాలో పర్యటిస్తున్న కేంద్ర బృందం
- అధికారులతో సమీక్ష
- క్షేత్రస్థాయిలో ఫలితాలపై అధ్యయనం



కలెక్టర్ అన్సారియాను కలిసి పూల మొక్కను అందజేస్తున్న కేంద్ర బృందం సభ్యుడు

ఒంగోలు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాల తీరును కేంద్ర బృందం పరిశీలన చేయనుంది. అందుకోసం సోమవారం జిల్లాకు వచ్చింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా దేశవ్యాప్తంగా పల్లె ప్రాంతాల్లో పెద్దఎత్తున ఆర్థికాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన పథకాలు అమలవుతున్నాయి. వాటి తీరును ఏటా కేంద్రప్రభుత్వం పరిశీలిస్తోంది. కొన్ని రాష్ట్రాల్లో ఎంపిక చేసిన జిల్లాల్లో కేంద్ర బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి పనులు జరిగిన తీరు, వాటి ద్వారా ప్రజలకు ఒనగూరిన లబ్ధిని అధ్యయనం చేస్తాయి. అలా ఈ ఏడాది 15 రాష్ట్రాల్లో పరిశీలన చేస్తుండగా అందులో ఆంధ్రప్రదేశ్‌లో మన జిల్లాను ఎంపిక చేశారు. కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ ఉన్నత స్థాయిలోని దిశ విభాగం జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఉమేష్‌కుమార్ రామ, అడ్మినిస్ట్రేటివ్ అధికారి జీఎస్.రావత్‌లు ఇందుకోసం జిల్లాకు వచ్చారు. ఐదు రోజులపాటు అధికారులతో కలిసి జిల్లాలో పర్యటించనున్నారు. తొలిరోజైన సోమవారం కలెక్టర్ అన్సారియాను కలిశారు. అనంతరం డ్వామా, డీఆర్‌డీఏ, జడ్పీ ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. సాయంత్రం డ్వామా కార్యాలయంలో ఏర్పాటు చేసిన జలశక్తి కేంద్రం, భాగ్యనగర్‌లోని రూడ్‌సెట్ శిక్షణ కేంద్రాలను సందర్శించారు. అనంతరం కొత్తపట్నం మండలం పాదర్తిలో పర్యటించారు. ఈనెల 13వరకు వైపాలెం, దోర్నాల, బేస్తవారపేట, దర్శి తదితర మండలాల్లో పర్యటిస్తారని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ తెలిపారు.

శేషవాహనంపై లక్ష్మీనరసింహుడి వైభోగం



7

దక్షిణ సింహాచలంగా పేరుగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. నాల్గోరోజైన సోమవారం రాత్రి స్వామివారు శేషవాహనంపై దర్శనమిచ్చారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.



7

ఒంగోలులోని ప్రకాశం భవన్ వద్ద దీక్షలు చేస్తున్న టీచర్లు

ఉపాధ్యాయుల నిరాహార దీక్షలు

- ఎస్జీటీలకు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్
- మంత్రి జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి

వెబ్ కౌన్సెలింగ్‌పై ఎస్జీటీల్లో ఆందోళన

ఎక్కడికిపోతామోనని భయం

ఒంగోలు విద్య జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : బదిలీల్లో సెకండరీ గ్రేడ్‌లకు వెబ్ కౌన్సెలింగ్ విధానం అమలుపై టీచర్లు భగ్గుమంటున్నారు. మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీ చేయాలని ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు ముక్తకంఠంతో కోరుతున్నారు. అయితే వెబ్ కౌన్సెలింగ్‌పై ప్రభుత్వం మొండిగా ముందుకుపోతోంది. వేలాది మంది ఎస్జీటీలు తప్పనిసరిగా బదిలీ కావాల్సిన నేపథ్యంలో వారు కోరుకునే స్థానాలకు అవన్నీ కూడా

మిగతా 6వ పేజీలో

అలా వదిలేశారు!

(5వ పేజీ తరువాయి)

వైసీపీ ప్రభుత్వ హయాం మొత్తంలో నియమించకుండా అడ్డుకున్నాడంటే అతని స్థాయి ఏపాటిదో ఇట్టే అర్థమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాధారణ పనులు చేయకపోయినా ఉన్నతాధికారులతో అతనికి ఉన్న సత్సంబంధాలతో ప్రస్తుతం సూర్యఘర్ యోజన పనులు చేస్తున్నాడు. గత ఐదేళ్లలో అతను చేసిన అకృత్యాలను ప్రభుత్వం మారినా నేటికీ ప్రశ్నించలేకపోవడం గమనార్హం.

ప్రభుత్వ కేబుల్ చోరీ చేసి మూడేళ్లు.. ఆపై పనులు నిలిపివేత

నిరంతర విద్యుత్ సరఫరాకు కొనకనమిట్ల మండలం చౌటపల్లి నుంచి తర్లుపాడు మండలం మేకలవారిపల్లి సబ్‌స్టేషన్ల మధ్య నూతన విద్యుత్‌లైన్ పనులను 2022లో ఆ శాఖ చేపట్టింది. ఇలాంటి కీలకమైన పనులను కన్‌స్ట్రక్షన్ విభాగం ద్వారా ఆ శాఖ రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో ఉండే పెద్ద కాంట్రాక్టర్లకు అప్పజెబుతుంటుంది. అప్పట్లో అధికారం అండతో ఆపరేషన్స్ విభాగంలో కాంట్రాక్టర్ అయిన అతను రూ.10 లక్షల పనిని దక్కించుకున్నాడు. తొలుత రెండు సబ్‌స్టేషన్ల మధ్య విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేశాడు. మిగిలిన పనిని రెండు మాసాల్లోనే పూర్తిచేసే అవకాశం ఉన్నా పట్టించుకోలేదు. కానీ ఆ కాంట్రాక్టర్‌కు దుర్బుద్ధి పుట్టింది. మార్కాపురం మండలంలో ప్రైవేటు పనిని కూడా చేస్తున్న అతను ప్రభుత్వ పనులకు వచ్చిన రూ.2లక్షల విలువైన కేబుల్‌ను మాయం చేశాడు. చౌటపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఉన్న ఆ కండక్టర్ వైర్ కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది చోరీ చేసినట్లు వారిపై చర్యలు తీసుకునేలా చక్రం తిప్పాడు. దీంతో సుమారు ఏడాది పాటు పనులు నిలిచిపోయాయి. జిల్లా ఉన్నతాధికారులు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, మండల ఏఈలపై రికవరీ భారాన్ని మోపారు. ఈ వ్యవహారంలో సదరు కాంట్రాక్టర్ నాయకున్ని అడ్డం పెట్టుకుని వ్యవహారం నడిపాడు. సరే రికవరీ అయిన తర్వాతైనా పనులు పూర్తి చేశాడా అంటే అదీ లేదు. వైసీపీ అధికారంలో ఉన్నన్నాళ్లు ఆ పనిచేయకుండా తప్పించుకుని తిరిగాడు. 2024లో టీడీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి ఆ శాఖలో ఎలాంటి పనులు చేయడంలేదు. అత్యంత కీలకమైన పనే అయినా అధికార యంత్రాంగం ఆ దిశగా దృష్టిపెట్టడంలేదు.

త్వరలోనే పనులు పూర్తి చేయిస్తాం

చౌటపల్లె, మేకలవారిపల్లి సబ్‌స్టేషన్ల మధ్య పనులు నిలిచిపోయిన మాట వాస్తవమే. స్థంభాలు ఏర్పాటుచేసే పనులు పూర్తయ్యాయి. కేవలం కండక్టర్ వైర్ స్థంభాలకు అమర్చాల్సి ఉంది. ఈ పనులకు సంబంధించి పాత కాంట్రాక్టర్ మొగ్గు చూపనందున క్యాన్సిల్ చేస్తాం. మళ్లీ రివైజ్డ్ ఎస్టిమేట్స్ వేసి టెండర్లు పిలిచి త్వరితగతిన పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం.

-హరిబాబు, విద్యుత్‌శాఖ ఏడీఈ, పొదిలి

యోగాంధ్ర ర్యాలీలు

(5వ పేజీ తరువాయి)

గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కనిగిరిలో నిర్వహించిన ర్యాలీలో అక్కడి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి భాగస్వాములయ్యారు. రాచర్లలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండు వరకు నిర్వహించిన ర్యాలీలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎర్రగొండపాలెంలో జరిగిన ర్యాలీలో అక్కడి ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు, మార్కాపురం ర్యాలీలో సబ్‌కలెక్టర్ వెంకటత్రినాగ్ పాల్గొన్నారు. పలు మండలకేంద్రాల్లో నూ ర్యాలీలు, మానవహారాలు, ఇతర పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈనెల 21న జరిగే యోగా దినోత్సవానికి సన్నాహకంగా ప్రతి జిల్లా కేంద్రంలో ఒక రోజు భారీ యోగా కార్యక్రమాలకు ప్రభుత్వం ఆదేశించింది. అందులోభాగంగా ఈనెల 20న ఒంగోలులో పది వేల మంది మహిళలతో యోగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అద్దంకి ప్రాంతంలో అర్ధరాత్రి భూకంపం

అద్దంకి, జూన్9(ఆంధ్రజ్యోతి): అద్దంకి ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత భూమి స్వల్పం గా కంపించింది. సుమారు అర్ధరాత్రి 12-45 గంటల సమయంలో భూమి కంపించిన సమయంలో వీధులలో కుక్కలు పెద్ద గా అరిచాయి. పలువురు నిద్రలేవగా ఇళ్లలోని వస్తువులు కదిలి శబ్దాలు వచ్చాయి. అద్దంకి, కొరిశపాడు, బల్లికురవ మండలాలల పరిధిలోని పలు గ్రామాలలో భూమి కంపించింది. భూకంపం తీవ్రత స్వల్పంగానే ఉండడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదు.

ప్రతి విద్యార్థీ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

షైనింగ్ అవార్డుల ప్రదానోత్సవ సభలో కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని పట్టువిడవకుండా కృషిచేస్తే సాధించవచ్చని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ఒంగోలు సమీపంలోని సాయిబాబా సెంట్రల్ స్కూలులో సోమవారం నిర్వహించిన షైనింగ్ స్టార్స్ బహుమతుల ప్రదానోత్సవ సభలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని ప్రతి మండలం నుంచి అత్యధిక మార్కులు పొందిన ఆరుగురిని ఎంపిక చేసి షైనింగ్ స్టార్ అవార్డులను ప్రదానం చేస్తున్నామన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల సామర్థ్యాన్ని గుర్తించి అందుకు అనుగుణంగా ప్రోత్సహించాలన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ చదువుకుంటేనే భవిష్యత్ ఉంటుందనే ఉద్దేశంతో విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నదని తెలిపారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించి అవసరమైన సదుపాయాలను కల్పిస్తున్నదని చెప్పారు. ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ మంచిగా చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని తెలిపారు. బడుగు, బలహీనవర్గాల ప్రజలు జీవితంలో పైకి రావాలంటే చదువు ఒక్కటే దారి అన్నారు. అనంతరం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన


విద్యార్థులకు అవార్డు ప్రదానం చేస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే దామచర్ల, లైవ్ స్టాక్ కార్పొరేషన్ చైర్మన్ రియాజ్

242మంది పదో తరగతి, 36మంది ఇంటర్ విద్యార్థులను రూ.20వేలు నగదు పురస్కారం, సర్టిఫికెట్, మెడల్‌తో సత్కరించారు. కార్యక్రమంలో మేయర్ సుజాత, ఏపీ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ రియాజ్, డీఈవో కిరణ్‌కుమార్, ఆర్ఐవో సైమన్ విక్టర్ పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : వినూత్న ఆలోచనలను అమలు చేసే అవకాశం మీ చేతుల్లోనే ఉందని, అందువల్ల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో స్మార్ట్‌వర్క్ చేయడం ద్వారా నియోజకవర్గాలను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. నియోజకవర్గాలు, జిల్లా అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్ల రూపకల్పనపై సోమవారం అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడారు. పీ4, రాజధాని అమరావతి, పోలవరం, పరిశ్రమలు, ఎయిర్‌పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. నియోజకవర్గాలు సమగ్రంగా అభివృద్ధి చెందేలా దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ పాల్గొన్నారు. చీమకుర్తిలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

వెబ్ కౌన్సెలింగ్‌పై ఎస్జీటీల్లో ఆందోళన

(5వ పేజీ తరువాయి)

భారీగానే పెట్టుకోవాల్సి ఉంటుంది. వెబ్ కౌన్సెలింగ్ అయితే ఏస్థానం వస్తుందో ఎక్కడికి పోవాల్సి వస్తోందోనన్న ఆందోళన వారిలో నెలకొంది. వందలు, వేల సంఖ్యలో స్థానాలకు ఆప్షన్లు పెట్టుకోవడం కూడా ఆషామాషీ వ్యవహారం కాదు. మాన్యువల్ కౌన్సెలింగ్ అయితే కళ్ల ముందు కనిపించే స్థానాలను కోరుకోవచ్చని టీచర్లు ఆశపడుతున్నారు. అయితే వారికి మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అధికారులు ససేమిరా అంటున్నారు. దీనిపై టీచర్లు పోరుబాట పట్టగా ప్రభుత్వంలో మాత్రం చలనం లేదు. ఉపాధ్యాయ బదిలీల నియంత్రణ చట్టంలో వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపడతారని పేర్కొన్నందున దాని నుంచి వెనక్కు వచ్చేది లేదని అధికారులు చెప్తున్నారు.

జిల్లాలో 3,146 ఖాళీలు

జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలకు 3,146 ఖాళీలు చూపిస్తున్నారు. బదిలీల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లే సింహభాగం. 3,531 మంది బదిలీ కోసం దరఖాస్తు చేశారు. వీరిలో 2,438 మంది తప్పనిసరి బదిలీ వారు కాగా 1,093 మంది అభ్యర్థన మేరకు బదిలీ కోసం దరఖాస్తు చేశారు. జిల్లాలో సుమారు మూడు వేల మందికిపైగా సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్థానచలనం కలగనుంది.

తుది సీనియారిటీ జాబితా విడుదల

సెకండరీ గ్రేడ్ టీచర్ల తుది సీనియారిటీ జాబితా విడుదలైంది. దీంతో వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని టీచర్లను అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. ఏ టీచర్‌కు ఇబ్బంది కలగకుండా ఆప్షన్లు పెట్టించమని డీఈవో, ఎంఈవోలను కమిషనర్ ఆదేశించారు. అవసరమైనన్ని ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. మండల విద్యావనరుల కేంద్రాల్లో కూడా తగినన్ని ల్యాప్‌టాప్‌లు ఏర్పాటు చేసి కంప్యూటర్ పరిజ్ఞానం తెలిసిన టీచర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. బదిలీల ఆప్షన్లు పెట్టుకునేందుకు గడువు మంగళవారంతో ముగియనుండటంతో ఎప్పుడు పెట్టుకోవాలని టీచర్లు ఆందోళన చెందుతున్నారు. వెబ్ కౌన్సెలింగ్‌లో సులభంగా ఆప్షన్లు పెట్టుకునేందుకు వీలుగా కమిషనర్ స్లాట్ విధానాన్ని ప్రతిపాదించారు. ప్రతి 500 మందికి ఒక స్థానం కేటాయిస్తారు. ఆప్షన్లు పెట్టుకున్న వారి బదిలీ ఉత్తర్వులు జనరేట్ చేసి వారికి కేటాయించిన స్థానాలు పోను మిగిలిన వాటికి తర్వాత స్లాట్ వారికి చూపిస్తారు. ఈ విధానాన్ని అమలు చేస్తామని కమిషనర్ సంఘాల నాయకులకు చెప్పారు. ఈ ప్రతిపాదనను నాయకులు అంగీకరించకుండా మాన్యువల్ విధానం కోసం పట్టుబట్టారు.

వెబ్ అప్షన్లు ప్రారంభం

ఎస్జీటీలకు ఆప్షన్లు సోమవారం ప్రారంభమయ్యాయి. కమిషనర్ ప్రతిపాదన ప్రకారం మొదట శ్లాబులోని 500 మందికి మాత్రమే ఖాళీలు ఓపెన్ కావాల్సి ఉండగా అందరికి ఓపెన్ అవుతున్నాయి. అంటే శ్లాబ్ ప్రతిపాదన అటకెక్కినట్లు అయింది. దీంతో బదిలీ సీనియారిటీ జాబితాలోని టీచర్లందరూ తమకు కావాల్సిన స్థానాలకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాల్సి వచ్చింది. మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహణకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అంగీకరించలేదు. బదిలీల చట్టంలో వెబ్ కౌన్సెలింగ్ అని పేర్కొనడంతో ఆ ప్రకారమే జరగాలని తాను చట్టాన్ని ఉల్లంఘించనని మంత్రి తేల్చిచెప్పారు.

మానసిక రోగి మృతి

ఒంగోలు క్రైం, జూన్9(ఆంధ్రజ్యోతి): మానసిక రోగి మద్యం సేవిస్తూ పడిపోయి నురుగు కక్కి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి స్థానిక 60 అడుగులు రోడ్డులో గల కనకదుర్గా వైన్స్ షాప్ వద్ద జరిగింది. మృతుడు కొండపి మండలం నేతివారిపాలెంనకు చెందిన ఇలవర శ్రీకాంత్ (46)గా పోలీసులు గుర్తించారు. మృతుడు తండ్రి చెప్పిన వివరాల మేరకు.. శ్రీకాంత్ గతంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఆయనకు ఇప్పటికి రెండు వివాహాలు అయ్యాయి. మొదటి భార్యకు ఒక బాబు ఉన్నాడు. అయితే ఇరువురు భార్యలు అయనకు దూరంగా ఉంటున్నారు. దీంతో గత రెండేళ్లుగా మానసిక రోగంతో బాధపడుతుండగా హైదరాబాద్‌లో చికిత్స తీసుకుంటున్నాడు. అదే సమయంలో మద్యానికి బానిసైన శ్రీకాంత్ ఈనెల 6 న హైదరాబాద్ వెళ్లి మందులు తీసుకొని 8వ తేదీ ఉదయం ఒంగోలులో బస్సు దిగాడు. ఈమేరకు తనకు సమాచారం ఇచ్చినట్లు తండ్రి తెలిపారు. ఆదివారం రాత్రి స్థానిక కనకదుర్గా వైన్స్‌లో మద్యం కొనుక్కొని పక్కనే మద్యం సేవిస్తూ నురుగు కక్కి పడిపోయినట్లు తనకు ఫోన్ ద్వారా సమాచారం వచ్చిందని తెలిపారు. ఈమేరకు ఒంగోలు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఒంగోలు తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం

● బెల్లం కోటయ్యకు సన్మానం

కొండపి (టంగుటూరు), జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు మండలం జమ్ములపాలెం గ్రామంలోని షిర్డీ సాయిబాబా మందర రెండో వార్షికోత్సవం ఆది, సోమవారాల్లో రెండు రోజులు జరిగింది. ఈ సందర్భంగా 108 అభిషేకం నీటి కలశాల ఊరేగింపు, పుష్పార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఆ గ్రామంతోపాటు సమీప గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వేలాది మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. మందిరానికి ద్వారకామాయి బాబా విగ్రహాన్ని బహూకరించడంతోపాటు, అభివృద్ధికి ఆర్థికంగా సహకరించి ప్రముఖ పారిశ్రామిక వేత్త బెల్లం కోటయ్యను గ్రామ పెద్దలు, దేవాలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

గృహనిర్మాణ సంస్థలో 10 మంది డీఈఈలకు పదోన్నతులు

అమరావతి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థలో పది మంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు పదోన్నతులు లభించాయి. వారికి అందుబాటులో ఉన్న ఖాళీల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పోస్టింగులు ఇస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదోన్నతులు పొందినవారిలో జి.పిచ్చయ్య (కందుకూరు డివిజన్, నెల్లూరు జిల్లా), పి.వెంకటరావు (మార్కాపురం డివిజన్, ప్రకాశం జిల్లా), కె.రమేష్‌రెడ్డి (మదనపల్లి డివిజన్, అన్నమయ్య జిల్లా), ఎన్.సుబ్రహ్మణ్యం (ప్రొద్దుటూరు డివిజన్, (కడప జిల్లా), వై.లక్ష్మీనారాయణమ్మ (ధర్మవరం డివిజన్, శ్రీ సత్యసాయి జిల్లా), బి.వెంకటరమణ (పెనుగొండ డివిజన్, సత్యసాయి జిల్లా), కె.సూరిబాబు (టెక్కలి డివిజన్, శ్రీకాకుళం జిల్లా), ఎం.రామోజీ నాయక్ (శ్రీకాకుళం డివిజన్, (పార్వతీపురం మన్యం జిల్లా), కె.చంద్రశేఖర్ (పాలకొండ డివిజన్, పార్వతీపురం మన్యం జిల్లా), కె.వి.వి.ఎస్.ప్రసాద్ (జంగారెడ్డిగూడెం డివిజన్, ఏలూరు జిల్లా) ఉన్నారు.

రాజకీయ జోక్యం ఉండదు

(5వ పేజీ తరువాయి)

తీసుకోవాలని సీతారామయ్యకు సూచించారు. సమావేశంలో ఏపీ లైవ్ స్టాక్ కార్పొరేషన్ చైర్మన్ రియాజ్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత తదితరులు మాట్లాడారు. చివరిలో డాక్టర్ సీతారామయ్య మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకం వమ్ముకాకుండా పనిచేసే మంచి ఫలితాలు రాబడతానని హామీ ఇచ్చారు. తొలుత సీతారామయ్య బంధుమిత్రుల సమక్షంలో అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతోపాటు అభిమానులు, పలువురు వైద్యులు, ఇతర ప్రముఖులు పాల్గొని అభినందించారు. సీతారామయ్య శుభాకాంక్షలు తెలిపిన వారిలో డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్, డాక్టర్ విజయకుమార్, గోరంట్ల పెద్దవీరయ్య (కేబీ), టీడీపీ నాయకులు నల్లమోతు బాలగంగాధర్, మక్కెన శ్రీనివాసరావు, గుండపనేని శ్రీనివాసులు, మండవ మురళీకృష్ణ, చిడిపోతు వెంకటేశ్వర్లు, డాకా శ్రీనివాస రెడ్డి, నాగబోయిన చలపతిరావు, నలమలపు అంకిరెడ్డి, మారెళ్ల శ్రీనివాసరావు, గుమ్మడి సాయిబాబు, కాకర్ల లక్ష్మీవరప్రసాద్, మండల ఆంజనేయులు, కొండ్రగుంట రంగారావు, కొమ్మాలపాటి సురేష్, మారెళ్ల రాంజేంద్రప్రసాద్, కొప్పోలు బాలాజీరావు(రిటైర్డ్ మేనేజర్, పీడీసీసీబీ) కొప్పోలు వీరయ్య (మాజీ సర్పంచ్, హెచ్ నిడమానూరు), మారెడ్డి సుబ్బారెడ్డి, కామేపల్లి శ్రీనివాసరావు, షేక్ ఖాజా వలి, సూదనగుంట అజయ్‌కుమార్, రావుల పద్మజ, చల్లగుండ్ల అనంతరంగనాథ్, నందిగం కోటేశ్వరరావు, కొమ్మినేని రమేష్‌బాబు(సర్పంచ్) ఉన్నారు.


డాక్టర్ సీతారామయ్యను సన్మానిస్తున్న కమ్మ సంఘం ప్రతినిధులు


డాక్టర్ సీతారామయ్యను సన్మానిస్తున్న టీడీపీ మహిళా విభాగం ప్రతినిధులు

కబళించిన మృత్యువు

● బైక్‌ను ఢీకొన్న గూడ్సు వాహనం ● మహిళ మృతి

ఒంగోలు క్రైం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి రోడ్డుమీదకు రాగానే మృత్యురూపంలో వచ్చిన గూడ్సు వాహనం మహిళను కబళించింది. ఈ దుర్ఘటన సోమవారం కొప్పోలు రోడ్డులోని డ్రీమ్స్ స్కూల్ సమీపంలో జరిగింది. స్థానిక రాజీవ్ గృహకల్ప ఆరో లైన్‌లో నివాసం ఉంటున్న ఊరట్ల లక్ష్మి(48) ప్రమాదంలో మృతిచెందింది. లక్ష్మి తన అల్లుడుతో మోటార్‌బైక్‌పై ఒంగోలు వెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరారు. ఇంటి నుంచి 100 మీటర్లలో కొప్పోలు రోడ్డు ఉంది. అక్కడ మలుపు తిరిగే సమయంలో గూడ్స్ వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో మోటార్‌బైక్‌పై వెనుక కూర్చున లక్ష్మి రోడ్డు మీద పడింది. ఆమెపైనుంచి గూడ్సు వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటనా స్థలాన్ని ఒంగోలు తాలుకా పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులపై మండిపడిన స్థానికులు

ప్రమాదం జరిగిన వెంటనే 100 కు స్థానికులు సమాచారం అందించారు. అయితే ప్రమాదం 11.45 గంటలకు జరిగితే పోలీసులు 12.45 తరువాత వచ్చారు. దీంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

‘ముప్పా’ ఇంట్లో పోలీసుల తనిఖీలు


ముప్పా సురేష్ ఇంట్లో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ రజియా సుల్తానా

నాగులుప్పలపాడు, జూన్9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసులో సూత్రధారిగా పోలీసులు భావిస్తున్న అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన వ్యాపారవేత్త ముప్పా సురేష్ ఇంట్లో స్థానిక ఎస్ఐ రజియా సుల్తానా తన సిబ్బందితో సోమవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు.వీరయ్య చౌదరి హత్య కేసు దర్యాప్తులో భాగంగా ఆ కేసు విచారణాధికారి ఆదేశాల మేరకు కేసులోని పలువురు ముద్దాయిలకు ముప్పా సురేష్‌కు మధ్య జరిగిన నగదు లావాదేవీలకు సంబంధించిన పలు ఆధారాల కోసం స్థానిక వీఆర్వో సుబ్బయ్య, వీఆర్ఏ రామకోటయ్య సమక్షంలో ఎఎస్ఐ రజియా సుల్తానా తనిఖీలు నిర్వహించారు.

కౌలురైతులకు హామీ లేని రుణాలు ఇవ్వాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏపీ రైతు సంఘం నాయకుడు వడ్డె హనుమారెడ్డి

ఒంగోలు(రూరల్), జూన్9(ఆంధ్రజ్యోతి):కౌలు రైతులకు ఎలాంటి హామీ లేకుండా రెండు లక్షల వరకు రుణం ఇవ్వాలని ఏపీ రైతు సంఘ అధ్యక్షుడు వడ్డెహనుమారెడ్డి డిమాండ్ చేశారు. ఒంగోలు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం కౌలు రైతుల సమస్యలపై ఒంగోలు అర్బన్ తహసీల్దార్ మధుసదనరావుకి ,రూరల్ తహసీల్దార్ నాయబ్‌రసూల్‌కి రైతు సంఘనాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హనుమారెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిచాలన్నారు. సొంత భూములు గల రైతులతో సంబంధం లేకుండా కౌలురౌతులను గుర్తించాలన్నారు. వారికికౌలురైతు కార్డులుఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో రైతు సంఘ నాయకులు పోలవరపు కోటేశ్వరరావు, వడ్డే కోటి రెడ్డి, గద్దల శ్యాంసన్ ,ఉప్పటూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీకి 96శాతం మంది హాజరు

ఒంగోలు విద్య, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సోమవారం జరిగిన మెగా డీఎస్సీకి 96శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. రెండు సెషన్లలో 1,335 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 1,276 మంది హాజరయ్యారు. 59 మంది గైర్హాజరయ్యారు. ఒంగోలులోని బ్రిలియంట్ కంప్యూటర్ సంస్థ, క్విస్, పేస్ ఇంజనీరింగ్ కళాశాలలు, మార్కాపురంలోని శామ్యూల్ జార్జి ,కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలు, ఒంగోలులోని ఎన్‌సీసీఎన్ఏఐ సంస్థలో పరీక్షలు జరిగాయి.

విద్యాశాఖలో 48 మంది బదిలీ

ఒంగోలు విద్య, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖలో పనిచేస్తున్న 48 మంది ఉద్యోగులను బదిలీ చేస్తూ డీఈవో కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. డీఈవో కార్యాలయం,సమగ్ర శిక్ష ప్రాజెక్టు కార్యాలయం, మైనంపాడు డైట్, ప్రభుత్వ హైస్కూళ్లలో పనిచేస్తున్నవారిని బదిలీ చేశారు. 15 మంది సీనియర్ సహాయకులు, 15 మంది జూనియర్ సహాయకులు,పదిమంది రికార్డు అసిస్టెంట్లు,ఇద్దరు టైపిస్టులు, ఐదుగురు ఆఫీసు సబార్డినేటర్లు, ఒక నైట్ వాచ్‌మెన్‌ను బదిలీ చేశారు.

నేటి నుంచి డిగ్రీ మూల్యాంకనం

ఒంగోలు విద్య, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్శిటీ డిగ్రీ నాల్గవ సెమిస్టర్ మూల్యాంకనం మంగళవారం నుంచి స్థానిక ప్రభుత్వమహిళా కళాశాలలో జరుగుతుందని క్యాంపు ఆఫీసర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. కల్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లీషు తప్ప మిగిలిన అన్ని సబ్జెక్టుల పేపర్లు మూల్యాంకనానికి వచ్చాయన్నారు. యూనివర్శిటీ గుర్తింపు కార్డుతో సంబంధిత ప్రిన్సిపాల్స్ లేఖలతో మూల్యాంకన విధులకు హాజరు కావాలని కోరారు.

హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా ఉండాలి

ఎర్రగొండపాలెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కుల సాధనకు మాలలు అందరూ ఐక్యంగా ఉండాలని కోరుతూ సోమవారం మాలమహానాడు నియోజకవర్గ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం త్రిపురాంతకం రోడ్డులో నిర్వహించిన సభకు వేదిక నియోజకవర్గ అధ్యక్షులు ఎలిసెల కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా, మాల ఉద్యమ నాయకులు రేంజర్ల రాజేష్ ప్రసంగించారు. మహానీయుడు అంబేద్కర్ వారసులుగా ఆయన అందించిన రాజ్యాంగ ఫలాలు పొందాలంటే మాలలు అందరూ ఐక్యంగా పోరాడాలన్నారు. గౌరవసలహాదారుడు సాతులూరి ప్రభాకరరావు, మేడబలిమి అచ్యుతరావు, తుమాటి అచ్చయ్య, ఐక్యవేదిక మండల కమిటీ అధ్యక్షుడు గుంటి అశోక్‌కుమార్, త్రిపురాంతకం అధ్యక్షుడు చిన్నవెంకటస్వామి, గోనా సతీష్, గొట్టిముక్కల అంజిబాబు, రాగాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మద్యం సేవించి యువకుడు హల్‌చల్

ఒంగోలు క్రైం, జూన్9 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్లౌపేట మూడో లైన్‌లో సోమవారం మద్యం సేవించిన విశాఖపట్నంకు చెందిన కార్తీక్ అనే యువకుడు హల్‌చల్ చేశాడు. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. కార్తీక్ తన భార్యతో బాపట్ల వచ్చాడు. అక్కడ భార్యతో గొడవపడి రైలులో ఒంగోలు వచ్చి మద్యం సేవించి క్లౌపేట వద్ద స్థానికులను భయభ్రాంతులకు గురిచేశారు. స్థానికులు 108 కు ఫోన్ చేయగా వారికి అదుపు కాలేదు. దీంతో ఒంగోలు టూటౌన్ పోలీసులు వెళ్ళి యువకుడిపై నీళ్లు చల్లారు. అనంతరం మత్తు దిగిన తరువాత యువకుడు అక్కడ నుంచి ఆటోలో రైల్వే స్టేషన్‌కు వెళ్లి పోయాడు.

లారీ ఢీకొని విద్యార్థి మృతి

అద్దంకి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని విద్యార్థి మృతిచెందిన ఘటన పట్టణంలోని పోతురాజు గుడి సమీపంలో సోమవారం చోటుచేసుకొంది. పోలీసుల కథనం మేరకు... బల్లికురవ మండలం వి.కొప్పెరపాడుకు చెందిన మద్దిపాటి రాజేష్(14) సోమవారం మోటార్‌సైకిల్‌పై అద్దంకి పట్టణంలోకి వస్తున్నాడు. పట్టణంలోని పోతురాజుగండి సమీపంలో కంటైనర్ లారీ, మోటార్‌సైకిల్ పక్కపక్కనే వెళ్లే సమయంలో ఢీ కొట్టింది. దీంతో రాజేష్ లారీ టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామంలోని హైస్కూల్‌లో రాజేష్ 9వ తరగతి పూర్తి చేసి ఈ ఏడాది 10వ తరగతిలో చేరాల్సి ఉంది. వేసవి సెలవులకు ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్న నేపథ్యంలో అద్దంకిలో బంధువుల హోటల్‌కు వస్తున్నాడు. ఘటనా స్థలాన్ని సీఐ సుబ్బరాజు పరిశీలించారు. లారీ కింద ఉన్న రాజేష్ మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఏడాది క్రితం రాజేష్ తండ్రి చిన్న సైదులు అనారోగ్యంతో మృతి చెందాడు. చిన్నసైదులుకు కుమారుడితోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారికి వివాహం అయ్యింది. చిన్న సైదులు మృతి చెందటంతో భార్య లక్ష్మీ కొడుకు రాజేష్ ఉంటున్నారు. చదువుకునే కొడుకు మృతి చెందటంతో లక్ష్మీ కన్నీరు మున్నీరువుతోంది.

ఉపాధ్యాయుల నిరాహార దీక్షలు

ఒంగోలు విద్య, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల బదిలీల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టీచర్లు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరాహారదీక్షలు చేపట్టారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఈ దీక్షలు చేపట్టారు. నిరాహారదీక్ష కార్యక్రమానికి యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్‌అబ్దుల్ హై అధ్యక్షత వహించారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. సెకండరీ గ్రేడ్ టీచర్లకు వెబ్ కౌన్సెలింగ్ వద్దని, మాన్యువల్ విధానంలో నిర్వహించాలని అన్ని ఉపాధ్యాయ సంఘాలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. షేక్ అబ్దుల్ హై మాట్లాడుతూ వెబ్ కౌన్సెలింగ్ విషయంలో ప్రభుత్వ మొండివైఖరిని నిరసించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. డి.శ్రీనివాసులు మాట్లాడుతూ అధికారులు, ఉపాధ్యాయులను వెబ్ ఆప్షన్ల కోసం బలవంతంగా వత్తిడి చేయడం తగదన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ బదిలీల సీనియారిటీ జాబితాలోని తప్పులను సవరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు ఎర్రయ్య, వెంకట్రావు, లక్ష్మీనారాయణ, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

● యోగాసనాల్లో చందలూరు విద్యార్థుల సత్తా



యోగాసన పోటీల్లో సత్తాచాటిన బాల బాలికలను అభినందిస్తున్న బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి, అధికారులు



ప్రత్యేక ఆసనంతో మద్దిశెట్టి వెంకటేష్

పంగులూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల కేంద్రంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన యోగా, ఇతర పోటీల్లో చందలూరు పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లాకేంద్రంలో యోగాసనాలు, సూర్యనమస్కారం, ప్రాణాయామం, ధ్యానం పోటీలు నిర్వహించారు. 10 నుంచి 18 సంవత్సరాల వయస్సు వారికి నిర్వహించిన యోగాసన పోటీలలో బాలికల విభాగంలో నాయపాము శృతి, ఎన్.భవ్యశ్రీ, బాలుర విభాగంలో మద్దిశెట్టి వెంకటేష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రాణాయామం పోటీలో నాయపాము ప్రీతి, ధ్యానంలో నాయపాము హాసిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విశాఖలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో ఈ ఐదుగురు పాల్గొంటారని పాఠశాల పీడీ ప్రతిమ తెలిపారు. యోగాసన, ఇతర పోటీలలో నైపుణ్యం చాటిన బాల బాలికలను బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి , పలువురు అధికారులు అభినందించినట్లు పీడీ ప్రతిమ తెలిపారు.

సత్తాచాటిన ఎనికపాడు పొట్టేళ్లు

● పాతసింగరాయకొండలో హోరాహోరీగా పోటీలు



పోటీల్లో తలపడుతున్న పొటేళ్లు

సింగరాయకొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధి గాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామానికి చెందిన శ్రీకృష్ణ యాదవ్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో సోమవారం ఆలయ సమీపంలో రాష్ట్రస్థాయి పొట్టేళ్ల పోటీలను నిర్వహించారు. వీటిని టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య ప్రారంభించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ఆరు జతల పొట్టేళ్లు పాల్గొన్నాయి. తొలి రౌండ్‌లో ఆరు జతల మధ్య పోటీ నిర్వహించారు. రెండో రౌండ్‌లో మొదటి రౌండ్‌లో గెలుపొందిన మూడు జతల మధ్య పోటీలు జరిగాయి. సంతనూతలపాడు మండలం ఎనికపాడు గ్రామానికి చెందిన యద్దనపూడి శ్రీనివాస్ పొట్టేళ్ల జత సత్తా చాటింది. ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. రెండో బహుమతిని బాపట్ల జిల్లా మేదరమెట్లకి చెందిన మేదరమెట్ల రవి పొట్టేళ్లు దక్కించుకున్నాయి. తృతీయ స్థానంలో అద్దంకి మండలం పొటిలకపూడి గ్రామానికి చెందిన మారుబోయిన దుర్గాప్రసాద్, చతుర్థ స్థానంలో బాపట్ల జిల్లా రేణంగివరం చెందిన ఎర్రిబోయిన రామారావు పొట్టేళ్లు నిలిచాయి. నర్రావారిపాలెంకు చెందిన టీడీపీ నేత నర్రా రాంబాబు మొదటి బహుమతి రూ.25వేలు, వావిలేటిపాడుకి చెందిన పటాపంజుల కొండలు ద్వితీయ బహుమతి రూ.20వేలు, నర్రావారిపాలెంకు చెందిన కొనికి అమర్‌నాథ్ తృతీయ బహుమతి రూ.15వేలు, సోమరాజుపల్లికి చెందిన మసనం బ్రదర్స్ నాల్గో బహుమతి రూ.10వేలు విజేతలుగా నిలిచిన పొట్టేళ్ల యజమానులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ యాదవ్ యూత్ ఫోర్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యోగాంధ్రలో ప్రజలంతా భాగస్వాములు కావాలి

ర్యాలీలో కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్ పిలుపు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : అన్నివర్గాల ప్రజలను యోగాంధ్ర కార్యక్రమంలో భాగస్వామ్యం చేసే లక్ష్యంతో జిల్లాలో వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన ర్యాలీని శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, బీఎన్ విజయకుమార్, పర్యాటకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజీ, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణలతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జూన్ 21న వైజాగ్‌లో జరిగే యోగా కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాల్గొంటున్నారని తెలిపారు. అందులో భాగంగా గత నెల 21 నుంచి యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 20వ తేదీన 10వేల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులతో యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్ధన్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే దామచర్ల

మాట్లాడుతూ యోగా ఔన్నత్యాన్ని చాటిచెప్పేందుకు యోగంధ్ర కార్యక్రమన్ని రోజుకొక చోట అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయకుమార్ మాట్లాడుతూ యోగసనాలతో శారీరక ఆరోగ్యమే కాకుండా మానసిక ఆరోగ్యం సొంతమవుతుందని అన్నారు. ఈ ర్యాలీ స్థానిక కలెక్టరేట్ వద్ద నుంచి నెల్లూరు బస్టాండు మీదుగా మినీ స్టేడియం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, వివిధ శాఖల అధికారులు వెంకటేశ్వర్లు ఉన్నారు.

శేషవాహనంపై వరాహ లక్ష్మీనరసింహుడి వైభోగం

కనులపండువగా బ్రహ్మోత్సవాలు

సింగరాయకొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ సింహాచలంగా పేరుగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. నాల్గోరోజైన సోమవారం మూలవిరాట్ వరాహ లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లు రాజ్యలక్ష్మి, గోదాదేవి, యోగానంద లక్ష్మీనరసింహస్వామి, స్వయంభు ఆంజనేయుడిని సుందరమైన పూలతో అలంకరించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకొన్నారు. కొందరు మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం పూజల అనంతరం లక్ష్మీనరసింహుడు చప్పరం వాహనంపై కొలువుదీరారు. అనంతరం మోతకాపులు స్వామివారిని గ్రామోత్సవానికి తీసుకెళ్లారు. రాత్రికి స్వామివారు శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. లక్ష్మీనరసింహుడిని గ్రామ వీధుల్లో మోతకాపులు ఊరేగించారు. ఆలయ అధికారులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో



చప్పరంపై స్వామివారు

ఈవో పి.కృష్ణవేణి, ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట శేషాలక్ష్మీనరసింహాచార్యులు, అర్చకుడు నరసింహాచార్యులు, రికార్డు అసిస్టెంట్ బాపట్ల బ్రహ్మయ్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. మంగళవారం ఉదయం స్వామివారికి చప్పరసేవ, రాత్రికి హనుమంతసేవ జరుగుతాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గ్రామానికి చెందిన శ్రీకృష్ణ యాదవ్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు.

సత్తాచాటిన పెదపూడి ఎడ్లు

● ముగిసిన పోల్‌రాదా పోటీలు

చినగంజాం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మున్నంవారిపాలెంలో రాష్ట్రస్థాయి నాటుబండి పోలురాధా ఎడ్ల (న్యూ జూనియర్స్ విభాగం) పందేల్లో బాపట్ల జిల్లా, అమృతలూరు మండలం పెదపూడి గ్రామానికి చెందిన ఎడ్లు ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నాయి. గ్రామ ఎంప్లాయిస్ అసోసియేషన్, గ్రామ పెద్దలు, గ్రామస్థుల సహకారంతో నిర్వహణ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పోలేరమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని మున్నం రామాంజనేయులురెడ్డి జ్ఞాపకార్థం గ్రామ టైరుబండ్ల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. పోటీలలో విజేతలైన ఎడ్ల యజమానులకు సోమవారం నగదు బహుమతులను అందజేశారు. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం, పెదపూడి గ్రామానికి చెందిన ఆలా హరికృష్ణ యాదవ్ ఎడ్ల జత నిర్ణీత పది నిమిషాల వ్యవధిలో 3,355.8 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి రూ.30,000లను



ప్రథమ బహుమతి సాధించిన ఎడ్ల యజమానులకు నగదు బహుమతి అందజేస్తున్న కమిటీ సభ్యులు

కైవసం చేసుకున్నాయి. నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన బొడ్డు బాలకృష్ణ ఎడ్ల జత 3,179 అడుగుల దూరం లాగి రెండవ బహుమతి రూ.25,000, గుంటూరు జిల్లా కాకుమాను మండలం, గార్లపాడు గ్రామానికి చెందిన రామినేని శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా చెరుకుపల్లికి చెందిన జజ్జర వెంకట శ్యామ్‌కృష్ణల ఎడ్ల జత 2954.2 అడుగుల దూరం లాగి మూడవ బహుమతి రూ.20,000 గెలుచుకున్నాయి. బాపట్ల జిల్లా కొత్తమద్దిబోయినవారిపాలెంకు చెందిన పిన్నిబోయిన మణీంద్ర ఎడ్ల జత (మైలగిత్త-తెల్లగిత్త) 2853.8 అడుగుల దూరం లాగి నాలుగవ బహుమతి రూ.15,000, కృష్ణా జిల్లా చినపులపాకకు చెందిన ఆర్‌వీఎస్ బుల్స్ ఎడ్ల జత, బాపట్ల మండలం ఆసోదివారిపాలెంకు చెందిన మర్రి కిషోర్‌రెడ్డిల ఎడ్లజత (కంబైండ్) 2836.7 అడుగుల దూరం లాగి ఐదవ బహుమతి రూ.10,000, చినగంజాం మండలం సోపిరాల గ్రామానికి చెందిన చెరుకూరి ఉషారాణి ఎడ్లజత 2743 అడుగుల దూరం లాగి ఆరువ బహుమతి రూ.8,000, ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన పగడాల బ్రహ్మారెడ్డి ఎడ్ల జత 2697 అడుగుల దూరం లాగి ఏడవ బహుమతి రూ.5,000 కైవసం చేసుకున్నాయి. న్యాయ నిర్ణేతగా తంగెడ హుస్సేన్ వ్యవహరించారు.

పొగాకు వేలం 8వరౌండ్ షెడ్యూలు

● 3 బేళ్లు మాత్రమే తీసుకు రావాలి

ఒంగోలు(రూరల్), జూన్9(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలం కేంద్రం రెండులో జరిగే వేలానికి బ్యారన్‌కు 3 బేళ్లు మాత్రమే తీసుకు రావాలని, ఒక్కో బేలు 150 కేజీలకు మించ ఉండరాదని వేలం నిర్వహణాధికారి జె.తులసి సూచించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ 12వతేదీన సీహెచ్ ఉప్పలపాడు, దొడ్డవరప్పాడు, వెంకటరాజుపాలెం, ఏడుగుండ్లపాడు, ఉలిచి, 13వతేదీన టి.అగ్రహారం, వలేటివారిపాలెం, మద్దిరాలపాడు, 14తేదీన చేకూరపాడు, ఇనమనమెళ్లూరు, ఆలూరు, గాడెపాలెం, 16న దశరాజుపల్లి, గుడిమెళ్లపాడు, బొడ్డులూరివారిపాలెం, దేవరంపాడు, కరవది, త్రోవగుంట, పానకాలపాలెం రైతులు పొగాకు బేళ్లను తీసుకురావాలని ఆమె కోరారు.

ఉప్పుగుండూరులో కరెంటు కష్టాలు

● వేధిస్తున్న లోవోల్టేజీ సమస్య ● తెగిపడుతున్న తీగలు ● ఓవర్ లోడుతో కాలిపోతున్న ఫ్యూజులు ● పట్టించుకోని అధికారులు

నాగులుప్పలపాడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పుగుండూరులో విద్యుత్ సమస్యలు తీవ్రమవుతున్నాయి. నిత్యం లోవోల్టేజీ రావడం, పలుచోట్ల తీగలు తెగిపోవడం, ఓవర్‌లోడ్ కారణంగా ఫీజులు కాలిపోవడం లాంటి కారణాల వల్ల ప్రజలకు కరెంటు తిప్పలు తప్పడం లేదు. పరిష్కరించాల్సిన విద్యుత్ అధికారులు చలనం లేకుండా ఉన్నారు.

ఉప్పుగుండూరులో ఏదోఒక ప్రాంతంలో తీగలు తెగిపడి గంటల కొద్దీ విద్యుత్‌అంతరాయం ఏర్పడుతోంది. ప్రధానంగా దళిత కాలనీలలోనైతే సమస్య తీవ్రమౌతోంది. 5,6,7,8 వార్డులతో పాటు బ్యాంక్ బజారులోనూ నిత్యం లోవోల్టేజీ సమస్య వేధిస్తోంది. 230 నుంచి 240 వాట్స్ వరకు గృహాలకు విద్యుత్ అందాల్సి ఉండగా కేవలం 150 నుంచి 170 వాట్స్ మాత్రమే వస్తోంది. రైల్వేస్టేషన్ రోడ్డులోని దళిత కాలనీని ఆనుకొని ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద రెండు, బ్యాంక్ బజారు సమీపంలోని సరస్వతి స్కూల్ వద్ద మరో ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నా చాలా కాలం నుంచి లోవోల్టేజీ సమస్య



ఉప్పుగుండూరులో తెగిపడిన విద్యుత్ తీగ

తప్పడం లేదు. గత వారం రోజుల నుంచి కాలేజీ వద్ద రెండు మూడుసార్లు, ఉత్తర బజారులో ఓసారి రాత్రి వేళల్లో విద్యుత్ లైన్ తెగిపోయి కిందపడింది. సమయానికి అటువైపుగా ఎవరు వెళ్లకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సమస్యలపై అధికారులు దృష్టి సారించడం లేదు. ఇక్కడ విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి ఏఈగా పనిచేస్తున్న రమేష్‌బాబు అందుబాటులో ఉండటం లేదు. ఒంగోలులో నుంచే ఇక్కడ విధులు నిర్వహిస్తారు. సబ్‌స్టేషన్ సిబ్బందిదీ ఇష్టారాజ్యంగా ఉంది. గ్రామంలో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు



ఉప్పుగుండూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ (ఫైల్)

ఏర్పాటు చేసేందుకు అనుమతులు వచ్చినా తాము సూచించిన చోటే స్థలం కావాలంటూ కొర్రీలతో సిబ్బంది కాలయాపన చేస్తున్నారు. దీనికితోడు అనేక ప్రాంతాల్లో కాలం చెల్లిన విద్యుత్ స్తంభాలు, తీగలు (కండక్టర్లు)లతో ప్రమాదం పొంచి ఉంది. తమ వార్డులో నిత్యం లోవోల్టేజీ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, చీకటి పడితే చాలు లైట్లు దిమ్ముగా వెలుగుతున్నాయని 5వ వార్డు మెంబరు అత్తంటి కోటేశ్వరరావు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ సమస్యను తీర్చాలని కోరారు.



పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు

న్యాయం కోసం పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన

● రోడ్డు ప్రమాద మృతుడి కుటుంబసభ్యుల ఆగ్రహం

● నిరసనకారులకు పోలీసులకు వాగ్వాదం.. తోపులాట

సింగరాయకొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ పొటేళ్ల జగదీష్ మృతికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌ను అరెస్టు చేయాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు స్థానిక పోలీసు స్టేషన్ ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా నిరసనకారులకు, పోలీసులకు మధ్య వాగ్వివాదం జరిగింది. తోపులాట కూడా చోటుచేసుకుంది. దీంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని జీవీఆర్ ఫ్యాక్టరీ ఎదుట జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ఆటోను వెనుకవైపు వస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొట్టింది. ఆదివారం జరిగిన ఈ ప్రమాదంలో మండలంలోని సోమరాజుపల్లి గ్రామానికి ఆటో డ్రైవర్ పొటేళ్ల జగదీష్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదం అనంతరం ట్రాక్టర్ నడుపుతున్న ఉలవపాడు మండలం మన్నేటికోట గ్రామానికి చెందిన వంకాయలపాటి కోటేశ్వరరావు ట్రక్కును సంఘటనా స్థలంలో వదిలివేసి ఇంజన్‌తో అక్కడి నుంచి పారిపోయాడు. అనంతరం మృతుడి తండ్రి మాల్యాద్రి ఫిర్యాదు మేరకు ఎస్సై బి.మహేంద్ర కేసు నమోదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. ఈక్రమంలో ప్రమాదానికి కారణమైన కోటేశ్వరరావును అరెస్ట్ చేయాలని, మృతుడి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని మృతుడి బంధువులు సోమవారం భారీ సంఖ్యలో పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సమయంలో పోలీసులకు, మృతుడి బంధువుల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం ఉద్రిక్తతల నడుమ స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. ఈ సమయంలో దురుసుగా ప్రవర్తించిన ఒక యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆందోళన కొనసాగుతుండగానే ట్రాక్టర్ డ్రైవర్ కోటేశ్వరరావుని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై చట్టపరంగా కేసు నమోదుచేసి న్యాయం చేస్తామని ఎస్సై బి.మహేంద్ర హామీ ఇచ్చారు. దీంతో మృతుడి బంధువులు ఆందోళన విరమించారు.

విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్ తనిఖీలు

ఒంగోలు క్రైం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విద్యుత్ చౌర్యంపై ఆశాఖ విజిలెన్స్ అధికారులు సోమవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉషారాణి, ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.హరిబాబు నేతృత్వంలో 66 మంది ఉద్యోగులు, 11 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల బృందం వేర్వేరుగా తనిఖీలు నిర్వహించింది. ఈ దాడుల్లో అనధికారకంగా లోడు వాడుతున్న 126 సర్వీసులను, ఒక తప్పు కేటగిరీలో వాడుతున్న సర్వీసును గుర్తించిన



తనిఖీల వివరాలు పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

అధికారులు వినియోగదారుల నుంచి రూ. 6,06,750ల అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఈఈ ఉషారాణి, ఓఎఈ హరిబాబు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు తాము వాడుకునే విద్యుత్‌కు అనుగుణంగా చార్జీలు చెల్లించాలని తెలిపారు. అధికారులకు తెలియకుండా అనధికారికంగా విద్యుత్ వినియోగించినవారిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలు జిల్లా వ్యాప్తంగా నిరంతరం కొనసాగుతున్నాయని, విద్యుత్ వినియోగదారులు గుర్తించాలని తెలిపారు.

ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు ఓఎంసీ అంగీకార పత్రం తప్పనిసరి

ఒంగోలు, కార్పొరేషన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : నగరపరిధిలోని ఆస్తులు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు భూమి యజమానులు తప్పనిసరిగా కార్పొరేషన్ నుంచి అంగీకార పత్రం పొందాల్సి ఉందని కమిషనరు కే. వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని రిజిస్టర్ భూములు క్రయ,విక్రయాల సమయంలో ఆ భూమి తాలూకా పన్ను బకాయిలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఎవరైనా ఆస్తుల కొనుగోలు చేసుకునేవారు ఆ ఆస్తికి సంబంధించిన విక్రయదారుల పేరున కార్పొరేషన్ వారికి ఎలాంటి పన్ను బకాయి లేదని నిర్ధారించుకొని కొనుగోలు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆస్తి, నీటి పన్ను బకాయిలు ఉన్న ఆస్తులు క్రయ, విక్రయం జరిగినప్పటికీ పన్ను పేరు మార్పునకు వీలుకాదని, బకాయి ఉన్న మొత్తంకు కొనుగోలుదారులు బాధ్యులు అవుతారని, ఈ విషయాన్ని గమనించి, రిజిస్ట్రేషన్‌కు ముందే పన్ను బకాయిలు చెల్లించి సహకరించాలని కమిషనర్ పేర్కొన్నారు.

అవీ..ఇవీ



యోగా పోటీల ప్రారంభంలో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

జిల్లా స్థాయి యోగా పోటీలు ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మినీ స్టేడియంలో సోమవారం జిల్లా స్థాయి యోగా పోటీలను జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ ప్రారంభించారు. మండల, మునిసిపల్ స్థాయిల్లో జూనియర్ విభాగంలో ఆసనాలు, సూర్య నమస్కారాలు, ధ్యానం, ప్రాణాయామం అంశాలలో జరిగిన పోటీల్లో విజేతలకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించారు. సుమారు వంద మంది ఈపోటీల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ యోగా మన జీవితంలో ఒక భాగం కావాలన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేతలు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో గెలుపొంది విజేతలుగా నిలువాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు శ్రీమన్నారాయణ, వెంకటేశ్వర్లు, పద్మజ, భీమ్‌నాథ్, టి. భరద్వాజ్, రాజరాజేశ్వరి, పతంజలి యోగా గురువు బాలసుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.


విద్యార్థికి పతకాన్ని అందిస్తున్న క్విస్ యాజమాన్యం

షూటింగ్‌లో క్విస్ విద్యార్థుల ప్రతిభ

ఒంగోలు విద్య, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్‌లో క్విస్ విద్యా సంస్థల విద్యార్థులు నలుగురు పతకాలు సాధించారు. అండర్ 16 విభాగంలో క్విస్‌హైస్కూలు విద్యార్థులు బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయిలో భ్రమర్ రెండో స్థానం, పి. నాగరిషిత మూడవ స్థానం, బాలుర విభాగంలో బి. అవినాష్‌రెడ్డి మూడో స్థానంలో నిలిచారు. అండర్ 21 కేటగిరీలో క్విస్ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ మూడో సంవత్సరం విద్యార్థి సురేందర్ మొదటి స్థానంలో నిలిచారు. ఈ నలుగురికి పతకాలను బహూకరించారు. షూటింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను క్విస్ విద్యా సంస్థల అధినేత నిడమానూరి సూర్యకళ్యాణచక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్. శ్రీ గాయత్రి, ప్రిన్సిపాల్ వైవీ హనుమంతరావు, హైస్కూలు ప్రిన్సిపాల్ కమలేశ్వరిలు అభినందించారు.


జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

ఒంగోలు, కార్పొరేషన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 7వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఒంగోలు నగర పరిధిలోని అన్నీ డివిజన్లలో ఎమ్మార్పీఎస్ జెండాలు ఆవిష్కరిస్తున్నట్లు నగర అధ్యక్షుడు గుంటూరు ప్రభుదాస్ పేర్కొన్నారు. తొలిసారిగా సోమవారం నగరంలోని మామిడిపాలెంలో జెండా ఆవిష్కరణ చేసిన సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిజేయనున్నట్లు ప్రభుదాస్ తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి సొట్ట నరేంద్ర , ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి తిరువీధి బాబు, ఐదుపోగుల అజయ్ బాబు, అనిల్, బోడెద్దుల ధనరాజ్, పున్నూరి నరేష్, రవి, పలువురు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మీకోసం అర్జీలపై ప్రత్యేక దృష్టి

జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ


మీకోసంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మీకోసంలో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టిసారించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలుతీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌సెల్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలురకాల సమస్యలపై అర్జీలను జేసీకి వివరించారు. ఆయా సమస్యలపై జేసీ మాట్లాడుతూ మీకోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రతి అర్జీపై ప్రత్యేకదృష్టి పెట్టి వాటికి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అర్జీలు పెండింగ్‌లో ఉండరాదని అన్నారు. అధికారులు ప్రతిరోజూ లాగిన్ అయ్యి ఆన్‌లైన్‌లో వచ్చిన అర్జీలను చూడాలని, అలాగే వచ్చిన అర్జీలకు సరైన పరిష్కారం చూపుతూ రీఓపెన్ కేసులు రాకుండా చూడాలని జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో చిన ఓబులేషు, డిప్యూటీ కలెక్టర్లు పార్థసారథి, కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

నకిలీ ఉద్యోగ నియామక పత్రాలతో మోసం

- ఎస్పీకి బాధితుడి ఫిర్యాదు

ఒంగోలు క్రైం : సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి తనతోపాటు తన స్నేహితుని వద్ద రూ.5.50 లక్షలు నగదు తీసుకొని నకిలీ ఉద్యోగ నియామకపత్రాలు ఇచ్చి మోసం చేశారని పొదిలికి చెందిన బాధితుడు ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 71 ఫిర్యాదులు అందాయి. పొదిలికి చెందిన యువకుడితోపాటుగా అతని స్నేహితుడు వద్ద పేర్నమిట్టకు చెందిన ఓ వ్యక్తి, మరో ఇరువురు కలిసి రూ. 5.50 లక్షలు నగదు తీసుకొని నకిలీ నియామక పత్రాలను ఇచ్చి మోసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రయివేట్ ఫైనాన్స్ కంపెనీలో తాను ఇల్లు తనఖా పెట్టి రూ. 4 లక్షలు రుణం తీసుకొని ప్రతి నెలా రూ. 11.5 వేలు ఈఎంఐ చెల్లించానని, అయితే అక్కడ పనిచేసే వ్యక్తి ఉద్యోగం మానివేసిన తరువాత కూడా తన వద్ద నగదు తీసుకొని కంపెనీకి చెల్లించకుండా మోసం చేశాడని మర్రిపూడి మండలానికి చెందిన ఓ మహిళ ఎస్పీకి ఫిర్యాదు చేసింది.

ధాన్యం నగదును జమ చేయించాలి

● అధికారులకు చేజర్ల గ్రామ రైతుల వినతి


ధాన్యం అమ్మిన నగదు ఇప్పించాలని అధికారులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన చేజర్ల గ్రామ రైతులు

ఒంగోలు(రూరల్), జూన్9 (ఆంధ్రజ్యోతి):వరి ధాన్యం అమ్మి నెల రోజులు గడిచినా ఇంత వరకు నగదు జమ చేయలేదని చేజర్ల గ్రామ రైతులు మీకోసంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. చేజర్ల కొనుగోలు కేంద్రంలో కరవది పీఏసీఎస్ ఆధ్వర్యంలో సివిల్ సప్లై శాఖ ద్వారా వ్యాపారులకు వరి ధాన్యం నెలరోజులు క్రితం అమ్మకాలు చేశామని, అయినా ఇంతవరకు నగదు బ్యాంక్‌ల ఖాతాలకు జమకాలేదని అందులో పేర్కొన్నారు. వెంటనే నగదును తమ బ్యాంక్ ఖాతాలకు జమ చేయాలని అందులో కోరారు. ఈ కార్యక్రమంలో చేజర్ల గ్రామరైతులు చేజర్ల శ్రీనివాసరావు , షేక్ సనా వలి, జేవీ శేషయ్య, ఎ. వెంకటేశ్వర్లు,వీ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయించాలి


అక్రమ మైనింగ్‌పై గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన యరజర్ల వాసులు

ఒంగోలు (రూరల్), జూన్9(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం యరజర్ల గ్రామ పరిధిలో గల కొండ గ్రావెల్ అక్రమ తవ్వకాలను వెంటనే నిలుపుదల చేయాలని యరజర్ల గ్రామ రైతులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో సోమవారం అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొండను అడ్డగోలుగా తవ్వుకుపోతున్నారని, నిత్యం వంద టిప్పర్లలో మట్టిని తరలించి గ్రావెల్ మాఫియా సొమ్ము చేసుకుంటుందని అందులో పేర్కొన్నారు. ఈ మాఫియాపై మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవటంలేదని పేర్కొన్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకొని యరజర్ల కొండ అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయించాలని వారు కోరారు.

ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపంపిణీలో నగదు బదిలీ ప్రవేశపెట్టాలనే అంశాన్ని పక్కన పెట్టి పటిష్టంగా ప్రజా పంపిణీ వ్యవస్థ అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాకార్యదర్శి కంకణాల ఆంజనేయులు కోరారు. స్థానిక సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. సమావేశంలో ఆంజనేయులు మాట్లాడుతూ 2013 ఆహార భద్రత చట్టం ప్రకారం 14 రకాల నిత్యవసర వస్తువులు ప్రతి పేద కుటుంబానికి అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం అమలులో ఉన్న వాహనం ద్వారా రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేయాలన్నారు. రేషన్ షాపుల వద్ద కూడా నిత్యావసర సరుకులు అందించాలని కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఇస్తున్న బియ్యం ఎవ్వరు తినడం లేదని, బ్లాక్ మార్కెట్‌కు చేరుతున్నాయని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాలా అంజయ్య, కేజీ మస్తాన్, వెల్లంపల్లి ఆంజనేయులు, బడుగు వెంకటేశ్వర్లు, బాలనాగమ్మ, కే మాల్యాద్రి, ఉబ్బా వెంకటేశ్వర్లు, వై. వీరనారాయణ, బ్రహ్మయ్య, ప్రకాశం, శ్రీనివాసులు, కంకణాల వెంకటేశ్వర్లు, శేషారావు, ఏడుకొండలు ఉన్నారు.

కించపరిచిన జగన్ మీడియాపై చర్యలు తీసుకోవాలి

● తాలూకా పోలీసులకు తెలుగు మహిళల ఫిర్యాదు

ఒంగోలు, కార్పొరేషన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : అమరావతి వేశ్యల రాజధాని అంటూ సాక్షి మీడియా డిబేట్‌లో మాట్లాడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రసారం చేసిన సాక్షి మీడియాపైన కేసు నమోదు చేయాలని తెలుగు మహిళలు ఒంగోలు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఒంగోలులోని తాలూకా పోలీస్ స్టేషన్‌లో సీఐ విజయ్ కృష్ణని కలిసి ఫిర్యాదు చేసిన తెలుగు మహిళలు మీడియాతో మాట్లాడారు. అమరావతి మహిళలను కించపరుస్తూ మాట్లాడిన జర్నలిస్ట్ కృష్ణంరాజు, ఆయన చేసిన వాఖ్యలను సమర్థించిన కొమ్మినేని శ్రీనివాస్‌లను అరెస్టు చేసినప్పటికీ వారిపై కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలని కోరారు. అలాగే లైవ్ డిబేట్‌ను ప్రసారం చేసిన సాక్షి మీడియా యాజమాన్యం వైఎస్. భారతి రెడ్డి, వైఎస్ జగన్మోహన్ రెడ్డిపైనా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్ల వెంకటరత్నం, తెలుగు మహిళలు జిల్లా అధ్యక్షురాలు రావుల పద్మజ, నాళం నరసమ్మ, పసుపులేటి సునీత, నిడమానూరి పావని, పెద్దిశెట్టి వరలక్ష్మీ, కామరాజుగడ్డ కుసుమ కుమారి, టి. అనంతమ్మ, బీరం అరుణ రెడ్డి, గంగవరపు పద్మ, మండవ లావణ్య, పలువురు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

డాక్టర్ సీతారామయ్యను కలిసిన టీడీపీ నేతలు

మద్దిపాడు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పీడీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా డాక్టర్ కామేపల్లి సీతారామయ్య బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ మద్దిపాడు మండల అధ్యక్షుడు మండవ జయంతి బాబు ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి నాయకులు నల్లూరి సంజీవ రావు, నర్రా నరేష్, నల్లూరి అజయ్ బాబు, నల్లూరి హరిబాబు పాల్గొన్నారు.

90శాతం సబ్సిడీతో విత్తనాలు ఇవ్వాలి

కొండపి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు ఇవ్వాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మురళికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి, సీసీఐ మండల కార్యదర్శి అర్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని మహిళకు గాయాలు

మద్దిపాడు, జూన్ 9(ఆంధ్రజ్యోతి):ఆటో మోటార్‌బైక్ ఢీకొని మహిళకు గాయాలయ్యాయి. గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం దగ్గర సోమవారం సాయంత్రం మేదరమెట్ల వైపు వెళ్తున్న ఆటో బ్రేకులు ఫెయిల్ అయ్యి మోటార్‌బైక్ ఢీకొట్టాడు. దీంతో మోటార్‌బైక్‌పై ఉన్న ఆర్.రమాదేవికి గాయాలు కాగా చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

విశాఖ ఉక్కుపై స్పష్టమైన హామీ వచ్చే వరకు పోరాటం

● నిరసనలో అఖిలపక్ష కార్మికసంఘాల నేతలు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉక్కుపై ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయమని స్పష్టమైన హామీ వచ్చేంత వరకు పోరాటం కొనసాగిస్తామని అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. విశాఖ ఉక్కును రక్షించుకోవాలని కోరుతూ సోమవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్మిక సంఘం నాయకులు జి. శ్రీనివాసులు, కొత్తకోట వెంకటేశ్వర్లు, ఆర్. మోహన్‌ల అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో సంయుక్తకిసాన్ మోర్చా జిల్లాకన్వీనర్ చుండూరు రంగారావు మాట్లాడుతూ విశాఖకోసం అవసరమైతే మళ్లీ ప్రాణత్యాగాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయమని హామీ ఇచ్చేంతవరకు జరిగే పోరాటాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, ఏఐఎఫ్‌టీయూ న్యూ జిల్లా కార్యదర్శి ఎంఎస్ సాయి తదితరులు మాట్లాడారు. ఈ నిరసన కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పెంట్యాల హనుమంతరావు, జీవీ కొండారెడ్డి, పి. కల్పన, ఎల్. రాజశేఖర్, సీహెచ్ వినోద్, తంబి శ్రీనివాసులు, బీవీ రావు,సీహెచ్ రాంబాబు, జి. రమేష్, సయ్యద్‌సలార్, సయ్యద్‌మున్నా బాషా ఉన్నారు.

విద్యాశాఖలో బదిలీల బంతాట

ఒంగోలు విద్య, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖలో ఉద్యోగుల బదిలీల్లో సీనియర్ సహాయకులను బంతాట ఆడుకుంటున్నారు. కలెక్టర్ ఉత్తర్వులను కూడా బేఖాతరు చేసి జిల్లా విద్యాశాఖ కార్యాలయ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఒకేరోజు ఒక ఉద్యోగిని మూడు స్థానాలకు ప్రతిపాదించారు. వాస్తవానికి ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం ఇచ్చిన గడువు సోమవారంతో ముగుస్తుంది. అయినప్పటికి సోమవారం రాత్రి వరకు ఉత్తర్వులు బయటకు విడుదల కాలేదు.

జిల్లా విద్యాశాఖలో పనిచేస్తున్న ఒక సీనియర్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నగర శాఖ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. వీరికి మూడు టర్మ్‌లు అంటే తొమ్మిదేళ్ల బదిలీ ఉండదు. కలెక్టర్ కూడా ఉత్తర్వులు ఇచ్చారు. అయినప్పటికి ఆ ఉద్యోగిని బదిలీ చేశారు. ఒంగోలు డీఈవో కార్యాలయం నుంచి మైనంపాడు డైట్‌కు బదిలీ చేశారు. ఆ మేరకు డీఈవో సంతకంతో మధ్యాహ్నం 12గంటలకు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆ తర్వాత ఏమైందో ఏమో ఆ ఉత్తర్వులను నిలుపుదల చేశారు. కొందరి వత్తిడితో ఆ ఉద్యోగిని నెల్లూరు జిల్లాకు బదిలీ చేయాలని ప్రతిపాదించారు. ఆ తర్వాత మళ్లీ మనసు మార్చుకొని ఆ ఉద్యోగిని బాపట్ల జిల్లాకు బదిలీ చేయాలని నిర్ణయించారు. రాత్రి 8.30కు ఉత్తర్వులు వెలువడలేదు.

చీమకుర్తి మున్సిపాలిటీ మేనేజర్‌గా రాజు



చీమకుర్తి,జూన్9 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మున్సిపాలిటీ నూతన మేనేజర్‌గా కె.రాజును నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆత్మకూరు నుంచి బదిలీపై రాజు చీమకుర్తికి వచ్చారు.గతంలో కూడా ఆయన ఇక్కడ విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం మేనేజర్‌గా పనిచేస్తున్న పోతురాజు బదిలీ అయ్యారు.

యోగాతో ఆరోగ్యం

● పలు ప్రాంతాల్లో యోగాంధ్ర ర్యాలీలు, మానవహారాలు

కొండపి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా ప్రజలు ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని కొండపి ఎంపీడీవో రామాంజనేయులు అన్నారు. యోగాంధ్రలో భాగంగా సోమవారం స్థానిక మండల కార్యాలయాల సముదాయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు కలిసి ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ మురళి ,వెలుగు ఏపీఎం గోపీనాథ్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జరుగుమల్లిలో..

జరుగుమల్లిలో యోగాపై అవగాహన ర్యాలీని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం నిర్మల, మాజీ ఎంపీపీ బెల్లం సత్యనారాయణ, ఎంపీడీవో రమణమూర్తి, పలుశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు : యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. యోగాంధ్రలో భాగంగా సంతనూతలపాడులో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జడ్పీహైస్కూల్ వద్ద మానవహారం నిర్వహించారు

నాగులుప్పలపాడులో

నాగులుప్పలపాడు : నాగులుప్పలపాడులో అధికారులు సోమవారం యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్దనుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ చేపట్టి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో దక్షిణామూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో

చీమకుర్తి: చీమకుర్తి పట్టణంలో యోగాంధ్ర ర్యాలీని సోమవారం నిర్వహించారు. కమిషనర్ వై.రామకృష్ణయ్య,కాట్రగడ్డ రమణయ్య,అవనిగడ్డ శేషారావు, సోమా శేషాద్రి,చలువాది రమేష్,మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతోనే ఆరోగ్యం

మద్దిపాడు : మండలంలోని మద్దిపాడు, ఇనమనమెళ్లూరు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ ఆనంద్ మోహన్, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, ఏఎన్ఎంలు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

జీవన విధానంలో యోగా ఓ భాగం

మార్కాపురం, వైపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో పలుచోట్ల యోగాంధ్ర ర్యాలీలు

సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం రూరల్, జూన్9 (ఆంధ్రజ్యోతి). ప్రతి ఒక్కరూ తమ జీవన విధానంలో యోగాను భాగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్ చెప్పారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద నుంచి కోర్టు సెంటర్ వరకు యోగాంధ్ర ర్యాలీ కార్యక్రమం ఇన్‌చార్జి ఎంపీడీవో భాగ్యవతి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కోర్టు సెంటర్‌లో మానహారం నిర్వహించి యోగా గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ త్రివినాగ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని కోరారు. మే 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు నెల రోజులపాటు గ్రామ నుంచి రాష్ట్ర స్థాయి వరకు దశల వారీగా యోగా పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. తహసీల్దార్ చిరంజీవి, డీఎల్‌డీవో బాలునాయక్, వెలుగు ఏపీఎం పిచ్చయ్య, ఎన్ఆర్ఈజీస్ ఏపీవో నాగరాజు పాల్గొన్నారు.

కంభంలో...

కంభం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : యోగా వారోత్సవాలలో భాగంగా కంభం ఎంపీడీవో కార్యాలయం నుంచి కందులాపురం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో వీరభద్రాచారి, పలుశాఖల అధికారులు, వీఆర్‌వోలు, సచివాలయ పాల్గొన్నారు.



మార్కాపురంలో బహుమతులు పొందిన విద్యార్థులు

గిద్దలూరులో...

గిద్దలూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నిత్యం యోగా సాధన చేయడం ద్వారా శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా ఉంటారని తహసీల్దార్ ఆంజనేయరెడ్డి చెప్పారు. తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, వీఆర్‌వోల సంఘం జిల్లా అధ్యక్షుడు వై.పి.రంగయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు లొక్కు రమేష్, చంద్రశేఖర్‌యాదవ్, కోఆప్షన్ సభ్యులు జనార్దన్ పాల్గొన్నారు.

యోగా సాధన

పట్టణంలోని శాఖాగ్రంథాలయం ఆవరణలో చదవడం మాకు ఇష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల చేత శిక్షకులు డాక్టర్ క్రిష్టయ్య యోగా సాధన చేయించారు. స్కిప్పింగ్ తాడును, ఇతర ఆట వస్తువులను యువ ప్రగతి పథం స్వచ్ఛంద సంస్థ సభ్యులు నరేంద్రరెడ్డి విద్యార్థులకు బహూకరించారు. గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రామిరెడ్డి, వివిధ సంస్థల ప్రతినిధులు ఫరూఖ్, సాయికుమార్ పాల్గొన్నారు.

తర్లుపాడులో...

తర్లుపాడు, జూన్ 9 ఆంధ్రజ్యోతి: యోగా ద్వారా మానసిక ఆరోగ్యంచేకూరుతుందని తహసీల్దార్ కెకిశోర్ కుమార్ చెప్పారు. ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రశేఖర్, వెలుగు ఏపీఎం రమేష్ పాల్గొన్నారు.

త్రిపురాంతకంలో...

త్రిపురాంతకం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : యోగాతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని తెలియజేస్తూ పట్టణంలో అధికారులు ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీలార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాజకుమార్, ఏపీవో సుజాత పాల్గొన్నారు.

పెద్దదోర్నాలలో...

పెద్దదోర్నాల, జూన్9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగాను అలవర్చుకోవాలని ఎంపీడీవో నాసర్ రెడ్డి చెప్పారు.



ఎర్రగొండపాలెంలో టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పెద్దదోర్నాలలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మస్తాన్ నాయక్, ఈవో శివకోటేశ్వరరావు, ఎన్ఆర్ఈజీఎస్ సీసీ చాణిక్య, టీడీపీ నాయకులు బట్టు సుధాకర్ రెడ్డి, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, షేక్ మంజూర్ భాష, జనసేన నాయకులు మురళి, గుర్రాల ప్రసాద్ పాల్గొన్నారు.

మంచి శిక్షణ మంచి నడవడిక ముఖ్యం

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 9 ఆంధ్రజ్యోతి : విద్యార్థులు పొందిన మంచి శిక్షణ మంచి నడవడిక భవిష్యత్‌లో మంచి మార్గానికి సుగమం అవుతుందని శ్రావణి వైద్యశాలల అధినేత, కౌన్సిలర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ చెప్పారు. స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో యోగా సాధకులు వెంకటేశ్వర్లు నిర్వహించిన వేసవి సెలవుల జీవిత పాఠాలు సోమవారం ముగిశాయి. విద్యావేత్త డాక్టరు ఏ వీరారెడ్డి, డీఆర్‌యూసీసీ సభ్యులు ఆర్‌కేజే నరసింహం, యోగా సాధకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బేస్తవారపేటలో...

బేస్తవారపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేటలోని ప్రధాన రోడ్డులో యోగాంధ్ర మహా మాస్ ర్యాలీ ఎంపీడీవో ఎ.వి.రంగనాయకులు ఆధ్వర్యంలో జరిగింది. ఈకార్యక్రమంలో తహసీల్దార్ జితేంద్ర కుమార్, డాక్టర్ గిరి, బుద్దుల ప్రేమానంద్ పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెంలో...

ఎర్రగొండపాలెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) శారీరక, మానసిక ఎదుగుదలకు ప్రతి ఒక్కరూ యోగాలో ఆసనాలు వేసి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు చెప్పారు. ఎర్రగొండపాలెంలో సోమవారం యోగా వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి ప్రధాన సెంటరు వరకు ర్యాలీ చేశారు. ర్యాలీలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దారు మంజునాధరెడ్డి, ఎంఈవో ఆంజనేయులు, ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, ఎంఈవో ఆంజనేయులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



అర్ధవీడులో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

రాచర్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తరగతి గదుల నిర్మాణాలు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి చెప్పారు. రాచర్ల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో అప్‌గ్రేడ్ జూనియర్ కళాశాల తరగతి గదుల నిర్మాణానికి సోమవారం ఆయన భూమి పూజ చేశారు. సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా దాదాపు రూ. 1.52 కోట్లు నిధులు మంజూరయ్యాయని, ఆ నిధులతో తరగతి గదుల నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని, భవన నిర్మాణాలు పటిష్ఠంగా ఉండాలని చెప్పావరు. తొలుత ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి పాఠశాల ఎస్‌వో డి.మాలకొండమ్మ, అధికారులతో కలిసి ఘనస్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ ఎన్.వెంకటసుబ్బారెడ్డి, ఎంపీడీవో ఎస్‌వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు, ఎంఈవో శివకోటేశ్వరరావు, సర్వశిక్ష అభియాన్ డీఈ పి.వి.రమణయ్య, ఏఈ మహేష్, నాయకులు కె.యోగానంద్, జి.జీవనేశ్వర్‌రెడ్డి, ఎన్.శ్రీనివాసులు, డి.కాశిరెడ్డి, పి.సనావుల్లాఖాన్, ఎ.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అర్ధవీడులో రూ.1.59 కోట్లతో జూనియర్ కళాశాల అదనపు తరగతుల భవనం

అర్ధవీడు/కంభం, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : అర్ధవీడు మండలంలో కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రాంగణంలో జూనియర్ కళాశాల అదనపు తరగతుల కోసం రూ.1.59 కోట్లు మంజూరయ్యాయి. ఈ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో నరసయ్య, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, పంచాయతీ రాజ్ డీఈ సుబ్బారెడ్డి, బండ్లమూడి ఆంజనేయులు, పూనూరు భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ కొళాయి కనెక్షన్లు తొలగించండి

రాచర్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జెపి చెరువు గ్రామంలో కొందరు వ్యక్తులు ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ కొళాయి కనెక్షన్లు పొందారని, వాటిని వెంటనే తొలగించాలని ఆ గ్రామ నాయకులు ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డిని కోరారు. సోమవారం ఎంపీడీవోను కలిసి అక్రమ కొళాయి కనెక్షన్ల గురించి ఫిర్యాదు చేశారు. కొందరు వ్యక్తులు అనధికారికంగా పైలెట్ ప్రాజెక్టు పైపులైన్ నుంచి అక్రమ కనెక్షన్లు తీసుకున్నారని, ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శికి తెలియచేసినా ఆయన వారిపై ఎలాంటి చర్య తీసుకోలేదన్నారు. అధికారులు స్పందించి అక్రమ కనెక్షన్లు తొలగించాలని వారు కోరారు.

తొమ్మిది మంది జూదరుల అరెస్టు

పుల్లలచెరువు, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మానేపల్లిలో పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపారు. సోమవారం మానేపల్లి శివార్లలో పేకాడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు చేసి 9 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10150 స్వాధీనం చేసుకున్నారు.

రోగులకు బ్రెడ్లు పంపిణీ

పెద్దదోర్నాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు సోమవారం బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షులు రామిరెడ్డి, సమితి సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనపై అవగాహన ర్యాలీ

పెద్దదోర్నాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎగువ చెర్లోపల్లి, నల్లగుంట్ల, కొర్రప్రోలు గ్రామాలలో ఎక్సైజ్ శాఖాధికారులు సోమవారం నాటుసారా నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం అసిస్టెంటు ఎక్సైజ్ సూపరింటెండెంట్ దాసరి బాలయ్య, ఎస్సై వెంకటరెడ్డి, ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంటు ఎస్ఐ మౌలాలి పాల్గొన్నారు.

ఉచిత ఎంసెట్ కోచింగ్ సెంటర్‌లో పలువురి ప్రతిభ

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విజయ్ సోషల్ సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో వెనుకబడిన నిరుపేద విద్యార్థులకు ఉచిత ఎంసెట్ కోచింగ్ సెంటర్ నిర్వహించారు. 45రోజుల ఈ కోచింగ్ సెంటరులో 60 మంది విద్యార్థులు కోచింగ్ తీసుకున్నారు. వారిలో చాలా మంది ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ట్రస్టు ఛైర్మన్ ఎస్ విజయ్ కుమార్ సోమవారం తెలిపారు. ఉత్తమ ర్యాంక్ సాధించిన కల్పనదేవి (బైపీసీ) ర్యాంక్ 16,705, పర్వీన్ (ఎంపీసీ) ర్యాంక్ 18,557, శ్యామల(బైపీసీ) ర్యాంక్ 26,161 సాధించడంతో వారిని అభినందించారు.

విలువలతో కూడిన విద్య అందించాలి

కొమరోలు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థికి విలువలతో కూడిన విద్యను అందించాలని టీడీపీ నాయకులు ముత్తుముల క్రిష్ణకిషోర్‌రెడ్డి చెప్పారు. స్థానిక ది కొమరోలు యూపీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలను ఆయన పునఃప్రారంభించారు. ఎంపీటీసీ మాజీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ తిరుమలరెడ్డి, మాజీ కోఆప్షన్ షేక్ నబి, పాఠశాల నిర్వాహకులు చిన్న గురవయ్య, కాటసాని చిన్నపురెడ్డి, కలగొట్ల పెద్దగురవయ్య, బాషా పాల్గొన్నారు.

వేడుకలు ప్రారంభం

పెద్దదోర్నాల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): నూతనంగా నిర్మించిన శ్రీ షిరిడి సాయి బాబా దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 3రోజుల పాటు ఈ వేడుకల్లో నిర్వహిస్తున్నారు.

బండలాగుడు పోటీల్లో సత్తాచాటిన కడప జిల్లా ఎడ్లు

రాచర్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యడవల్లి గ్రామంలో శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీల్లో వైఎస్ఆర్ కడప జిల్లా చౌటపల్లికి చెందిన చంద్ర ఓబులరెడ్డి ఎడ్లు సత్తాచాటి మొదటి బహుమతి రూ.1.16లక్షలు గెలుచుకున్నాయి. ఈ పోటీల్లో 10 జతల ఎడ్లు పాల్గొనగా పోటీలను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రారంభించారు. 2వ బహుమతి రూ.80వేలను కడప జిల్లాకు చెందిన చంద్ర ఓబులరెడ్డి ఎడ్లు, 3వ బహుమతి రూ.60వేలను నంద్యాల జిల్లా సిరివెళ్లకు చెందిన కుందూరు రాంభూపాల్‌రెడ్డి ఎడ్లు, 4వ బహుమతి రూ.40వేలను బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీరస్వామిచౌదరి ఎడ్లు, 5వేల బహుమతి రూ.20వేలను బాపట్ల జిల్లా చుండూరుకు చెందిన అత్తోట శీరీషచౌదరి ఎడ్లు, 6వ బహుమతి రూ.15వేలు నంద్యాల జిల్లాకు చెందిన గౌటిక హేత్రిక్ రెడ్డి ఎడ్లు, 7వ బహుమతి రూ.10వేలను అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన ఎ.రామాంజనేయులు ఎడ్లు, 8వ బహుమతి 5వేలు కడప జిల్లా, అనంతపురం జిల్లాలకు చెందిన రామమాంజనేయులు, కావ్య బాలయ్య ఎడ్లు గెలుచుకున్నాయి. మొదటి బహుమతి లక్ష రూపాయలను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సహకారంతో విజేతలకు అందచేయగా మిగిలిన బహుమతులు దాతలు, కమిటీ సభ్యులు సహకారంతో ఆలయ ధర్మకర్త సుబ్బారెడ్డి, కమిటీ సభ్యులు భవనం సుబ్బారెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు విజేతలకు అందజేశారు.

సాక్షి జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేనిపై చర్యలు తీసుకోవాలి

సాక్షి దినపత్రిక ప్రతులను దహనం చేస్తున్న టీడీపీ మహిళా నాయకులు

ఎర్రగొండపాలెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రాజధాని అమరావతి మహిళలపై సాక్షి జర్నలిస్టులు కృష్ణరాజు, కొమ్మినేని శ్రీనివాసరావులు చేసిన అనుచిత వ్యాఖ్యలను నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు రమణమ్మ సోమవారం తీవ్రంగా ఖండించారు. అమరావతి మహిళలపై సాక్షి జర్నలిస్టులు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఎర్రగొండపాలెం అంబేద్కర్ సెంటరులో సాక్షి ప్రతులను మహిళ నాయకులు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోళ్ల సుబ్బారావు, కొత్తమాసు సుబ్రమణ్యం, తోట మహేష్, పట్టణ అధ్యక్షులు పి.మల్లిఖార్జున, చేదూరి లక్ష్మయ్య, చేదూరి కిశోర్, మల్లెల వెంకటనారాయణ పాల్గొన్నారు.



ఎర్రగొండపాలెంలో సాక్షి దినపత్రిక ప్రతులను దహనం చేస్తున్న నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు రవణమ్మ, నాయకులు,

వెనుకబడిన కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడపాలి

మార్కాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వెనుకబడిన కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపేందుకు అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చెప్పారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పీ4 సర్వేపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే నారాయణరెడ్డి, అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యంత వెనుకబడడిన కుటుంబాలు 7,696 ఉన్నాయన్నారు. పీ4 సర్వేలో ఆయా కుటుంబాలను గుర్తించామని, ఆ కుటుంబాలను 2040వ సంవత్సరం నాటికి ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసేందుకు అధికారులు అన్ని రకాలైన ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్ పాల్గొన్నారు.



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే కందుల, సబ్ కలెక్టర్ త్రివినాగ్ అధికారులు

ఎర్రగొండపాలెంలో...

ఎర్రగొండపాలెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం నిర్వహించిన పీ 4 వీడియోకాన్ఫరెన్సులో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అధికారులతో కలసి పాల్గొన్నారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దారు మంజూనాధరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి తిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాలు

పెద్దారవీడు, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజంపల్లిలో వెలసిన శ్రీగొడ్రాలికొండ తిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ప్రధాన అర్చకులు భవానీ ప్రసాదాచార్యులు సోమవారం తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం కల్యాణోత్సవం, బుధవారం సింహవాహనం, గురువారం శేషవాహనం, శుక్రవారం హనుమంత వాహనం, శనివారం గరుడ వాహనం, ఆదివారం గజవాహనం, సోమవారం రథోత్సవం, మంగళవారం అశ్వవాహనం, బుధవారం హంసవాహనంపై స్వామి ఊరేగిస్తారని వివరించారు. 19వ తేదీ రాజంపల్లిలో గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 16వ తేదీ అన్నీ కుల సత్రాలలో అన్నదాన కార్యక్రమ అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



తిరుమలనాథస్వామి మూల విరాట్

శివాపురంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి

పెద్దారవీడు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో ప్రత్యేకంగా రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని మండలంలోని శివాపురం ప్రజలు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ పులి శైలేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్ల నుంచి శివాపురంలోనే రేషన్ సరుకులు ఇస్తున్నారని, రెండు నెలల నుంచి దేవరాజుగట్టు వచ్చి రేషన్ తీసుకెళ్లాలని చెబుతున్నారన్నారు. దేవరాజుగట్టుకు శివాపురం 2 కిలోమీటర్ల దూరం ఉందని తెలిపారు. శివాపురంలో 130కి పైగా రేషన్‌కార్డులు ఉన్నాయని, అందులో 60 మంది వరకూ దివ్యాంగులు ఉన్నారని చెప్పారు.

సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

రాచర్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చెప్పారు. రాచర్లలో రూ.43 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. తొలుత యోగా ర్యాలీ ఎమ్మెల్యే పాల్గొన్నారు.

కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులకు అవార్డులు

రాచర్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గత 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులు సోమవారం ఒంగోలులో కలెక్టర్ అన్సారియా చేతుల మీదుగా సైనింగ్ స్టార్ అవార్డులు అందుకున్నారు. ఆకవీడు జడ్‌పీహెచ్‌సీ నుంచి బి.లక్ష్మీప్రియ, జేపీచెరువు జడ్‌పీహెచ్‌ఎస్ నుంచి కమల ప్రియదర్శిని, రాచర్ల స్పందన పాఠశాల నుంచి జి.వి.లయ, కె.ధరణి, షేక్ ఆరిఫ్, ఒద్దులవాగుపల్లి ఎయిడెడ్ పాఠశాల నుంచి చత్రపతిశివాజీలకు 20వేల నగదు, మెడల్ అందచేశారు.

దోర్నాలలో...

పెద్దదోర్నాల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో రాణించిన మండలంలోని పలువురు విద్యార్థులు పత్తి కాశీ వైష్ణవి 581మార్కులు, షేక్ బషీర్ 588, చింతల త్రివేణి 582, సన్నెపోగు సంజయ్ 583, తాటి శివ విందు 577, గుంటూరు రేవంత్‌కుమార్ రెడ్డి 570, చక్కా సుశాంత్ 570మార్కులు సాధించగా, వీరిని కలెక్టర్ అభినందిస్తూ ప్రశంసాపత్రాలు అందజేశారు.

అవీఇవీ

అన్నదాత సుఖీభవ నిధులు వెంటనే ఇవ్వాలి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న గురునాథం

పుల్లలచెరువు, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామి ప్రకారం అన్నదాత సుఖీభవ నిధులు వెంటనే రైతుల ఖాతాల్లో జమచేయాలని సీపీఐ మండల కార్శి గురునాధం కోరారు. సోమవారం పుల్లలచెరువు తహసీల్దార్ కార్యాలయంలో డీటీ కిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సినీయర్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు ఒక నెల జీతం అందజేత



కార్మికులకు జీతం పంపిణీ చేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

ఎర్రగొండపాలెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం మేజరు పంచాయతీ కార్మికులకు సోమవారం ఎంపీడీవో శ్రీనివాసరావు ఒకనెల జీతం అందచేశారు. పంచాయతీ కార్మికులకు 22 మందికి ఒక్కొక్కరి నెలకు రూ.10వేలు, గ్రీన్ అంబాసిడర్‌లకు నెలకు రూ.6 వేల వంతున 22 మందికి అందచేశారు. ఎలక్ట్రీయన్లు 2 ఇరువురికి 10 వేలు, టర్నాకాక్‌లు 12 వేల వంతున ఒకనెలకు పంపిణీ చేశారు. డ్రైవర్లుకు 2 ఇరువురికి ఒక నెలకు 12 వేలు వంతున అందచేశారు.

రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

బేస్తవారపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు సోమవారం బేస్తవారపేటలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ జితేంద్ర కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఏరియా రైతు సంఘం కార్యదర్శి డాకాల పుల్లయ్య ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఊరుమార్పు జోసఫ్, కొండయ్య, కె.వి.రమణ పాల్గొన్నారు.

కౌలు రైతులకూ సుఖీభవ అమలు చేయాలి

త్రిపురాంతకం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వటంతో పాటు అన్నదాత సుఖీభవ పథకం వర్తింప చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. భూమి యజమాని ప్రమేయం లేకుండా నేరుగా కౌలు రైతుకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. సీపీఐ నాయకులు డి.శ్రీనివాస్, బి. రామయ్య పాల్గొన్నారు.

చెంచు కుటుంబాలకు ఇబ్బందులు రానివ్వొద్దు

నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతాలలో జీవించే చెంచు కుటుంబాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారి ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అధికారులకు సూచించారు. ఈ నెల 7న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన చెంచులకు రేషన్ బహుదూరం అనే కథనంపై ఆయన స్పందించారు. అటవీ ప్రాంతాలలో ఉండే చెంచులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రేషన్ సరుకులు వచ్చే నెల నుంచి పంపిణీ చేయాలని అందుకు అవసరమైన ఖర్చు తాను భరిస్తానని ఫోన్ ద్వారా తహసీల్దారు మంజూనాథ రెడ్డికి సూచించారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా ఏర్పాటు చేసి ఆ సమస్యను పరిష్కరించాలని చెప్పారు. దీంతో చెంచు నాయకులు.. ఎరిక్షన్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ముండ్లమూరు ఎంపీడీవో బదిలీ

ముండ్లమూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో పి.సునీతను పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలానికి బదిలీ చేస్తూ పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు అందాయి. గుంటూరు జిల్లా కొల్లూరు ఈవోపీఆర్డీగా పనిచేస్తూ నెలరోజుల క్రితం పదోన్నతిపై ఎంపీడీవోగా ముండ్లమూరు వచ్చారు. తిరిగి పల్నాడు జిల్లాకు బదిలీ అయ్యారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించాలి

పామూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడి కేంద్రాల్లో చేర్పించి పేర్లు నమోదు చేసుకోవాలని పామూరు సెక్టార్ సూపర్‌వైజర్ జి.పద్మజ అన్నారు. స్థానిక డీవీ పాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడి కేంద్రంలో చేరేలా కృషి చేయాలన్నారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.2,48,672

సీఎస్‌పురం(పామూరు), జూన్ 9(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి ఆదివారం హుండీ ఆదాయం రూ.2,48,672 వచ్చినట్లు ఈవో నరసింహబాబు ఒక ప్రకటనలో తెలిపారు. టిక్కెట్ల అమ్మకంద్వారా రూ.1,11,730, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.37,610, శాశ్వత అన్నదాన పథకానికి రూ.65,268, పంచామృత అభిషేకానికి రూ. 22,064 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పామూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పామూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన మంగళవారం జరుగుతుందని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30కు నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

హర్షవర్ధన్ మృతి బాధాకరం

పామూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఊసా హర్షవర్ధన్ అకాల మృతి ఆకుటుంబానికి తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, అన్నారు. సీపీఎం సీఎస్‌పురం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు, రాజ్యలక్ష్మి దంపతుల ఏకైక కుమారుడు హర్షవర్ధన్ గురువారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకొన్న శ్రీనివాసరావు సోమవారం వెంకటేశ్వర్లు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీనివాసరావు వెంట జిల్లాకార్యవర్గ సభ్యుడు సయ్యద్ హనీఫ్, తదితరులు ఉన్నారు.

టీడీపీ నేత రామకృష్ణ మృతి తీరనిలోటు

దర్శి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువుకొమ్ముపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఆకుల రామకృష్ణ సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, తదితరులు మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న రామకృష్ణ మృతి తీరనిలోటన్నారు. నివాళులర్పించినవారిలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, రూరల్ అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, నాయకులు బొట్ల కోటేశ్వరరావు, పారా గాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులతో ప్రయోజనాలు

తాళ్లూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సాగులో సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకుని సాగు చేపడితే మంచి దిగుబడులు వస్తాయని కేవీకే శాస్త్రవేత్త టి.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా వెలుగువారిపాలెం గ్రామంలో రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కొన్ని రకాల పురుగులు, తెగుళ్లకు అనుకూలమైన వాతావరణం ఏ ర్పడితే వాటిని అధిగమించేందుకు సీజన్ ముందు, సీజన్ తరువాతకొంత ఆలస్యంగా విత్తనాలు నాటితే తెగుళ్ల నివారించవచ్చునన్నారు. మండల వ్యయసాధికారి బి.ప్రసాదరావు మాట్లాడుతూ వేసవి దుక్కుల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. హెచ్‌వో స్వర్ణలత మాట్లాడుతూ డ్రోన్‌ను వ్యవసాయ సాగులో ఎలా వినియోగించాలో వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి పులి సుబ్బారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సుష్మాసుల్తానా, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ముండ్లమూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ల ఎస్సీ కాలనీ సమీపంలో సోమవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనటంతో నలుగురికి గాయాలయ్యాయి. అద్దంకి నుంచి గోపీ, తన భార్య ప్రవీణ, పిల్లలతో బైకుపై పూరిమెట్ల వస్తున్నారు. ఈక్రమంలో పూరిమెట్ల నుంచి అద్దంకి వైపు వెళ్తున్న చొప్పవరపు అంజయ్య, మరో వ్యక్తి బైకుపై వెళుతున్నారు. ఎదురెదురుగా బైకులు ఢీకొనటంతో గోపికి తీవ్రగాయాలుకాగా, భార్య, ఇద్దరు పిల్లలకు స్వల్పగాయాలయ్యాయి. గోపికి అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు.

మూల మలుపులు.. మృత్యువుకు పిలుపులు

» హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు

ముండ్లమూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రధానరహదారులపై ఉన్న మూల మలుపులు మృత్యువులకు పిలుపులుగా మారాయి. వాహనచోదకులు నిత్యం మలుపుల వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని వాహనచోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.


మండలంలోని వేంపాడు నుంచి ఈదర వెళ్ళే ఆర్‌అండ్‌బీ రహదారిపై పెదరావిపాడు వద్ద, తమ్మలూరు వద్ద ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఆ రహదారిపై కొత్తగా వెళ్ళే వాహన చోదకులు మలుపులు ఉన్నాయని తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. ఉల్లగల్లు నుంచి వేముల వెళ్ళే ప్రధాన రహదారిపై రెండు చోట్ల ప్రమాదకరంగా మలుపులు ఉన్నాయి. ఈమలుపులు వద్ద వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. నూజెండ్లపల్లి నుంచి తూర్పుకంభంపాడు వెళ్ళే ప్రధాన రహదారిపై నాలుగు మలుపులు ఉన్నాయి. వేంపాడు నుంచి మారెళ్ళ వెళ్ళే ప్రధాన రహదారి పై రామకృష్ణాపురం వద్ద ప్రమాదకర మలుపు ఉంది. పెదఉల్లగల్లు నుంచి వినుకొండ వెళ్ళే ప్రధాన రహదారిపై కెల్లంపల్లి సమీపంలో రెండు మలుపులు


వేంపాడు నుంచి పెదరావిపాడు వెళ్ళే ఆర్‌అండ్‌బీ రహదారిలో ప్రమాదకర మలుపు

ఉన్నాయి. ఆదివారం మలుపు వద్ద రెండు వాహనాలు ఢీకొనటంతో కెల్లంపల్లికి చెందిన పోటు పెదకోటయ్య మృతి చెందాడు. నూజెండ్లపల్లి నుంచి మారెళ్ళ వెళ్ళే ప్రధాన రహదారిపై మూడు చోట్ల మలుపులు ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, రేడియో స్టిక్కర్లు ఏర్పాటుచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం

మండలంలోని పలు ప్రధానరహదారులలో మూల మలుపుల వద్ద ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయటంతో పాటు రేడియో స్టిక్కర్లు ఏర్పాటుచేస్తామని ఎస్‌ఐ కె.కమలాకర్ తెలిపారు. త్వరలో ఆయా ప్రాంతాలను సందర్శించి ఎక్కడ హెచ్చరిక బోర్డులు అవసరమో గుర్తించి పూర్తి స్థాయిలో ప్రమాదాలు నివారిస్తామని తెలిపారు.


నూజెండ్లపల్లి నుంచి తూర్పుకంభంపాడు వెళ్ళే ప్రధాన రహదారిలో ప్రమాదకర మలుపు

యోగాతో ఎన్నో ప్రయోజనాలు

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలకు యోగా ప్రతిరోజూ దినచర్యగా మారాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా సోమవారం కనిగిరిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ మారుతున్న జీవనశైలితో ప్రతిఒక్కరికి శారీరక శ్రమ లేకుండా పోయిందన్నారు. అంతేకాకుండా మార్కెట్‌లోకి వచ్చే జంక్ ఫుడ్, ఆహార పదార్థాలపై మక్కువ చూపతున్నారన్నారు. వాటి కారణంగా శరీరంలో చాలా మార్పులు వస్తున్నాయన్నారు. కొవిడ్ సమయంలో చాలా మంది అనారోగ్యానికి ప్రధాన కారణం శారీరక శ్రమ లేకపోవటమేనని అన్నారు. ప్రతిరోజూ యోగా చేయటం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జోసఫ్ దానియేలు, మున్సిపల్ చైర్మన్ గఫార్, తహసీల్దార్ రవిశంకర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కనిగిరిలో జరిగిన యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

అనంతరం సీఎం చంద్రబాబునాయుడు నిర్వహించిన స్వర్ణాంధ్ర -2047 వర్చువల్ యాక్షన్‌ప్లాన్ యూనిట్ ప్రారంభోత్సవం వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ శాఖల అధికారులతో కలసి పాల్గొన్నారు. ప్రారంభం అనంతరం చంద్రబాబుతో వీడియో కాన్ఫరెన్స్‌లో కనిగిరి అభివృద్ధిపై వివిధ ప్రణాళికలను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర వివరించారు.

యోగాతో మానసిక ప్రశాంతత

ముండ్లమూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం ముండ్లమూరులో యోగా ర్యాలీ నిర్వహించారు. అలాగే, శంకరాపురం, పసుపుగల్లు, మారెళ్ళతోపాటు పలు గ్రామాల్లో యోగా ర్యాలీలు నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈనెల 21న ప్రతి పంచాయతీలో, మండల కేంద్రాల్లో యోగా ర్యాలీలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జాస్మిన్, వెంకటేశ్వరరెడ్డి, ఎస్ఐ కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.


పీసీపల్లిలో యోగాంధ్రపై మానవహారం నిర్వహించిన ఉద్యోగులు

పామూరులో..

పామూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగాసనాలు చేయడం ద్వారా మానసిక, శారీరక ఉల్లాసం ఏర్పడుతుందని డాక్టర్ గద్దె ఏడుకొండలు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా పామూరు, బొట్లగూడూరులో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పామూరులో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, సయ్యద్ అమీర్‌బాబు, బోయిళ్ల నారాయణరెడ్డి, ఎంపీడీవో బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. బొట్లగూడూరులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ వై.బాల, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, కృష్ణమూర్తి, బాల కృష్ణయ్య, కోటపాటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పీసీపల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని ఎంపీడీవో హనుమంతరావు అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా పీసీపల్లిలో వివిధ శాఖల ఉద్యోగులు, స్థానికులతో కలిసి సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయడం వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు జి.సంజీవి, ఆర్.శ్రీనివాసులు, ఏపీవో జహంగీర్ బాషా, డిప్యూటీ ఎంపీడీవో రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరులో..

తాళ్లూరు, జూన్9 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి తమ జీవితంలో యోగా, ధ్యానంను భాగస్వామ్యం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎంపీడీవో హనుమంతరావు అన్నారు. యోగాంధ్రలో భాగంగా తాళ్లూరులో మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహిచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాకలెక్టర్ ఆదేశాల మేరకు అవగాహన ర్యాలీ, ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక వైద్యాధికారి ఖాదర్‌మస్తాన్‌బీ మాట్లాడుతూ యోగా వల్ల కలిగే ప్రయోజనాలు, ఆరోగ్యవంతులుగా ఉండటానికి తీసుకోవాల్సిన నియమాల గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.సంజీవరావు, వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు, ఏపీఎం దేవారాజ్, ఏపీవో వెంకటేశ్వర్లు, ఎస్.సత్యం, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యపరిరక్షణకు యోగా నేర్చుకోవాలి

దర్శి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిరక్షణకు అందరూ యోగా నేర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు సూచించారు. దర్శిలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ద్వారా మానసిక ప్రశాంతత, పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్రపంచ యోగాడే సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రానికి వస్తున్నట్టు చెప్పారు.

కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్.కృష్ణమూర్తి, మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావు, ఎంఈవో రఘురామయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ జి.స్టీవెన్, తెలుగు మహిళ నాయకురాలు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివార్ల గ్రామోత్సవం

పామూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పామూరులోని శ్రీ మదనవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా సోమవారం స్వామివార్ల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు నారామణం సత్యబాబు విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, నిత్యహోమం, విశేష పూజలు, హారతులు, నైవేద్యం సమర్పించారు. అనంతరం స్వామి వారిని మోహిని అవతారం అలంకరణ చేసి ప్రత్యేక వాహనంలో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు ఆకుపాటి రమణయ్య కుటుంబ సభ్యులచే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి బంగారు గరుడ వాహనంపై పామూరు మాడవీధుల్లో స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం దేవస్థాన ఆవరణలో భక్తులకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. గ్రామోత్సవం సందర్భంగా సీఐ ఎం.భీమానాయక్ ఆధ్వర్యంలో పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల ఎస్ఐలు టి.కిశోర్‌బాబు, ఎం.వెంకటేశ్వరనాయక్, ప్రేమ్‌పావని పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ ఆంక్షలు విధించి బైపాస్ మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించారు. దీంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామోత్సవం సాఫీగా సాగింది. కార్యక్రమాల్లో కదిరి పార్థసారథి, ధనంజేయ నాయుడు, వానిరెడ్డి ఏసుదాసు, బాడిత శంకర్, గుత్తిరాజా, ఉప్పలపాటి హరిబాబు, గద్దె ఏడుకొండలు, ఆకుపాటి వెంకటేష్, బండ్ల నారాయణ, పాలపర్తి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


పామూరులో జరిగిన స్వామివార్ల గ్రామోత్సవం

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

తాళ్లూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని రజానగరంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నాగూర్ బాషా(20) ఓనిర్మాణానికి ఉదయం వెళ్లి నీళ్లు పడుతున్నాడు. ఈక్రమంలో విద్యుత్తుషాక్‌కు గురై ప్రక్కనున్న ఇంటి సందులో పడిపోయాడు. అయితే గ్రామంలో ఆరోజు ఉదయం కొందరు యువకులు కొత్తపట్నం బీచ్‌కు వెళ్లారు. మృతుడు నాగూర్ బాషా కన్పించక పోవటంతో ఆయువకులతో కలిసి వెళ్లి ఉంటాడని కుటుంబీకులు భావించారు. సాయంత్రం ఇంటికి వచ్చిన యువకులు తమ వెంటరాలేదని తెలపటంతో వెదుకులాడారు. పక్కనున్న ఇంటి గోడ మధ్యలో యువకుడు మృతి చెంది ఇరుక్కుపోయి ఉన్నాడు. వెలుపలికి తీసి చూడగా విద్యుత్తు షాక్ గురై శరీరభాగాలు కాలిపోయి ఉన్నాయి. చేతికి అందివచ్చిన కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. మృతుడు అవివాహితుడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మృతదేహన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట సర్పంచ్ షేక్ కాలేషావలి, టీవీ సుబ్బారెడ్డి, రాముడు, ఎల్.వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మ గుడిలో చోరీ

పీసీపల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాయపల్లిలో ఆదివారం అర్థరాత్రి ఎల్లమ్మ గుడిలో చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామ సచివాలయం సమీపంలో ఉన్న గుడిలో అమ్మవా రికి అలంకరణ కోసం తెచ్చిన నగలు, భక్తులు సమర్పించిన నగదు హుం డీలో ఉన్నాయి. సోమవారం స్థానికులు గుడిలోకి వెళ్లినపుడు తలుపు గడి య పగులకొట్టి ఉంది. దీంతో లోపలికి వెళ్లి పరిశీలించగా హుండీ పగలకొట్టి ఉండడంతో పాటు అమ్మవారి అలంకరణ కోసం తెచ్చిన నగలు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘట నా స్థలాన్ని పరిశీలించారు. ఒంగోలు నుంచి క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ వచ్చి పరిశీలించారు. వేలిముద్రలను సేకరించారు. వివిధ మార్గాలలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు.

అపహరణకు గురైన వాటిలో హుండీలో ఉన్న నగదుతో పాటు అమ్మవారి అలంకరణకోసం తెచ్చిన రెండు సవర్ల గాజులు, రెండు సవర్ల నెక్లెస్, రెండు సవర్ల కాసుల దండ, రెండు తాళిబొట్టు బిళ్లలు మొత్తం 6.2సవర్ల బంగారం చోరీకి గురై నట్లు పోలీసులు తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసున మోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువులను సమతుల్యంగా వాడుకుంటేనే భూమి ఆరోగ్యం

దొనకొండ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఎరువులను సమతుల్యంగా వాడుకుంటేనే భూమి ఆరోగ్యంగా ఉంటుందని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం నోడల్ ఆఫీసర్ టి.మానస అన్నారు. తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు. మండలంలోని గంగదేవిపల్లి, పెద్దగుడిపాడు గ్రామాల్లో ప్రీఖరీఫ్ పై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సాంకేతిక యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. సేంద్రియ ఎరువులకు బదులుగా ఎక్కువగా రసాయనిక ఎరువులు వినియోగిస్తే భూసారాన్ని క్షీణింపజేస్తాయని తెలిపారు. భూమి ఆరోగ్యాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి రైతుపై ఉందన్నారు. ఒకే మందును, ఒకే పంటను వేయడం వల్ల తెగుళ్ల ఎక్కువగా ఆశిస్తాయన్నారు. తెగుళ్ళకు కారకాలైన పురుగులు వ్యాధి నిరోధక సామర్థ్యాన్ని పెంచుకుంటాయని చెప్పారు. వ్యవసాయశాఖ రైతులకు అందించే వివిధ పథకాల గురించి మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ వివరించారు. అనంతరం కోరమండల్ వారు వ్యవసాయంలో డ్రోన్ యంత్రం ప్రాముఖ్యతను రైతులకు ప్రత్యక్షంగా చూపించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి


దర్శి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు

దర్శి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అమరావతిపై, మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, తెలుగు మహిళ నాయకురాలు ఎం.శోభారాణి మాట్లాడుతూ ఓపత్రికా యాజమాన్యం, అందులో పనిచేసే వ్యక్తులు అమరావతిపై విషం కక్కుతున్నారని ధ్వజమెత్తారు. అమరావతి నిర్మాణాన్ని అడ్డుకునే కుట్రలో భాగంగా మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను కించపర్చిన శ్రీనివాసరావు, కృష్ణంరాజులను కఠినంగా శిక్షించాలని, ఆ చానల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు దర్శి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, రూరల్ అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు టి.నారాయణరెడ్డి, టీడీపీ నాయకులు గోపు యర్రయ్య, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల రివిజన్ నిర్వహించాలి

దర్శి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఓటర్ల రివిజన్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని దర్శి నియోజకవర్గ ఎలక్ట్రోల్ అధికారి ఎస్.జాన్సన్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అధికారులు, రాజకీయపార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ బూత్‌ల రేషనలైజేషన్ ప్రక్రియకు అవసరమైన సూచనలు అందించాలని కోరారు. 1200 ఓటర్లకుపైన ఉన్న పోలింగ్ బూత్‌లను, రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్న బూత్‌లను గుర్తించి ఓటర్లకు ఇబ్బందులు లేకుండా మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపుల ప్రక్రియ పారదర్శకంగా నిర్వ హించాలన్నారు. బీఎల్‌వోలు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో దర్శి, కురిచేడు, ముండ్లమూరు, తాళ్ళూరు మండలాల తహసీల్దార్లు ఎం.శ్రావణ్‌కుమార్, జి.రజనీకుమారి, ఎం.లక్ష్మీనారాయణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు అవార్డులు


జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే విజయకుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందుకుంటున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

ముండ్లమూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లో చదివిన పదో తరగతి విద్యార్థులు మండల టాపర్లుగా నిలిచారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ అవార్డులను అందజేసింది. ఒంగోలులో సోమవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రూ .20వేలు నగదు, ప్రశంసాపత్రం, మెమెంటో అందుకున్నారు. ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు పులికొండ అశ్విని, బొప్పూడి కీర్తన, కఠారి బాలకృష్ణ, గుర్రం గాయత్రి, కొండ్రు ధనుష్, విజయ నాయక్‌లు పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించారు. వీరందరికీ ప్రోత్సాహక నగదు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయకుమార్, మేయర్ గంగా సుజాత, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి

దర్శి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేదరిక నిర్మూలన కోసం పీ-4 కార్యక్రమం అమలు చేస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా దర్శి నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికను వివరించారు. సూపర్ సిక్స్ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. పీ-4 సర్వేలో గుర్తించిన పేదలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తున్నట్లు సీఎం టెలికాన్ఫరెన్స్‌లో వివరించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ఎస్.జాన్సన్, ఎంపీడీవో కృష్ణమూర్తి, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ మహేశ్వరరావు, దర్శి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వెలిగొండారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


టెలికాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, అధికారులు

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు!

పామూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): దళారులను ఆశ్రయించి మోసపోవద్దని తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు అన్నారు. నూతన తహసీల్దార్‌గా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అర్జీదారులు తమ సమస్యల పరిష్కారం కోసం నేరుగా తనను కలవవచ్చునని చెప్పారు. దళారుల ప్రలోభాలను నమ్మి మోసపోవద్దన్నారు. అనంతరం వీఆర్వోలతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారులు నేరుగా కలిస్తే సమస్యల పరిష్కారానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల ప్రకారం ప్రతివారం ఒక రెవెన్యూ విలేజ్‌లో భూసమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.


వాసుదేవరావు

కాగా, తహసీల్దార్‌గా బా ధ్యతలు స్వీకరించిన వాసుదేవరావును టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
మంగళవారం 10 జూన్ 2025



ఉష్ణోగ్రత (అంచనా)

10-6-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	42	28
తెనాలి	42	27
నరసరావుపేట	42	28
బాపట్ల	41	29
రెంటచింతల	42	27
చీరాల	41	29



మంగళగిరిలోని సాక్షి కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న మహిళలు

అసభ్యకర వ్యాఖ్యలపై ఆగ్రహం

◆ జగన్ మీడియాపై భగ్గుమన్న మహిళలు

జగన్ మీడియా వేదికగా అమరావతి మహిళల గురించి చేసిన అసభ్యకర వ్యాఖ్యలపై రెండో రోజు సోమవారం ఆగ్రహం పెల్లుబికింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో మహిళలతో పాటు వివిధ వర్గాల ప్రజలు రోడ్డెక్కి ఆందోళనలు చేశారు. కొమ్మినేని, కృష్ణంరాజు ఫొటోలు, పత్రికా ప్రతులను దహనం చేశారు. రాజధాని మహిళలు, రైతులు మంగళగిరిలోని సాక్షి ప్రధాన కార్యాలయం ఎదుట చెప్పులు, చీపుర్లు, చేటలను చూపిస్తూ ధర్నా చేశారు. సాక్షి యాజమాని భారతీరెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గుంటూరులోని జిల్లా కార్యాలయాన్ని మహిళలు ముట్టడించారు. పొన్నూరులో ఎమ్మెల్యే నరేంద్ర ఆధ్వర్యంలో, బాపట్లలో తెలుగు మహిళల ఆధ్వర్యంలో ప్రదర్శనలు జరిగాయి. &V $r˝ Ş ⋇Œ⌗˝B{≼ ⅁Z



క్వాలిటీ.. కుట్ర

- బర్లీ పొగాకు కొనుగోళ్లపై కంపెనీల దృష్టి
- మార్క్‌ఫెడ్ ప్రకటనతో గ్రామాలకు కంపెనీల ప్రతినిధులు
- లో క్వాలిటీ పొగాకు సంగతేమిటని ప్రశ్నిస్తున్న రైతులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

దాదాపు నెలన్నర రోజుల నుంచి బర్లీ పొగాకు కొనుగోళ్లపై కంపెనీలు స్పం దించలేదు. అయితే చివరకు ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించడంతో ఇప్పుడు కంపెనీలు హడావుడి చేస్తు



పర్చూరులో పొగాకును పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ (పాత చిత్రం)

న్నాయి. అయితే రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తాన్ని కాకుండా క్వాలిటీ అంటూ సరికొత్తగా కుట్రకు తెరలేపుతు న్నాయి. గతంలో పలు దఫాలుగా సమా వేశాలు పెట్టి హెచ్చరించినా అంతంత మాత్రంగానే కదిలిన కంపెనీలు ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ప్రకటనతో ఇప్పు డు కేవలం క్వాలిటీ పొగాకుపైనే దృష్టి పెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. మే చివరి వారంలో మార్టూరు లో కంపెనీలతో నిర్వహించిన సమీక్షలో బర్లీ కొనుగోళ్లలో హైక్వాలిటీ (రూ.12,000), మీడియం, లోగ్రేడ్ (రూ.5,000 నుంచి రూ.6,000) రెండే రకాల ప్రామాణికాలు పాటించాలని మా ర్టూరులో జరిగిన సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. అయినా కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం ఆశించిన స్థాయిలో కంపెనీల నుంచి స్పందన లేదు. ఈ పరిస్థితుల్లో ప్రభు త్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దిం చింది. పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో లాంఛనంగా కొనుగోలు కేం ద్రాన్ని కూడా మార్క్‌ఫెడ్ ప్రారంభిం చింది. ఈ క్రమంలో గడచిన నాలుగు రోజులుగా అనూహ్యంగా కంపెనీలు స్వరం మార్చి క్వాలిటీ పొగాకు కొనుగోళ్ల కోసం రైతుల వద్దకు ఏజెంట్లను పంపి స్తున్నాయి. మార్క్‌ఫెడ్ ప్రకటనకు ముం దు క్వింటాకు (మిగతా 6వ పేజీలో)



ప్రభుత్వ ఆమోదమే మిగిలింది!

- పంచాయతీలకు గ్రేడ్‌లు
- పల్నాడు జిల్లాలో పూర్తయిన ప్రక్రియ
- నివేదిక పంపిన అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పంచాయతీ పాలనను ప్రభుత్వం ప్రక్షాళన చేస్తోంది. గ్రామల్లో ప్రజలకు సేవలను అత్యంత చేరువ చేసేందుకు పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తోంది. పాలన విధానంలో కూడా మార్పులు తీసుకొస్తోంది. పంచాయతీల్లో ఇప్పటి వరకు క్లస్టర్ల పాలన సాగింది. దీనికి స్వస్తి చెప్పి పంచాయతీలకు గ్రేడ్‌ల ను కేటాయిస్తోంది. ఆదాయం, జనాభా ఆధారంగా ఈ గ్రేడ్‌లు కేటాయించారు. ఈ ప్రక్రియ పల్నాడు జిల్లాలో పూర్తయింది. త్వరలోనే గ్రేడ్‌ల విధానం అమలులోకి తీసుకు రానున్నారు. దీని ప్రకారం సిబ్బందిని కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

11 పంచాయతీలకు స్పెషల్ గ్రేడ్..

ప్రస్తుతం పంచాయతీలు మైనర్, మేజర్‌లుగా ఉన్నాయి. కొన్ని మైనర్ పంచాయతీలకు ఒక మేజర్ పంచాయతీని కలపి క్లస్టర్ పంచాయతీలు ఏర్పాటు చేశారు. ఈ విధానం 2010 నుంచి అమల్లోకి వచ్చింది. జిల్లాలో 529 పంచాయతీలు ఉన్నాయి. జనాభా 15,10,509 మంది. అన్ని పంచాయతీల ఆదాయం రూ.45.36 కోట్లుగా ఉంది. 11 పంచాయతీలను స్పెష ల్ గ్రేడ్‌కు ఎంపిక చేశారు. గ్రేడ్ -1 కింద 111, గ్రే డ్ -2 కింద 169, గ్రేడ్ -3 కింద 238 పంచాయతీలను ఎంపిక చేశారు. ఈ ఎంపిక ప్రక్రియ పూర్తయింది. మూడేళ్ల సరాసరి ఆదాయాన్ని ప్రాతిపదికగా తీసుకొని గ్రేడ్‌లు కేటాయించారు. మూడేళ్లలో రూ.కోటి ఆదాయం దాటిన పంచాయతీకి స్పెషల్ గ్రేడ్ కేటాయించారు. 4 వేల నుంచి 10 వేల లోపు జనాభా ఉండి రూ.50 లక్షల నుంచి రూ.కోటి లోపు ఆదాయం ఉంటే పంచాయ తీని గ్రేడ్ -1 కింద కేటాయించారు. 2 వేల నుంచి 4 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలను ఆదాయంతో సంబంధం లేకుండా గ్రేడ్ -2 కింద ఎంపిక చేశారు. 2 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలను గ్రేడ్ -3 పరిధిలోకి తీసుకొచ్చారు. పంచాయతీల గ్రేడ్‌లపై ప్రభుత్వానికి అధికారు లు నివేదిక పంపారు. ఇక ప్రభుత్వ అమోద ముద్ర పడాల్సిందే తరు వాయి. గ్రేడ్‌ల విధానం అమల్లోకి వస్తే పంచాయతీల్లో సిబ్బంది పెరగడంతో పాటు పల్లె వాసులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది.

రేషన్ మాఫియా.. బరితెగింపు

రేషన్ డోర్ డెలివరీ లేదు. ఎండీయూ వాహనాలను ఆపేశారు. అయినా చాలాప్రాంతాల్లో ఎండీయూ ఆపరేటర్లు ఇళ్ల వద్దకు వస్తున్నారు.. రోడ్లపైనే బహిరంగంగా కార్డుదారులతో వేలిముద్రలు వేయించుకుంటున్నారు. సరుకులతో సంబంధం లేకుండా నగదు ఇస్తూ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలి స్తున్నారు. పేదల పొట్ట నింపాల్సిన ఉచిత బియ్యం మాఫియా జేబులను నింపుతోంది. అడ్డుకోవాల్సిన అధికారులు, వ్యతిరేకించాల్సిన ప్రజా ప్రతినిధుల అండతో రేషన్ మాఫియా బరితెగిస్తోంది. ఎండీయూలను రద్దు చేసిన ప్రభుత్వం కార్డుదారుల సౌలభ్యం కోసం ఎక్కడైనా రేషన్ తీసుకునే సౌలభ్యంతో పాటు ఈ-పోస్‌కు కాటాలకు లింకు తొలగించడంతో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల సహకారంతో మాఫియా చెలరేగిపోతోంది.

ఎండీయూలు రద్దు చేసినా వారిదే రాజ్యం

- వరంగా మారిన ఈ-పోస్, కాటా లింకు తొలగింపు
- బియ్యం లేకుండానే కార్డుదారులతో బహిరంగంగా వేలిముద్రలు
- డీలర్ అవతారమెత్తిన డాన్ అనుచర ఎండీయూ ఆపరేటర్



రోడ్డుపైనే వేలిముద్రలు వేయించుకుంటున్న డాన్ అనుచరుడు

అప్పుడు.. ఇప్పుడు అతడే

గత ప్రభుత్వ హయాంలో గుంటూరు నగరంలో అనిల్ అనే వ్యక్తి రేషన్ మాఫియా కార్యకలాపాలు కొనసాగించాడు. ప్రభుత్వం మారిన తర్వాత కూడా అతడే యథావిధిగా రేషన్ మాఫియా కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడనేది బహిరంగ రహస్యం. ఎండీయూలు నడపడం, అక్రమాలు చేయడంలో అను భవం పొందిన ఇతడు తన అనుచరులతో డీలర్ల వ్యవస్థకు సమాం తరంగా డోర్ డెలివరీ వ్యవస్థను కొనసాగిస్తున్నాడు. వాహనాలు, సరుకులు ఏమీ లేకుండా, ఈ-పోస్ యంత్రాన్ని తీసుకుని కార్డుదారుల వద్దకు వెళ్లి వేలిముద్రలు వేయించుకుని, చేతిలో డబ్బులు పెట్టి వస్తున్నారు. వాటాలు తీసుకుని అధికారులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు అతడికి సహక రిస్తుండడం గమనార్హం.

గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రేషన్ అక్రమాలను అడ్డుకోవడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం డోర్ డెలివరీ విధానాన్ని నిలిపివేసింది. ఎండీయూ వాహనాలను రద్దు చేసింది. అయినా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో రేషన్ మాఫియా డోర్ డెలివరీ విధానాన్ని సరికొత్తగా నడుపుతోంది. ఎండీయూల స్థానే డీలర్లకు సమాంతరంగా ప్రత్యేకంగా వ్యవస్థను రూపొందించి నడిపిస్తోంది. లబ్ధిదారుల వద్దకే నేరుగా వెళ్లి సరుకులు ఇవ్వకుండానే ఇచ్చినట్లు వేలిముద్రలు తీసుకుని దర్జాగా అక్రమాలకు పాల్పడుతోంది. బహి రంగంగా.. నడి రోడ్లపైనే రేషన్ డెలివరీ వ్యవహారాన్ని నడిపిస్తోంది. ఇటీవల డానియేలు అనే డాన్ అనుచరుడు దర్జాగా బైల్లెట్‌పై వచ్చి గుంటూరులోని లబ్ధిదారులతో వేలుముద్రలు వేయించుకుని నగదు ఇచ్చి వెళ్లాడు. దీనిని ప్రజలు వీడియో తీస్తున్నా ఏమాత్రం వెరపు లేకుండా వ్యవహారాన్ని చక్కబెట్టుకున్నాడు. రేషన్ డాన్, అతడి అనుచర మాఫియా (మిగతా 6వ పేజీలో)




చినపాలెం వద్ద కాల్వపై నిర్మాణం | భట్టిప్రోలు వద్ద కాల్వపై నిర్మాణం

గడువు ముంచుకొస్తోంది!

కృష్ణా పశ్చిమ డెల్టా కాల్వల మరమ్మతుల పనుల్లో కొన్ని పనుల్లో వేగం పుంజుకుంటే, మరికొన్ని పనులు నత్తనడకన సాగుతున్నాయి. పశ్చిమ డెల్టా పరిధిలోని బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉన్న ఆయకట్టు మొత్తానికీ సాగునీరందించేందుకు ఉన్న కాల్వలన్నీ అధ్వాన్న స్థితిలోనే ఉన్నాయి. ఈ జిల్లాల పరిధిలోని ప్రధాన కాల్వలు, ఉప కాల్వలే కాక, డ్రెయిన్‌ల మరమ్మ తులకు కూటమి ప్రభుత్వం రూ.25 కోట్లను ఓఅండ్‌ఎం నిధుల కింద మంజూరు చేసింది. ఈ నిధులతో కాల్వల పనులు పూర్తి చేయాల్సి ఉంది. దీనికి జూలై మొదటి వారం వరకు మాత్రమే అంటే 20 రోజుల గడువు ఉంది. సమయం కూడా ప్రధాన సమస్యగా ఉన్న తరుణంలో కొన్నిచోట్ల పనులు వేగం అందుకోకపోవడం రైతులను కలవరపాటుకు గురిచేస్తోంది. నిధులుండి కూడా పను లు చేయకుంటే ఈ సంవత్సరం కూడా పంట నష్టపోతామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

- డెల్టా కాల్వల మరమ్మతుల్లో అక్కడక్కడా తాత్సారం
- తూటుకాడ తొలగింపులో కొన్నిచోట్ల ఆలస్యం
- నత్తనడకన డ్రెయిన్‌ల పనులు
- కట్టల పటిష్టత అంతంత మాత్రమే
- షట్టర్లు, స్లూయిజ్‌ల వంటి కాంక్రీట్ పనులు వేగం
- జూలై మొదటి వారంలో ఖరీఫ్‌కు నీరు విడుదల
- సకాలంలో 746 పనులు పూర్తయ్యేనా?

తెనాలి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టాలో 5.71 లక్షల ఎకరాల ఆయకట్టులో ఖరీఫ్ వరి, రబీలో మొక్కజొన్న, మినుము వంటి పంటలు సాగవుతున్నాయి. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉన్న ఈ మొత్తం ఆయకట్టుకు సంబంధించి కాల్వల మరమ్మతు పనులు సకాలంలో పూర్తయితేనే రేపటి ఖరీఫ్ గట్టెక్కే పరిస్థితి ఉంది. సాగునీటి కాల్వల పనుల విషయంలో కొంత వరకు పర్వాలేదనిపించినా, ప్రధానంగా డ్రెయిన్‌ల (మిగతా 6వ పేజీలో)

మిర్చియార్డులో ట్రేడింగ్ ప్రారంభం

- తొలి రోజు 27 వేలకు పైగా టిక్కీల రాక
- రూ.14,700 ధర పలికిన తేజ వెరైటీ మిర్చి

గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం గుంటూరు మిర్చి యార్డులో క్రయవిక్రయాలు పునః ప్రారంభమయ్యాయి. ఆదివారం సాయంత్రం నుంచే టిక్కీల దిగుమతికి అనుమతించడంతో సోమవారం ఉదయానికి 27 వేల పైచిలుకు కమీషన్ దుకాణాలకు చేరాయి. ఎండ తీవ్రత తగ్గకపోయినా గతంలో ప్రకటించిన విధంగా సోమవారం ఉదయం 7 గంటలకు విక్రయాలను దిగుమతి వ్యాపారులు ప్రారంభించారు. రైతుల సమక్షంలో శాంపిల్స్‌ని షాపుల్లో ప్రదర్శించారు. ఎగుమతిదారులు వేలం కేంద్రాలను సందర్శించి కొనుగోళ్లు చేపట్టారు. ప్రధానంగా తేజ, 341 వెరైటీలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. తొలి రోజు అయినా 23 వేల టిక్కీల వరకు విక్రయాలు జరిగాయి. మిర్చి వెరైటీని బట్టి రూ.9500 నుంచి రూ.14 వేల వరకు ధర లభించింది. విదేశాలకు ఎగుమతి జరిగే తేజకు క్వింటా ధర రూ.14 వేల 700 వరకు లభించింది. మిర్చి తాలు కాయలకు రూ.4,500 నుంచి రూ.7 వేల వరకు ధర లభించింది. ఈ వారం అంతా కాస్త మందకొడిగానే కొనుగోళ్లు జరుగుతాయని, వచ్చే వారం నుంచి పెరిగే అవకాశం ఉంటుందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.



మిర్చియార్డులో ప్రారంభమైన మిర్చి కొనుగోళ్లు

షైనింగ్.. స్టార్స్‌గా ఎదగాలి

◆ ప్రతిభ అవార్డుల ప్రధానోత్సవ సభలో కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): భావిభారత పౌరులుగా ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నతమైన ఉద్యోగాలను సాధించే దిశగా విద్యార్థులు ఎదగాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. షైనింగ్‌స్టార్ 2025 అవార్డుల ప్రధానోత్సవం సోమవారం స్థానిక సాయిరాం కన్వెన్షన్ హాలులో జరిగింది. పదిలో 164, ఇంటర్మీడియట్‌లో 36 మంది విద్యార్థులను సత్కరించి నగదు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలతో పెడదోవపట్టరాదని, ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని విద్యార్థులు గమనించాలని, కష్టపడి చదివితే భవిష్యత్తును మీరే నిర్మించుకోవచ్చన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ఇష్టంతో కష్టపడి చదవాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను నిర్వహించడానికి ప్రభుత్వం ప్రణాళికతో ముందుకెళ్తుందన్నారు. విద్యారంగంలో పెనుమార్పులు తెస్తూ, విద్యార్థుల్లో స్ఫూర్తి నింపడానికి షైనింగ్ స్టార్స్ అవార్డులను మంత్రి లోకేశ్ అందిస్తున్నారని తెలిపారు. చీరాల ఎమ్మెల్యే ఎం.మాలకొండయ్య మాట్లాడుతూ ప్రతిభావంతులను వెలికితీసి సమాజం కోసం ప్రయోజకులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పిల్లలే మీ సంపదగా భావించి బాగా చదివిస్తే కుటుంబ భవిష్యత్తు, ఆర్థిక పరిస్థితి మారిపోతుందని తల్లిదండ్రులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం, సమగ్రశిక్ష ఏపీసీ నాగిరెడ్డి, ఆర్‌ఐవో ఆంజనేయులు, ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, తహసీల్దార్ షేక్.సలీమా, ఎంఈవో డి.ప్రసాదరావు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యేలు నరేంద్రవర్మ, కొండయ్య



పీ-4తో పేదరికం లేని సమాజం

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

బాపట్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక అసమానతలు, పేదరికం లేని సమాజాన్ని నిర్మించడానికి పీ-4 ద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి సోమవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో సీఎం సమీక్షించారు. స్వర్ణాంధ్ర-2047 జిల్లా ప్రణాళిక యూనిట్లను వర్చువల్‌గా సీఎం ప్రారంభించారు. బాపట్ల కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం, సచివాలయంతో అనుసంధానం చేసి అభివృద్ధి పనులు చేయడానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్వో గంగాధర్‌గౌడ్, సీపీవో శ్రీనివాసరావు, డీపీవో ప్రభాకర్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, ఆర్డీవో పి.గ్లోరియా పాల్గొన్నారు.

12న జీవిత భాగస్వామి పెన్షన్లు

బాపట్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకంలో భాగంగా జిల్లాకు మంజూరైన జీవిత భాగస్వామి పెన్షన్లు 2,717 మందికి గురువారం పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. పెన్షన్ కింద ఒక్కొక్కరికి రూ.4 వేలు చొప్పున అందించబడుతుందన్నారు. కోటి 8లక్షల 68 వేల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

అవీ..ఇవీ..

రాతి మండప నిర్మాణానికి దాతల విరాళం



రసీదు అందజేస్తున్న ఆలయ సిబ్బంది

అద్దంకి,జూన్9(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం రాతి ముఖ మండప నిర్మాణానికి సోమ వారం దాతలు విరాళాలు అందజేశారు. పంగులూరు మండలం జనకవరానికి చెందిన తలపనేని సతీష్‌బాబు రూ.1,01,116 హైదరాబాద్‌కు చెందిన ఈరంకి సూర్యనారాయణమూర్తి , ఉషారాణి దంపతులు పూజారి సత్యం ద్వారా రూ.1,00,116 రూపాయలను దేవాలయ సిబ్బంది మధుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను సత్కరించారు.

రామస్థూపం నిర్మాణానికి విరాళం

అద్దంకి, జూన్9(ఆంధ్రజ్యోతి): శింగరకొండ సమీపంలో నిర్మాణంలో ఉన్న రామస్థూపం నిర్మాణానికి రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావు, కాళీ ప్రసన్న దంపతులు సోమవారం రూ.25 వేలను అందజేశారు. వివాహ వార్షికోత్సవము సందర్భంగా విరాళం అందజేసిన చుండూరి మురళీసుధాకరరావు, కాళీప్రసన్న దంపతులను శ్రీరమ్యం పౌండేషన్ అధ్యక్షుడు స్వర్ణ వెంకటసుబ్బారావు, రోటరీక్లబ్ చప్పిడి వీరయ్యల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహ్మద్ రఫీ, మలాది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, సంకా సుబ్రహ్మణ్యం, వువ్వాడ రామకోటేశ్వరరావు, అద్దంకి లేవి ప్రసాద్, జాగర్లమూడి శికుమారి, అలహరి హరిప్రసాద్, అన్నంగి సుబ్బారావు,షేక్ అంజాద్‌బాషా,తమ్మన శ్రీనివాసరావు, బాచిన స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

విజన్ యాక్షన్‌ప్లాన్ కార్యాలయం ప్రారంభం

అద్దంకి, జూన్9 (ఆంధ్రజ్యోతి): విజన్-2047లో భాగంగా అద్దంకిలో నియోజకవర్గ విజన్ కార్యాచరణ ప్రణాళిక యూనిట్ కార్యాలయాన్ని ఎంపీ డీవో కార్యాలయం ఆవరణలో సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సీఎం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో అద్దంకి నియోజకవర్గ యూనిట్ కన్వీనర్ బాలమ్మ, ఎంపీడీవో శింగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పవర్‌ప్లాంట్‌లో ఎలక్ట్రీషియన్ మృతి

సంతమాగులూరు జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆదవి పాలెం గ్రామ సమీపంలో అద్దంకి బ్రాంచ్ కెనాల్ పై ఉన్న పవర్ ప్లాంట్‌లో సోమవారం జరిగిన ప్రమాదంలో ఏల్చూరు గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ జూటూరి కొండగురవయ్య (21) మృతిచెందారు. అందిన వివరాల ప్రకారం జూటూరి కొండగురవయ్య ఏడాదిగా పవర్ ప్లాంట్ లో కాంట్రాక్టు బేసిక్ పై ఎలక్ట్రిషన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం పవర్‌ప్లాంట్‌లో మరమ్మతులు చేసే సమయంలో విద్యుత్ షాక్‌కు గురై శరీర భాగాలు కాలిపోయాయి. దీంతో కొనఊపిరితో ఉన్న క్షతగాత్రున్ని అంబులెన్స్‌లో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. కొండ గురవయ్య వారి కుటుంబానికి ఒక్కడే కొడుకు, గ్రామంలో అందరితో కలుపుగోలుగా ఉండేవాడు. కొండ గురవయ్య మృతి చెందాడని వార్త తెలియడంతో గురవయ్య కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు గా విలపిస్తున్నారు. దీంతో ఏల్చూరు లో విషాదచాయలు అలుముకున్నాయి. ఘటనా స్థలాన్ని ఎస్ఐ పట్టాభి రామయ్య పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్వాలిటీ కుట్ర..

(5వ పేజీ తరువాయి)

రూ.8,500 ధర ఇవ్వడానికి కూడా సుముఖత చూపని కంపెనీలు ఇప్పుడు రూ.10,000 ఇస్తామని క్వాలిటీ పొగాకు మొత్తాన్ని లాగేసే పనిలో ఉన్నట్లు సమాచారం. మార్క్‌ఫెడ్ పూర్తి స్థాయిలో రంగంలోకి దిగడానికి రెండు మూడు రోజులు సమయం పట్టే అవకాశం ఉండడంతో ఈలోపులోనే క్వాలిటీ బర్లీని మొత్తం తమ హస్తగతం చేసుకునేలా కంపెనీలు పావులు కదుపుతున్నాయి. అంతర్జాతీయంగా పొగాకు మార్కెట్ తీవ్ర ఒడిదుడుకుల్లో ఉందని చెబుతూ వస్తున్న కంపెనీలు మార్క్‌ఫెడ్ ప్రకటన రాగానే క్వాలిటీ పొగాకు కోసం గ్రామాల్లో జల్లెడ పట్టడాన్ని రైతులు తప్పుబడుతున్నారు. క్వాలిటీలో అయితే లాభాలు గడించే అవకాశం ఉండడంతో లోగ్రేడ్ రకాలను పూర్తిగా విస్మరించి వారి ప్రయోజనాలే పరమావధిగా కంపెనీల అడుగులు ఉండడంపై రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రూ.12,000 వరకు క్వాలిటీ పొగాకుకు మార్క్‌ఫెడ్ ధర ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ ఆశతోనే రైతులు తాము మార్క్‌ఫెడ్‌కే అమ్ముకుంటామని ఏజెంట్లకు తెగేసి చెబుతున్నట్లు సమాచారం. బాపట్ల జిల్లాలో 3 లక్షలు, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో దాదాపు 1.60 లక్షల క్వింటాళ్ల వరకు బర్లీ పొగాకు ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఇందులో దాదాపు 50 శాతం క్వాలిటీ గ్రేడ్ రకం కాగా మిగిలినది మీడియం, లో క్వాలిటీగా ఉంది.

రేషన్ మాఫియా.. బరితెగింపు

(5వ పేజీ తరువాయి)

సభ్యులు ఇంతలా బరితెగించి చెలరేగిపోతున్నా, పత్రికల్లో పుంఖానుపుంఖాలుగా కథనాలు వస్తున్నా పౌర సరఫరాల అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

అక్రమాలకు కొన్ని ఉదాహరణలు..

- గుంటూరు సాయికృష్ణనగర్‌లోని డీలర్ రాజీనామాతో డాన్ అధికారులతో మాట్లాడి ఆ షాపునకు డానియేలు అనే అతణ్ణి ఇన్‌చార్జిగా నియమించేలా చేసుకుని వ్యవహారాన్ని నడిపిస్తున్నాడు.
- గుంటూరు -1 పరిధిలో ఉన్న షాపునకు సంబంధించిన ఈ-పోస్ యంత్రాన్ని తెచ్చి గుంటూరు-2 పరిధిలో వేలిముద్రలు వేయించుకుంటున్నారు.
- భరత్‌పేటలో గుంటూరు-వన్‌కు చెందిన మాఫియా అనుచరులు వేలిముద్రల తతంగాన్ని బహిరంగంగానే నడిపిస్తున్నారు.

వైసీపీ నాయకుడే.. ఇన్‌చార్జి డీలర్

దుకాణం నల్లచెరువులో.. వేలిముద్రలు పలకలూరు రోడ్డులో

గుంటూరు: కూటమి ప్రభుత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల సంగతేమోగాని వైసీపీ శ్రేణులకు మాత్రం అన్ని పనులు జరిగిపోతున్నాయి. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలోనే కాకుండా ప్రభుత్వం మారిన తర్వాత కూడా కూటమిపై బహిరంగంగా విమర్శలు, నిరసనలు చేపట్టిన వారికి ఏకంగా ఇన్చార్జి డీలర్‌షిప్ కట్టబెట్టారు. గుంటూరులోని పలకలూరురోడ్డు కృష్ణబాబుకాలనీకి చెందిన వైసీపీ నాయకుడికి గతంలో ఎండీయూ వాహనాన్ని కేటాయించారు. అతడు వాహనాల ఆపరేటర్ల నుంచి పెద్దమొత్తంలో బియ్యాన్ని కొనుగోలు చేసి లక్షలు పోగేసుకున్నాడనేది బహిరంగ రహస్యం. ఎండీయూ వాహనాల రద్దును వ్యతిరేకిస్తూ గత నెల 23న స్తంభాలగరువు సెంటర్లో దర్నా, రాస్తారోకో చేశాడు. నల్లచెరువులోని 145 నెంబరు డీలర్ రాజీనామాతో అక్కడ ఇన్‌చార్జిగా పలకలూరురోడ్డు ప్రాంతానికి చెందిన వైసీపీ నాయకుడ్ని నియమించారు. అతడు అక్కడ సరుకులు పంపిణీ చేయకుండా బియ్యానికి నగదు పంపిణీ చేస్తున్నాడు. ఆ బియ్యాన్ని మాఫియా డాన్‌కు తరలిస్తున్నాడు. ఎక్కడో నల్లచెరువు ప్రాంతానికి చెందిన ఈ-పోస్ యంత్రంతో పలకలూరు రోడ్డులోని కార్డుదారులతో వేలిముద్రలు వేయిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. కార్డుదారులు ఎక్కడైనా రేషన్ తీసుకునే సౌలభ్యం ప్రభుత్వం కల్పించగా దాని ఆధారంగా అక్రమ దందాను కొనసాగిస్తున్నట్లు తోటి డీలర్లు వాపోతున్నారు.

యోగాతో ఆరోగ్యవంతమైన జీవితం

పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు

పర్చూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : యోగాతో ఆరోగ్యవంతమైన జీవితం పొందవచ్చని, ప్రతి ఒక్కరూ విధిగా రోజూ 45 నిమిషాల పాటు యోగా చేయాలని ఈవోఆర్‌డీ సత్యనారాయణ కోరారు. సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పర్చూరు మండలంలోని చెరుకూరు, రమణాయపాలెం, పోతుకట్ల, ఉప్పుటూరు, నాగులపాలెం, నూతలపాడు, ఇనగల్లు, అన్నంబొట్ల వారిపాలెం, తిమ్మరాజుపాలెం తదితర గ్రామాల్లో పెద్ద ఎత్తున యోగాపై ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, పంచాయితీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

పంగులూరు: మానవాళి సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడే యోగా ప్రాధాన్యతను ప్రతిఒక్కరూ గుర్తించాలని ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ కృష్ణకుమార్ అన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పంగులూరులో సోమవారం పలు శాఖల అధికారులు, సిబ్బంది ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో మానవహారం చేపట్టి యోగాసనాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. క్యాక్రమంలో ఎంపీడీవో కె.స్వరూపారాణి, తహసీల్దార్ సింగారావు, ఎంఈవో-2 వీరాంజనేయులు, డిప్యూటీ ఎంపీడీవో సుమంత్, హౌసింగ్ ఏఈ కిషోర్‌బాబు, ఏపీవో సంతోషం పంచాయితీ కార్యదర్శి రాంబాబు, ఆశాలు, పలువురు మహిళలు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.





నూతలపాడులో యోగాపై ర్యాలీ, పంగులూరులో మానవహారం చేపట్టిన అధికారులు

గ్రామాలలో యోగాంధ్ర ర్యాలీలు

మార్టూరు : 11వ అంతర్జాతీయ యోగాదినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని గ్రామాలలో సచివాలయ ఉద్యోగులు ఆధ్వర్యంలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ముఖ్యంగా వలపర్ల, కోనంకి గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు హరిబాబు, సుధాకర్ ల పర్యవేక్షణలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిఒక్కరూ యోగపై అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా మానసికంగా,శారీరకంగా దృడత్వంగా తయారవుతారన్నారు.ఈ కార్యక్రమంలో యోగా గురువు ఆత్మకూరి సీతారామాంజనేయులు,ఆయుష్ వైద్యులు అంజమ్మ,పలువురు సచివాలయ ఉద్యోగులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వేటపాలెం(చీరాల) : ప్రతి ఒక్కరూ విధిగా యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని, ఎంపీడీవో రాజేష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కొత్తపేట పంచాయతి పరిధిలో యోగాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, సెక్రటరీ రమేష్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరు : మానవాళి సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడే యోగా ప్రాధాన్యతను ప్రతిఒక్కరూ గుర్తించాలని ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ కృష్ణకుమార్ అన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పంగులూరులో సోమవారం పలు శాఖల అధికారులు, సిబ్బంది ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో మానవహారం చేపట్టి యోగాసనాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. క్యాక్రమంలో ఎంపీడీవో కె.స్వరూపారాణి, తహసీల్దార్ సింగారావు, ఎంఈవో-2 వీరాంజనేయులు, డిప్యూటీ ఎంపీడీవో సుమంత్, హౌసింగ్ ఏఈ. కిషోర్‌బాబు, ఏపీవో సంతోషం పంచాయితీ కార్యదర్శి రాంబాబు, ఆశాలు, పలువురు మహిళలు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకి : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి రోజు యోగా సాధన చేయాలని 12వ వార్డు కౌన్సిలర్ అత్తులూరి రమేష్ అన్నారు. ఈ నెల 21వ తేదీ జరిగే యోగా దినోత్సవం విజయవంతం చేయాలని కోరుతూ 12వ వార్డు కౌన్సిలర్ అత్తులూరి రమేష్ ఆధ్వర్యంలో సోమవారం పాత ఆంధ్రాబ్యాంక్ వద్ద నుండి పొట్టి శ్రీరాములు బొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ లో యోగా శిక్షకులు అంజాద్ భాషా, అప్పారావు, కురిచేటి శంకరరావు, భాస్కరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మేదరమెట్ల : రాష్ట్రప్రభుత్వం నెలరోజులపాటు నిర్వహిస్తున్న యోగా కార్యక్రమానికి సంబంధించి కొరిశపాడులో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మే 21వ తేదీ నుంచి జూన్ 21వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారు. సోమవారం కొరిశపాడు గ్రామంలో అవగాహనా ర్యాలీ అనంతరం యోగా చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా మానసిక శారీరక ఆరోగ్యం లభిస్తుందన్నారు. నిత్యజీవన విధానంలో ఒత్తిళ్లను తట్టుకోవడానికి యోగా ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో మండలకార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.





చీరాల, అద్దంకిలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పంగులూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005 పదోతరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా నిర్వహించారు. రెండు దశాబ్దాల తర్వాత కలుసుకున్న విద్యార్థులు, ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాలతో, ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో గడిపిన రోజులలో చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. గురువుల ఉత్తమ బోధన, నేర్పిన క్రమశిక్షణ తమ జీవితాలకు అన్వయించుకున్న పూర్వ విద్యార్థులు విశ్రాంత హెచ్‌ఎం మోపర్తి వెంకటరావు, నార్నె తాతయ్య, అజిత్ ట్రస్ట్ చైర్మన్ వీరనారాయణ, పాఠశాల స్థల దాతల కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. పాఠశాల అవసరాలకు తమ చేయుత అందిస్తామన్నారు. హెచ్‌ఎం గిరిజ అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో అడ్డగడ సుబ్బయ్య, పెంట్యాల వాసుబాబు, ఉపాధ్యాయులు ఆచారి, అంకమ్మ, సూరిబాబు, మీనిశెట్టి శ్రీనివాసరావు, అద్దంకి శ్రీదర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



పదో తరగతి 2005 బ్యాచ్ చందలూరు ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

చివరి పొగాకు చెక్కునూ కొనుగోలు చేస్తారు

మార్టూరు, జూన్9 (ఆంధ్రజ్యోతి) : మార్క్‌ఫెడ్ వారు రైతుల దగ్గర బర్లీ పొగాకు కొనుగోలు ప్రారంభించారని, రైతుల దగ్గర ఉన్న చివరి పొగాకు చెక్కును కొనుగోలు చేసే విధంగా మార్క్‌ఫెడ్ వారు చర్యలు తీసుకుంటారని టీడీపీ నాయకులు కామేపల్లి హరిబాబు అన్నారు. సోమవారం సాయంత్రం మార్టూరులో టీడీపీ మండల నాయకులు పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. పర్చూరు నియోజకవర్గంలో పొగాకు పంట సాగు చేసిన రైతుల అవస్థలను చూసిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రాష్ట్రమంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, తదితరుల సహకారంతో మార్క్‌ఫెడ్ వారు పొగాకును కొనుగోలు చేసే విదంగా కృషి చేశారన్నారు. పర్చూరు మార్కెట్ యార్డుద్వారా కొనుగోలు ప్రారంభించారని, త్వరలోనే మార్టూరులో కూడా పొగాకును కొనుగోళ్లు ప్రారంభిస్తారన్నారు. రైతులు తమ దగ్గర ఉన్న పొగాకును బేళ్ల రూపంలో సిద్ధం చేసుకోవాలన్నారు. రైతుల దగ్గర ఉన్న పొగాకును పూర్తిగా కొనుగోలు చేసే విధంగా ఎమ్మెల్యే ఏలూరి కృషి చేస్తారన్నారు. సమావేశంలో తాటి నాగేశ్వరరావు,షేక్ రజాక్,కామినేని జనార్ధన్, తొండెపు ఆదినారాయణ, కమ్మ శివనాగేశ్వరరావు, కాకోలు వెంకటేశ్వర్లు, జాగర్లమూడి శ్రీనివాసరావు, తేలప్రోలు సాంబశివరావు, రావినేని శ్రీను తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న టీడీపీ నేతలు

ముంచుకొస్తోంది !

(5వ పేజీ తరువాయి)

మరమ్మతు పనుల్లో మాత్రం వేగం నీరసించిపోయింది. సాగునీటి సంఘాలు ఉత్సాహంగా ఉన్నచోట పనులు జరిగిపోతుంటే, కొందరు చేద్దాంలే అన్నట్లు కాడి కింద పడేస్తున్నారు. దీనికి కారణం... నిధులు విడుదల అవుతాయా! లేదా! అనేది ఒక అనుమానం అయితే, గత ప్రభుత్వ కాలంలో పనులు చేసిన వారికి నేటికీ ఆ మొత్తాలు విడుదల కాకపోవడమే.

సకాలంలో 746 పనులూ పూర్తయ్యేనా!

సాగునీటి కాల్వలపై ప్రధానంగా స్లూయిజ్‌లు, షట్టర్ల నిర్మాణ పనులు, గుర్రపు డెక్క, తూటుకాడ తొలగింపు, కాల్వ కట్టలపై జంగిల్ క్లియరెన్స్, కట్టలు బలపరచడం, గండ్లు పడే పరిసితి ఉన్నచోట వాటిని పూడ్చటం వంటి పనులు చేయాల్సి ఉంది. మొత్తం 746 పనులను అధికారులు గుర్తించారు. వీటిలో కొన్ని పెద్ద పనులకు టెండర్‌లు పిలిస్తే, మిగిలినవి సమయాబావంతో నామినేషన్‌పై సాగునీటి సంఘాలతోనే చేయిస్తున్నారు. ఐతే జూలై మొదటి వారంలోనే డెల్టా కాల్వలకు 2025-26 ఖరీఫ్ సీజన్‌కు గాను నీటిని విడుదల చేయాల్సి ఉంది. కాల్వల పనుల్లో వేగం కనిపిస్తున్నా, డ్రెయిన్‌ల మరమ్మతులు, పూడికతీత పనుల్లో మాత్రం తీవ్ర జాప్యం కనిపిస్తోంది. రూ. 25 కోట్లలో రూ. 4.8 కోట్ల నిధులు స్లూయిజ్‌లు, షట్టర్‌ల మరమ్మతులకు కేటాయించారు. వీటిలో స్లూయిజ్‌ల నిర్మాణమే రూ. 3 కోట్లతో చేపట్టారు. మంగళగిరి దగ్గర్లోని చినపాలెం, బాపట్ల, తెనాలి, వరహాపురం ప్రాంతాల్లో బ్యాంక్ కెనాల్, మెయిన్ కెనాల్, తూర్పు, పశ్చిమ కాల్వలపై వీటిని చేపట్టారు. ఇవన్నీ కాంక్రీట్‌వి కావడంతో వాటిని మాత్రం వేగవంతం చేశారు. షట్టర్లు బయట తయారు చేయించి తీసుకొచ్చి బిగించడంతో వాటికీ ఇబ్బది లేకుండా ఉంది. అయితే తూటుకాడ తొలగింపు, కట్టలకు పడిన కోత, గండ్లు పడేలా బలహీనపడిన కట్టల పనుల్లో మాత్రం కాస్తంత వెనకడుగు కనిపిస్తోంది. మట్టి కొరతతో పనులు కాస్తంత మందకొడిగానే సాగుతున్నాయి. మరోపక్క డ్రెయిన్‌లలో పూడిక తొలగింపు ప్రక్రియ వేగమందుకోలేదు. గత దశాబ్ద కాలంలో కొన్ని డ్రెయిన్‌లకు మాత్రమే మరమ్మతులు పూర్తిచేశారు. ప్రధానంగా తుంగభద్ర, మరి కొన్నిటిపై, కొమ్మమూరు ప్రధాన కాల్వపై బాపట్ల ప్రాంతంలో గతంలోనే గండ్లు పడటంతో వాటిని అప్పట్లో సరిచేశారు. ఇప్పుడు మాత్రం పూడికతీత పనులు ఎక్కువ భాగం చేయాల్సి ఉంది. వీటిని కూడా వేగవంతం చేస్తే వర్షాలు పడిన సమయంలో పంటలకు ముంపు సమస్య లేకుండా రైతులు కష్టపడి పండించిన పంట చేతికందుతుంది.

నాడు నిధులు లేక అవస్థలు..

నేడు ఉపశమనం

గత వైసీపీ ప్రభుత్వంలో అత్యవసర మరమ్మత్తు పనులు అవసరం ఉన్నా నిధులు మంజూరు చేసింది లేదు. దీంతో కాల్వలన్నీ గండ్లుపడేలా, చుక్క నీరు కిందికి వెళ్లడానికి అవకాశం లేని విధంగా పూడిపోయి ఉన్నాయి. అప్పట్లో నిధులు మంజూరు చేశామనిపించేలా విదిలింపుల తరహాలో చాలీచాలని నిధులు ఇచ్చామనిపించి, వాటిలో సింహభాగం నేతల మేతకే సరిపెట్టేవారు. దీంతో పనులు జరగక, కాల్వల చివరి భూములకు నీరు అందక బీడు పెట్టిన పరిస్థితి కూడా ఉంది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ సాగు నీటి సంఘాలను రంగంలోకి దింపింది. నిధులు విడుదలలో ఎటువంటి జాప్యం ఉండదని కూడా తేల్చిచెప్పింది.

నెలాఖరు లోపే పూర్తి చేస్తాం

కృష్ణా పశ్చిమ డెల్టా కాల్వల పనులు సకాలంలోనే పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. సాగునీటి సంఘాలు కూడా సహకరిస్తున్నాయి. ఈ నెలాఖరులోపు ప్రధాన మరమ్మతులు పూర్తి చేయాలని సూచించాం. స్లూయిజ్‌లు, షట్టర్ల వంటి ప్రధాన పనులు చివరి దశకు చేరాయి. మొత్తమ్మీద 60 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ 20 రోజుల్లో మిగిలిన వాటినికూడా పూర్తిచేస్తాం. వీటి వెంటే డ్రెయిన్‌ల మరమ్మతులూ అయిపోతాయి.

వెంకటరత్నం, ఇన్‌చార్జి ఎస్ఈ,

కృష్ణా పశ్చిమ డెల్టా విభాగం, గుంటూరు

విద్యార్థులకు నగదు బహుమతులు



నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులు

చినగంజాం, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 500 మార్కులు పైన సాధించిన 13 మంది విద్యార్థిని విద్యార్థులకు సోమవారం రూ.30వేల నగదు బహుమతులు అందజేసినట్లు పాఠశాల హెచ్‌ఎం ఎస్.రవి, ఇన్‌చార్జ్ డి.నారాయణరెడ్డిలు తెలిపారు. పాఠశాలలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన హెచ్.ఎం.ఎం.దేవదత్తం, దాసరి మేరీలు, పాఠశాలకు బదిలీపై వచ్చిన యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, ఉపాధ్యాయులు కొమ్మాజు శ్రీనివాసరావులు ఒక్కొక్క విద్యార్థికి రెండు వేల రూపాయిల చొప్పున నగదు బహుమతులను అందజేసినట్లు తెలిపారు. గణిత ఉపాధ్యాయులు బి.చెంచురెడ్డి గణితంలో 99 మార్కులు వచ్చిన విద్యార్థినికి రూ.2,500లు, తెలుగు ఉపాధ్యాయులు ఎన్.రమణమూర్తి తెలుగులో 100 మార్కులు వచ్చిన విద్యార్థులకు రూ4,000ల నగదు బహుమతులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు ఆసోది సుదర్శనరెడ్డి, మరియమ్మ, ఉపాధ్యాయులు జి.హవీలాదేవి, బి.నాగేశ్వరరావు, ఎన్.శ్రీరమణ, ఎ.వీరాచారి, పి.బ్రహ్మయ్య, ఎల్.శివప్రసాద్, ఎం.రాజశేఖర్, పి.డి. అనిల్‌కుమార్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా అవార్డుల అందజేత

మార్టూరు,జూన్9(ఆంధ్రజ్యోతి): బాపట్లలో సోమవారం బాపట్ల, చీరాల శాసన సభ్యులు ఎం.కొండయ్య, నరేంద్రవర్మల చేతుల మీదగా ఇద్దరు విద్యార్థులు ఓబులశెట్టి దిలీప్, బద్దేటి అనూహ్యలు ప్రతిభ అవార్డులను అందుకున్నారు. మార్టూరులోని రాయల్ జూనియర్ కళాశాలకు చెందిన సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీ విభాగంలో ఓబులశెట్టి దిలీప్‌కు 989 మార్కులు, సీఈసీ విభాగంలో బద్దేటి అనూహ్యకు 964 మార్కులు రాగా, వారికి ప్రతిభ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారికి రూ.20 వేల నగదు చెక్కు, ప్రశంసాపత్రం, పతకాన్ని అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వీరగంధం శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రావి అంకమ్మచౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ పురస్కారాల అందజేత

పంగులూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల ఫలితాలలో ప్రతిభ చాటిన ఐదుగురు మండల విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందుకున్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చందలూరు ఉన్నత పాఠశాలకు చెందిన కట్టా హారిక, జిర్రా మణిదీప్‌రెడ్డి, కొండమంజులూరు ఉన్నత పాఠశాలకు చెందిన ఎండ్లూరి సుమనశ్రీ, బూదవాడ ఉన్నత పాఠశాలకు చెందిన భవనం దివ్య, జి.మురళీకృష్ణ సాయిరాం ఈ పురస్కారాలు అందుకున్నారు. బాపట్లలో జరిగిన ఈ ప్రతిభ పురస్కారోత్సవాలలో చీరాల ఎమ్మెల్యే కొండయ్య, బాపట్ల ఎమ్మెల్యే వేగిశన నరేంద్రవర్మల చేతులమీదుగా ఈ పురస్కారాలు అందుకున్నారు. రూ.20వేల నగదుతో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు. పురస్కారం అందుకున్న ఆయా పాఠశాలల విద్యార్థులను ఎంఈవో నాగభూషణం, వీరాంజనేయులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు అభినందించారు.

విద్యార్థులకు షైనింగ్ అవార్డులు

చినగంజాం, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు, స్థానిక సత్యం హైస్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ప్రతిభా పురస్కారం షైనింగ్ స్టార్-2025 అవార్డులు అందుకున్నారు. బాపట్లలోని సాయిరాం కన్వెన్షన్ హాలు నందు సోమవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి, బాపట్ల, చీరాల శాసనసభ్యులు వేగిసిన నరేంద్రవర్మ ఎం.మాలకొండయ్యల చేతుల మీదగా చినగంజాం జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు జ్ఞానేశ్వరి, సాహితీలు సత్యం హైస్కూల్‌కు చెందిన నందమూడి సంధ్యారాణి, కొక్కిలిగడ్డ జాహ్నవి, గుమిని హరిత, నున్నా రేవంత్, బొలిమేర మేరిమాధురి, దేవరకొండ మేఘనలు అందుకున్నారు. అవార్డులు అందుకున్న విద్యార్థులను చినగంజాం జడ్పీ పాఠశాల హెచ్.ఎం.కె.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, సత్యం హైస్కూల్ కరస్పాండెంట్ ఎస్.హరినాథ్‌బాబు, హెచ్.ఎం ఆర్.శ్రీనివాసరావు సన్మానించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాల కొరత

- అద్దె భవనాల్లో అవస్థలు పడుతున్న చిన్నారులు
- బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో 86 కేంద్రాలకు సొంత భవనాల కరువు

బల్లికురవ. జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : సొంత భవనాలు లేక అంగన్ వాడీ కేంద్రాలు ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అద్దె భవనాల్లో సరైన వసతులు లేక చిన్నారులు ప్రతి రోజు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని గ్రామాలలో ఏళ్ల తరబడి భవనాలు అసంపూర్తిగానే ఉన్నాయి. పలు చోట్ల అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాల్లో కేంద్రాలు నిర్వహిస్తున్నారు. అవి కూడా లేని చోట్ల కార్యకర్తలే సొంత నగదు చెల్లించి అద్దెకు తీసుకుని కేంద్రాలను


వసతులు లేక ఇబ్బంది పడుతున్న చిన్నారులు

నిర్వహిస్తున్నారు.

సంతమాగులూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సంతమాగులూరు, బల్లికురవ మండలాలు ఉన్నాయి. ఈ మండలాలలోని గ్రామ పంచాయతీలలో 134 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటిల్లో 48 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. ఇక బల్లికురవలో 19 కేంద్రాలు అద్దె భవనాల్లో పనిచేస్తుండగా 24 కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలలు, దాతలు ఇచ్చిన భవనాల్లో కొనసాగుతున్నాయి. సంతమాగులూరు మండలంలో 70 కేంద్రాలకు గాను 27కే సొంత భవనాలు ఉన్నాయి. మరో 27 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. 16 ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్నాయి. రెండు మండలాల్లో 24 భవనాలు అసంపూర్తి పనులతో నిర్మాణాలు పూర్తి కాకుండానే నిలిచి ఉన్నాయి. అసంపూర్తి భవనాల పనులు పూర్తి కావాలంటే రూ.1.70 కోట్లు అవసరం అని ప్రభుత్వానికి అధికారులు నివేదికలను అందించారు. ప్రభుత్వం గ్రామాలలో ఒక్కో కేంద్రం అద్దెకు నెలకి రూ2 వేలు వంతున అందజేస్తోంది. ప్రభుత్వం ఇచ్చే అద్దెకు గ్రామాలలో ఇళ్లు దొరకడం లేదని కార్యకర్తలు లబో దిబో మంటున్నారు. కొందరు అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సొంత డబ్బు వెచ్చించి కేంద్రాలను నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు గ్రామాలలో ఉన్న గర్భవతులకు బాలింతలకు ప్రతి రోజు కేంద్రాలలో పౌష్టికాహారంతో పాటు భోజనం వండి పెట్టాల్సి ఉంది. అరకొర వసతుల మధ్య వారికి సకాలంలో పౌష్టికాహారం అందించడం కష్టంగా మారింది. కొన్ని గ్రామాలలో అయితే


కొమ్మినేనివారిపాలెంలో అసంపూర్తిగా ఉన్న మూడు అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం

చిన్నారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మధ్యాహ్నం విశ్రాంతి సమయంలో సేద దీరేందుకు వారు వరుసగా ఒకే చాపపై పడుకోవాల్సిన పరిస్థితి ఉంది. బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం గ్రామంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్న ఒక్క దానికి కూడా సొంత భవనం లేదు. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో భవనాల నిర్మాణం పనులు చేపట్టగా ఇంత వరకు అసంపూర్తిగానే నిలిచి ఉన్నాయి. ప్రభుత్వం వెంటనే గ్రామాలలో అంగన్‌వాడి కేంద్రలకు సొంత భవనాలను నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని చిన్నారుల తల్లి దండ్రులు కోరుతున్నారు. ఈ ఏడాది అయిన సొంత భవనాలు సమకురేనా అంగన్ వాడీ కేంద్రాలకు ఈ ఏడాదైనా సొంత భవనాలు సమకురేనా అని తల్లిదండ్రులు ఎదురు చుపులు చుస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల గురించి పట్టించుకోలేదని కూటమి ప్రభుత్వం వెంటనే నిధులు మంజురు చేసి అసంపూర్తి భవనాల పనులను పూర్తి చేయడంతో పాటు కొత్త భవనాలకు నిధులు మంజురు చేయాలని వారు కోరుతున్నారు.

ఖరీఫ్‌లో సాగుకు సమస్యే

- మూలన పడిన మూడు ఎత్తిపోతలు
- ఏటా ఐదువేల ఎకరాలకు సాగునీరు
- ఈ పర్యాయం సాగుపై సందిగ్ధత

చీరాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : నియోజక వర్గంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగుపై అన్న దాతలు సందిగ్ధత వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు వేరుశనగ రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో ఖరీఫ్ తమకు సంతృప్తినిస్తుందంటే అదీ అంతంత మాత్రం గానే కనిపిస్తోంది. ఏటా జూన్ మొదటి నుండి సెప్టెంబరు వరకు ఖరీఫ్ సీజన్. అలాగే అక్టో బరు నుండి ఫిబ్రవరి వరకు రబీ సాగుతుంది. ఈక్రమంలో సుమారు 5 వేల ఎకరాలు వరి, వేరుశనగ ప్రధాన పంటలుగా సాగుచేస్తు న్నారు. ఈ నేపథ్యంలో అన్నదాత లకు సేద్యానికి నియోకవర్గం లోని గవినివారిపాలెం, తోటవారి పాలెం, అక్కయ్యపాలెం ఎత్తి పోతల పథకాల ద్వారా నీరు అందించాల్సి ఉంది. అయితే అవికూడా కార్పోరేషన్ల ద్వారా అందిన నిధుల్లోని 10 శాతం జీతాలతో నడిపిస్తున్నారు. అయి తే అవి గతంలోనే మరమ్మతు లకు గురయ్యాయి. దీంతో తాత్కాలిక రిపేర్లుతో నిర్వహణ సాగిస్తున్నారు. ప్రస్తుతం మూడు కూడా అవసాన దశలకు చేరుకొని మూలన పడ్డాయి. ఈ సారి నిధులు అంతంతమాత్రంగా ఉండటంతో సమస్య జఠిలంగా మారింది. ఒక దశలో ఎత్తిపోతల పరిస్థితి కడు దీనంగా


గవినివారిపాలెం ఎత్తిపోతల పథకం

మారింది. ఇప్పటికే జూన్ రెండో వారం వచ్చింది. అయినా నిర్వహణ పనులు పూర్తికాలేదు. అధికారులు పనులకు అంచాలు మాత్రం పంపించారు. వాటిపై ఎటువంటి ఫలితం కానరాలేదు. దీంతో అన్నదాతలు అందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొండ పోరంబోకు భూమి ఆక్రమణ

- కొప్పెరపాడులో ప్రభుత్వ భూమిలో పాగా
- పొలాలకు వెళ్లే దారిని సైతం వదలని వైనం
- పట్టించుకోని రెవెన్యూ, ఫారెస్టు అధికారులు

బల్లికురవ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొప్పెరపాడు గ్రామంలో ఓ వ్యక్తి ప్రభుత్వ భూమిపై కన్నేశాడు. గత ఏడాది ఎకర ప్రభుత్వ భూమిని అక్రమించుకొని ఈ ఏడాది కి వచ్చే సరికి ఎకంగా రెండు ఎకరాల భూమిని చదును చేసి అందులో పంటలు సాగు చేస్తున్నాడు. కొండ ప్రాంతంలో ఉన్న భూమి కావడంతో తన గురించి ఎవరు పట్టించుకోరులే అని ఏటికేడు ఆక్రమించుకొనే పనిలో పడ్డాడు. అధికారులు సైతం ఎవరు పట్టించుకోక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

బల్లికురవ మండలం వి.కొప్పెరపాడు గ్రామపరిధిలో గ్రామానికి పడమర వైపున ఉన్న కొండప్రాంతంలోని అటవీశాఖ భూమిపై ఎస్టీకాలనీకి చెందిన ఓ వ్యక్తి రెండేళ్ల నుంచి ఆక్రమణకు తెరతీస్తున్నారు. కొండ భూమి రెండెకరాలను దున్ని పంటలను సాగు చేస్తున్నాడు. మొదట్లో కొంత భూమిని చదును చేయగా రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. పత్రికలలో కూడా వార్తలు రావడంతో అప్పట్లో కొంత వెనక్కు తగ్గినప్పటికీ, ఇప్పుడు మరోసారి సుమారు రెండు ఎకరాల భూమిని దున్ని కంది పంటను సాగు చేశాడు. ఈ ఏడాది మరలా అదే భూమిని ఇంకా విస్తరించే ప్రయత్నం చేస్తుండడంతో గ్రామంలోని రైతుల్లో ఆందోళన నెలకొంది. కొండ వద్ద ఉన్న భూములకు వెళ్లే దారిని సైతం అక్రమించుకొని దారి కనుమరుగు అవుతుండడంతో రైతులు ముందు ముందు ప్రభుత్వ భూముల అక్రమణలు ఇంకా పెరుగుతాయని వారు ఆందోళనలో ఉన్నారు. రెవిన్యూ, ఫారెస్టు


ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

అధికారులు వెంటనే కొండ ప్రాంతంలో అక్రమణలో ఉన్న భూమిని స్వాదీనం చేసుకొని దారిని గతంలో మాదిరిగా వెడల్పు చేయించాలని రైతులు కోరుతున్నారు. ఒక వ్యక్తి కొండ వద్ద భూములను అక్రమించుకోన్నాడని తెలిసి మరి కొందరు కూడా భూములను అక్రమించుకోనేలా ముందుకు సాగుతున్నారని ప్రజలు అంటున్నారు.

స్వర్ణాంధ్రను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

చీరాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : విజన్ -2047తో స్వర్ణాంధ్ర రాజ్యాన్ని నిర్మించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సంబంధిత కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికాన్ని నిర్మూలించి, ఉపాధి, ఉద్యోగ అవకాశాలతో ఆర్థికంగా ప్రతి కుటుంబాన్ని బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి చక్కనైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేసి తగు కార్యాచరణతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుకు పోతున్నట్లు తెలిపారు. ఆ మేరకు సీఎం విజన్ యాక్షన్ ప్లాన్‌పై వర్చువల్‌గా నిర్వహించిన కార్య క్రమంలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొ న్నారు. ఎమ్మెల్యే వెంట ఆర్డీవో చంద్రశేఖర్ నాయు డు, తహసీల్దార్లు గోపీ కృష్ణ, పార్వతి, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, డీఈ రఘురామ్, ఎంపీ డీవోలు రాజేష్, శివ సుబ్రహ్మణ్యం, హౌసింగ్ ఏఈ సుబ్బా రావు, తదితర ప్రభుత్వ విభాగం ప్రతి నిధులు పాల్గొన్నారు.


విజన్ -2047 కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వాడరేవులో తాగునీటి సమస్యకు పరిష్కారం

మండల పరిధిలోని వాడరేవు గ్రామంలో ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కారమైంది. జలజీవన్ మిషన్ ద్వారా మంజూరైన రూ.20 లక్షలు నిధులతో ఆర్‌వోపాటును ఆయన ప్రారంభించారు. అలాగే గ్రామస్థులు లో-ఓల్టేజ్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులకు వెంటనే సమస్యను పరిష్కరిం చాలని సూచించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో చేనేత కో-ఆపరేటివ్ సొసైటీ పాలకవర్గాలతో సమావేశం నిర్వహిం చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాఖలో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

చీరాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉక్కు కర్మాగారంలో తొల గించిన 2500 మంది కార్మికులను తిరిగి పనిలో చేర్చుకో వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శామ్యూల్ నియోజకవర్గ కార్యదర్శి బాసి పైడయ్య డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ గోపీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేసే ఆలోచన విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈ నెల 12న జిల్లా కేంద్రాల్లో నిరసన చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు దేవతోటి నాగేశ్వరరావు, ప్రకాష్‌బాబు, పాల్గొన్నారు.

కార్మికులను విధులలోకి తీసుకోవాలి

అద్దంకి : విశాఖ స్టీల్ ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధులలోకి తీసుకో వాలని కోరుతూ అద్దంకిలో సోమవారం ఏఐటీయూసీ నేతలు కేఎల్ డీ.ప్రసాద్, కోటేశ్వరరావు, రాంబాబు, బ్రహ్మయ్య తదితరులు తహసీల్దార్ శ్రీచరణ్ కు వినతి ప త్రం అందజేశారు. సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్య క్రమంలో సిఐటియుసి నేతలు తంగిరాల వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నేతలు బీష్మ, ఆదాము, వీరయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు చేరుతున్న విద్యా కిట్లు

బల్లికురవ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠ శాలలకు ఎంఈవో రమేష్ పర్యవేక్షణలో సోమవారం విద్యా కిట్లు చేరుతున్నాయి. మండలంలోని అన్ని పాఠశాలల్లో 4105 మంది విద్యార్థులకు అవసరమైన సర్వే పల్లి, రాధాకృష్ణ విద్యార్థిమిత్ర కిట్లను ప్రభుత్వం మండల విద్యాశాఖ కార్యాలయాలకు పంపించిందని వీటిని అన్ని పాఠశాలలకు చేర్చి పాఠశాలలు పునః ప్రారంభం రోజున విద్యార్థులకు అందజేస్తామని ఎంపీవో తెలిపారు. విద్యార్థుల చదువుకు అవసరమైన సెమిస్టర్-1 పుస్తకాలు అన్ని అందు బాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులకు బ్యాగ్, బూట్లు, నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎస్ సమన్వయకర్త అంకమ్మరావు, సీఆర్‌పీలు రంగనాధ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


ఎంఈవో ఆధ్వర్యంలో పాఠశాలలకు చేరుతున్న విద్యా కిట్లు

'సాగు భూములే మాకు జీవానాధారం'

బల్లికురవ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో దశాబ్దాలుగా ప్రభుత్వ అసైన్డ్ భూములను సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు అ భూమిని ఖాళీ చేయాలని అధికారులు హెచ్చరిస్తున్నారని, తమకు న్యాయం చేయాలని వల్లాపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ రైతులు సోమవారం డీటీ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ తాత ముత్తాతల నుంచి భూములను సాగుచేస్తున్నామన్నారు. ఇప్పుడు ప్రభుత్వం అ భూములలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పెట్టిందన్నారు. దీంతో తమకు జీవనాధారమైన భూములు కోల్పోవాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం తమ మొర ఆలంకించాలని, వారు ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎంఆర్‌పీఎస్ కమిటీ సభ్యులు నరసయ్య, పేతురు, రైతులు రమేష్, సుబ్బారావు, లక్ష్మయ్య. వల్లాపల్లి సర్పంచ్ మందా మెహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకే భవిత కేంద్రాలు

పర్చూరు, జూన్ 9 (ఆంధ్ర జ్యోతి) ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు భవితా కేంద్రా లు చుక్కానివంటివని ఐఈఆర్‌టీ ఎం.గీతాంజలి అన్నారు. ప్రత్యేక అవసరా లున్న చిన్నారులను భవితా కేంద్రాల్లో చేర్పించే కార్యక్ర మంలో భాగంగా సోమవారం పర్చూరు మండలం అడుసు మల్లి గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఈఆర్‌టీ మాట్లాడుతూ 0 నుండి 18 వయస్సు కలిగిన ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధతీసుకొని కేంద్రాల్లో చేర్పించి, ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ పి.చంద్రిక పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఐఈఆర్‌టీ సిబ్బంది

వియ్యంకుల మధ్య ఘర్షణ

- పరస్పర ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు

అద్దంకి, జూన్9 (ఆంధ్రజ్యోతి): పొలం వద్ద వివాదం నేపథ్యంలో వియ్యం కుల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో పరస్పర ఫిర్యాదుల మేరకు రెండు వేర్వేరు కేసులు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. ఆయన కథనం మేరకు మండలంలోని ఉప్పలపాడుకు చెందిన వెంపరాల శ్రీనివాసరావు, విక్రం వెంకటరామయ్యలు వియ్యంకులు. అయితే రెండు కుటుంబాల మధ్య గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పొలంలో బోరు నుంచి ఏర్పాటు చేసిన పైప్ విషయమై సోమవారం ఇద్దరు ఘర్షణ పడ్డారు. దీంతో వారిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చేరారు. ఇరువురి ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

అద్దంకి ప్రాంతంలో అర్ధరాత్రి భూకంపం

అద్దంకి, జూన్9(ఆంధ్రజ్యోతి): అద్దంకి ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత భూమి స్వల్పం గా కంపించింది. సుమారు అర్ధరాత్రి 12-45 గంటల సమయంలో భూమి కంపించిన సమయంలో వీధులలో కుక్కలు పెద్ద గా అరిచాయి. పలువురు నిద్రలేవగా ఇళ్లలోని వస్తువులు కదిలి శబ్దాలు వచ్చాయి. అద్దంకి, కొరిశపాడు, బల్లికురవ మండలాలల పరిధిలోని పలు గ్రామాలలో భూమి కంపించింది. భూకంపం తీవ్రత స్వల్పంగానే ఉండడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దీనికి తోడు గాఢ నిద్రలో ఉండి పలువురు భూమి కంపించిన విషయాన్ని గుర్తించలేకపోయారు. తరచూ భూకంపాలు వస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పాఠశాలలో కొండచిలువ కలకలం

మేదరమెట్ల, జూన్ 9(ఆంధ్రజ్యోతి) మేదరమెట్లలోని ఓ ప్రైవేటు పాఠశాలలో కొండచిలువ కలకలం సృష్టించింది. ఆదివారం అర్ధరాత్రి పాఠశాల ఆవరణలో కొండచిలువ కనిపించడంతో పాఠశాల సిబ్బంది అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారి రమేష్ ఘటనా స్థలానికి వచ్చి కొండచిలువను బంధించారు. అనంతరం దేనువకొండ వద్ద ఉన్న అటవీశాఖ ఐల్యాండ్‌లో వదిలివేసినట్లు రమేష్ తెలిపారు.

అవీ..ఇవీ..

మహనీయుని జ్ఞాపకాలపై అధికారుల దృష్టి

- ఆంధ్రజ్యోతి కథనంపై స్పందన


గోపాలకృష్ణయ్య సమాధిని పరిశీలిస్తున్న కమిషనర్ అబ్దుల్ రషీద్

చీరాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : చీరాల - పేరాల ఉద్యమ నేత, స్వతంత్ర్య సమర యోధులు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జ్ఞాపకాలను పదిల పరిచి తగు ప్రాధాన్యత కల్పిస్తామని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ పేర్కొన్నారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'పోరాట యోధుని జ్ఞాపకాల కోసం' కథనం ప్రచురితమైంది. ఈక్రమంలో స్పందించిన జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు సోమవారం కమిషనర్ డీఈ రఘురామ్‌తో కలిసి రామనగర్ వద్ద దుగ్గిరాల నివసించిన ప్రాంతంతో పాటు, శిథిలమైన సమాధిని పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారుల అందజేసి జ్ఞాపకాల భద్రతకు అన్ని విధాలా కృషిచేస్తామని చెప్పారు. అయితే మంగళవారం దుగ్గిరాల వర్ధంతి కావడం విశేషం. వారి వెంట ఆర్ఐ సత్యం, తదతర రెవెన్యూ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఉన్నారు.

ఆరుగురు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


ప్రతిభా పురస్కారాన్ని అందుకుంటున్నవిద్యార్థిని హేమస్రవంతి

బల్లికురవ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులకు సోమవారం కలెక్టర్ వెంకటమురళి ప్రతిభ పురస్కారాలను అందజేశారు. బల్లికురవ మండలం కొప్పెరపాడు ఉన్నత పాఠశాలకు చెందిన మాదాల హేమ స్రవంతి, కంబాల నాగ చరణ్‌తేజ, కొమ్మినేనివారిపాలెం పాఠశాలకు చెందిన షేక్ సుహానా, కూకట్లపల్లికి చెందిన పొట్లూరి స్వప్న, బల్లికురవకు చెందిన దాసరి రమ్యశ్రీ, వైదన పాఠశాలకు చెందిన గుర్రాల వైష్ణవిలకు కలెక్టర్ ప్రభుత్వ ఆదేశాల మేరకు రూ.20 వేల నగదును, ప్రశంసపత్రాన్ని జ్ఞాపికను అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థులను ఎంఈవో రమేష్, పాఠశాలల హెచ్ఎంలు ప్రత్యేకంగా అభినందించారు.

నేడు ఆరోగ్యకేంద్రం ప్రారంభం


అద్దంకి పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

అద్దంకి, జూన్9 (ఆంధ్రజ్యోతి): మంత్రి రవికుమార్ నేడు పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. అద్దంకి పట్టణంలో రేణింగవరం రోడ్డులో రూ.1.46 కోట్లతో నిర్మించిన కాకానిపాలెం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని ఉదయం 9 గంటలకు విద్యుత్ శాఖ మం త్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించనున్నారు. అనంతరం 9-30 గంటలకు మండలంలోని నామ్ రహదారి నుంచి గోవాడ వరకు సుమారు రూ.1.20 కోట్లతో నిర్మించిన తారు రోడ్డును ప్రారంభించనున్నారు. గోవాడ టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ మార్గం ఆర్చిని మం త్రి ప్రారంభిస్తారని మాజీ సర్పంచ్ పుట్టా దేవి సాంబశివరావు తెలిపారు. 10-00 గంటలకు కొటికలపూడిలో రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించనున్నారు. 10-30 గంటలకు పార్వతీపురంలో ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని సర్పంచ్ పూనాటి విక్రమ్ తెలిపారు.

వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లు చోరీ

- ఆందోళనలో కొమ్మినేనివారిపాలెం రైతులు

బల్లికురవ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మినేనివారిపాలెం లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు 50 మంది రైతులకు చెందిన వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లను చోరీ చేశారు. సోమవారం ఉదయం పోలాలకు వెళ్లిన రైతులకు మోటార్లు పని చేయకపోవటంతో కేబుల్ వైర్లు కట్ చేయడం చూసి ఎవరో దొంగలు చోరీ చేశారని గుర్తించారు. గ్రామానికి చెందిన నాయుడు శ్రీనివాసరావు, చింతల శ్రీనివాసరావు, చింత కోటేశ్వరరావు మరో 50 మంది రైతుల మోటార్ల కేబుల్ వైర్లు చోరీ అయ్యాయని రైతులు తెలిపారు. గ్రామానికి పరమర వైపు ఉన్న పొలాల్లో కేబుల్ వైర్లు చోరీ అయ్యాయని వారు తెలిపారు. ఒకే సారి పెద్ద సంఖ్యలో కేబుల్ వైర్లు చోరీ కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మాయలేడిపై కేసు నమోదు

- ఇంటర్‌పోల్, టీటీడీలో ఉద్యోగాలంటూ ముగ్గురుకి టోకరా


ఈపూరుపాలెం(చీరాల), జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్‌పోల్, సీక్రెట్ ఏజెన్సీల్లో పనిచేస్తున్నాని మాయలేడి ముగ్గురు యువకులకు టోకరా వేసిన విషయం పాఠకులకు విదితమే. ఇంకొల్లు మండలం పావులూరుకు చెందిన బొద్దులూరి ప్రియాంక అలాయాస్ తేజ చీరాల మండలం కావూరివారి పాలేనికి చెందిన ముచ్చు వెంకటేశ్వర్లుకు ఇంటర్‌పోల్ విభాగంలో, సీక్రెట్ ఏజెన్సీలో పనిచేస్తున్నని చెప్పి దగ్గరైంది. మాయ మాటలతో స్నేహంగా మెలిగి అతనితో పాటు మరో ఇద్దరి వద్ద టీటీడీలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి రూ.12 లక్షలు వరకు వసూలు చేసి పరారయింది. దీంతో బాధితులు ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా రేణుకమ్మ ఆలయ వార్షికోత్సవం

యద్దనపూడి,(మార్టూరు), జూన్9(ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో సోమవారం శ్రీరేణుకాంబ అమ్మవారి 10వ వార్షికోత్సవ వేడుకలను జంపని వంశస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమ చీరలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. అదే విధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలతో, పట్టు చీరతో ప్రత్యేకంగా అలంకరించారు. నారాయణ వెంకట సందీప్ దీక్షితులు ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు, మహాశాంతి యోగం నిర్వహించారు. అనంతరం భారీగా అన్న ప్రసాద వితరణ చేశారు.


విశేష అలంకరణలో అమ్మవారు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం 10 జూన్ 2025


ఒక్కొక్కటిగా బయటకొస్తున్న నాటి పాపాలు

ఇప్పుడున్న వాటితోపాటు మరో రెండు కేసులు

అన్నన్న.. కాకాణీ!

'మేడిపండు చూడు మేలిమై ఉండు.. పొట్ట విప్పి చూడు పురుగులుండు..' వేమన పద్యంలా నాడు ఎన్నో ప్రగల్భాలు పలికిన మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాపాలు ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. తవ్వుకోవడం, దండుకోవడం, అడ్డొచ్చినవారిపై దౌర్జన్యం చేయడమే లక్ష్యంగా కాకాణి, ఆయన అనుచరులు పేట్రేగిపోయారు. వీరి ఆగడాలపై ప్రతిపక్షాలు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పుడు ఆ ఫిర్యాదుల ఫైళ్ల దుమ్మును పోలీసులు దులుపుతున్నారు. ఇప్పటికే క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల కేసులో రిమాండ్‌లో ఉన్న కాకాణి ఆ కేసు నుంచి బెయిల్‌పై బయటకు రాక మునుపే మరో మూడు కొత్త కేసులు ఆయన కోసం ఎదురుచూస్తున్నాయి. అవేంటో ఈ కథనం చదవండి...

- అనధికార టోల్‌గేటు, కనుపూరు చెరువులో అక్రమ గ్రావెల్ తవ్వకాలు
- ముత్తుకూరు, వెంకటాచలంలో కేసుల నమోదు
- ఫొటోల మార్ఫింగ్ కేసులో విచారణకు దిగిన సీఐడీ
- నేడు పీటీ వారెంట్ కింద గుంటూరుకు కాకాణి?



న్యాయస్థానం లోపల..

క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల కేసులో రెండు నెలలపాటు కాకాణి అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం, ఆ తరువాత పోలీసులు అరెస్ట్ చేయడం తెలిసిందే. ఈ కేసులో సోమవారం బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిగింది. కాకాణికి ఎందుకు బెయిల్ మంజూరు చేయవచ్చో ఆయన న్యాయవాది తన వాదనను వినిపించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన వాదన వినిపించడానికి కొంత గడువు తీసుకున్నారు. దీంతో బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు చేస్తూ కాకాణి రిమాండ్‌ను ఈ నెల 23వ తేదీ వరకు పొడిగించారు. బెయిల్ పిటిషన్‌పై పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన వాదన వినిపించిన తరువాత బెయిల్ వచ్చేది, లేనిది తెలుస్తుంది.



న్యాయస్థానం వెలుపల..

వైసీపీ హయాంలో 2022 నుంచి ఎన్నికల ముందు (2024) వరకు కనుపూరు చెరువులో విపరీతంగా గ్రావెల్ తవ్వకాలు జరిగాయి. అధికారికంగానే 2.5 లక్షల టన్నుల గ్రావెల్ తవ్వకాలు జరిగినట్లు లెక్క తేల్చారు. ఇక అనధికారికంగా ఎన్ని లక్షల టన్నులు తోలారో చెప్పడం కష్టం. ఈ గ్రావెల్ తవ్వకాల ముసుగులో కాకాణి, ఈయన అనుచరులు వందల కోట్ల రూపాయలు దండుకున్నారని ప్రతిపక్షాలు ఆందోళనలు చేశాయి. ఫిర్యాదులూ చేశాయి. అయితే వైసీపీ అధికారంలో ఉండటంతో దీనిని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పుడు ఈ కేసుకు సంబంధించి వెంకటాచలం పోలీసులు బూజు దులిపారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం కాకాణి, ఆయన ముఖ్య అనుచరులు మందల వెంకటశేషయ్య, నిరంజన్‌రెడ్డిలతో పాటు మరి కొందరి మీద కేసు నమోదయ్యింది. ఈ కేసు దర్యాప్తుకు సంబంధించి రూరల్ డీఎస్పీ, వెంకటాచలం సీఐలు సోమవారం ఇరిగేషన్ కార్యాలయానికి వెళ్లి కనుపూరు చెరువులో గ్రావెల్ తవ్వకాలకు అనుమతులిచ్చిన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు.

- **సీన్ 2..**

వైసీపీ హయాంలో పోర్టుకు వెలుపల పంటపాలెం వద్ద వైసీపీ నాయకులు ఒక అనధికారిక ప్రైవేట్ టోల్‌గేట్ ఏర్పాటు చేశారు. పోర్టులో లోపలకు, వెలుపలకు వచ్చే వాహనాల నుంచి టోల్ ఫీజు పేరుతో రూ.500 నుంచి 1000 వరకు వసూళ్లు చేశారు. వాహనదారులు ప్రతిఘటించినా వైసీపీ నాయకులు వెనక్కు తగ్గలేదు. అధికారం అండతో వాహనదారులపై దౌర్జన్యాలు చేశారు. పోలీసులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరించారు. కొన్ని సందర్భాల్లో వైసీపీ నాయకులకే సహకరించారు. అప్పట్లో టోల్‌గేట్ వసూళ్ల ద్వారా కాకాణికి రోజు లక్షల రూపాయల ఆదాయం దండుకొంటున్నారని వాహనదారులు, తెలుగుదేశం నాయకులు ఆరోపించారు. అప్పుడు పెట్టిన కేసుల్లో ఇప్పుడు కదలిక వచ్చింది. గుంటూరుకు చెందిన కొందరు వాహనదారులు, దిగుమతిదారులు చేసిన ఫిర్యాదుల ఆధారంగా సోమవారం కేసు నమోదు చేశారు. ఈ కేసులో కూడా కాకాణి, ఈయన ప్రధాన అనుచరుడు తూపిలి శ్రీధర్‌రెడ్డి తదితరులపై ముత్తుకూరులో కేసు నమోదయ్యింది.

- **సీన్ 3..**

నెల్లూరు కోర్టులో కాకాణి బెయిల్ పిటిషన్‌పై వాదన జరుగుతోంది. సరిగ్గా ఆ సమయంలో గుంటూరు సీఐడీ రీజనల్ కార్యాలయం నుంచి కొంతమంది అధికారులు కోర్టు వద్దకు చేరుకున్నారు. రిమాండ్‌లో ఉన్న కాకాణిని ఒక కేసు విచారణ నిమిత్తం పీటీ వారెంట్ కింద గుంటూరుకు తీసుకెళ్లడం కోసం వారు వచ్చారు. ఇంతకూ ఈ కేసు కథమేటింటే..

2003లో వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, పోర్టులో కంటైనర్ టెర్మినల్ మూసివేత తదితరాలకు నిరసనగా మాజీ మంత్రి సోమిరెడ్డి నేతృత్వంలో చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. పోలీసులు ఈ ముట్టడిని అడ్డుకునే క్రమంలో టీడీపీ నాయకులందరిని హౌస్ అరెస్టులు చేశారు. ఆ సందర్భంగా సోమిరెడ్డిని హౌస్ అరెస్టు చేసిన ఫొటోలను పోలీసులను కూడా ప్రెస్‌కు రిలీజ్ చేశారు. కాకాణి అనుచరులు సోమిరెడ్డి ఇంట్లో కూర్చుని ఉన్నట్లు పోలీసులు రిలీజ్ చేసిన ఫొటోలను తీసుకొని సోమిరెడ్డి పక్కన ఒక మందు గ్లాస్ పెట్టి మార్ఫింగ్ చేశారు. ఈ ఫొటోలను పెట్టి ఛలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చిన సోమిరెడ్డి తెల్లవారేసరికల్లా మందు తాగుతూ ఇంట్లో కూర్చున్నాడు చూడండి అని కాకాణి అనుచరులు సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. దీనిపై స్పందించిన సోమిరెడ్డి తన ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్‌మీడియాలో పోస్టు చేశారని, తన వ్యక్తిత్వాన్ని హననం చేశారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గుంటూరులోని సీఐడీ రీజనల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అయితే అప్పట్లో వైసీపీ అధికారంలో ఉన్న కారణంగా ఫిర్యాదు తీసుకున్నారే కానీ కాకాణిపై కేసు నమోదు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సోమిరెడ్డి మళ్లీ తన ఫిర్యాదును తిరగదోడారు. దీంతో ఈ ఏడాది జనవరిలో సీఐడీ కార్యాలయం కాకాణిపై కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలు పెట్టింది. ఈ కేసుకు సంబంధించి ఇప్పుడు కాకాణిని విచారించాల్సిన అవసరం ఏర్పడటంతో నెల్లూరుకు వచ్చింది. న్యాయస్థానం సమ్మతిస్తే మంగళవారం పీటీ వారెంట్‌పై కాకాణిని సీఐడీ అధికారులు గుంటూరుకు తీసుకెళ్లి విచారించే అవకాశం ఉంది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



ఆరని జ్వాల

నెల్లూరులో సాక్షి కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న తెలుగు మహిళలు

జగన్ రోత పత్రికపై రెండోరోజు సోమవారం కూడా తెలుగు మహిళలు ఆందోళనలు నిర్వహించారు. నెల్లూరులోని సాక్షి కార్యాలయాన్ని తెలుగు మహిళలు ముట్టడించారు. కావలి, కొండాపురం, మనుబోలు ప్రాంతాల్లోనూ ఆందోళనలు జరిగాయి.



అడవి పేరంటాలమ్మ గ్రామోత్సవం

ఉదయగిరి (ఆంధ్రజ్యోతి): గన్నేపల్లి పంచాయతీలో వెలసి ఉన్న అడవి పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కొట్టాలపల్లి, బీసీ కాలనీ, గన్నేపల్లి, సర్వంబాదు గ్రామాల్లో ఊరేగించారు. ఊరూరా మహిళలకు కడవలతో నీరు పోసి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. బతుకు దెరువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన స్థానికులు ఉత్సవాల సందర్భంగా గ్రామాలకు చేరుకోవడంతో పండుగ వాతావరణం నెలకొంది.



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, ఎమ్మెల్యేలు ప్రశాంతిరెడ్డి, కృష్ణారెడ్డి, మేయర్ స్రవంతి తదితరులు

విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతంగా ఎదగాలి

- ఎంపీ వేమిరెడ్డి
- టెన్త్, ఇంటర్ విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానం

నెల్లూరు(విద్య), జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతో ఉన్నత లక్ష్యాలను అందుకోవాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. టెన్త్, ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సోమవారం నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో షైనింగ్ స్టార్స్ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఇంతటి గొప్ప కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టడం గర్వకారణమని, విద్యార్థులంతా అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. జిల్లాలోని భవిత కేంద్రాల ద్వారా విద్యనభ్యసించి టెన్త్‌లో మంచి మార్కులు సాధించిన అంధ విద్యార్థులకు ఉన్నతికి వీపీఆర్ ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల విజయాలను ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహించడం మంచి పరిణామమని, విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందనేందుకు ఇలాంటి కార్యక్రమాలే నిదర్శనమన్నారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 పేరుతో రాష్ట్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబ తీసుకువస్తున్న సంస్కరణలు విద్యార్థుల భవిష్యత్ రూపురేఖలే అందంగా ఉండబోతున్నాయని తెలిపారు. ఇన్చార్జి కలెక్టర్ కె.కార్తీక్ మాట్లాడుతూ పాఠశాలలు తెరిచే నాటికి 2వేల స్టూడెంట్స్ కిట్స్‌ను అందచేయనున్నామన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు చేపట్టామని, కంప్యూటర్, మ్యాథ్స్, ఇంగ్లీష్ ల్యాబ్‌లు కూడా ఎంపిక చేసిన పాఠశాలల్లో సిద్ధం చేస్తున్నామన్నారు. అనంతరం టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన 250 మంది, ఇంటర్‌లో 34 మంది కలిపి మొత్తం 284 మందికి ఒక్కొక్కరికి రూ.20 వేల వంతున చెక్కు, మెడల్, సర్టిఫికెట్లను ప్రదానం చేసి తల్లిదండ్రులతో కలిపి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ స్రవంతి, డీఈఓ బాలాజీరావు, ఎస్ఎస్ఏ ఏపీసీ వెంకటసుబ్బయ్య, ఆర్ఐఓ వరప్రసాద్ రావు, డీవీఈఓ మధుబాబు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే పేదల అభ్యున్నతి

నెల్లూరు (హరనాథపురం) : ప్రపంచంలోనే ఎక్కడా లేని మోడల్ పీ-4 అని, ఈ విధానానికి శ్రీకారం చుట్టి రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి బాటలు వేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ యాక్షన్ ప్లాన్ అమలులో భాగంగా స్వర్ణాంధ్ర విజన్ కార్యక్రమాలను సోమవారం అమరావతి సచివాలయం నుంచి వర్చువల్‌గా ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు కలెక్టరేట్ నుంచి ఎంపీ వేమిరెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్ రావు పాల్గొన్నారు. అనంతరం వేమిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ 10 సూత్రాలతో స్వర్ణాంధ్ర 2047 విజన్ యాక్షన్‌ప్లాన్ సమర్థవంతంగా అమలు చేసి పేదరికాన్ని పారద్రోలడమే లక్ష్యంగా సీఎం పనిచేస్తున్నారని చెప్పారు. ఇందుకోసం అన్ని నియోజకవర్గాల్లో యాక్షన్ ప్లాన్‌ను రూపొందించినట్లు చెప్పారు. మన జిల్లాలో అక్వారంగం అభివృద్ధికి పీ-4 విధానాన్ని జోడించి అభివృద్ధి చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వర్ణాంధ్ర యాక్షన్ ప్లాన్‌లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఇటీవల జరిగిన సమావేశంలో దస్తావేజు లేఖరుల సంఘీభావం (ఫైల్)



జెరాక్స్‌లు వద్దే వద్దు...

స్టాంపు పేపర్లే ముద్దు

- కేంద్రం తీసుకురానున్న రిజిస్ట్రేషన్ ముసాయిదా బిల్లుకు వ్యతిరేకత
- పాత విధానమే మేలంటున్న ప్రజలు, దస్తావేజు లేఖర్లు

నెల్లూరు (హరనాథపురం), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1908 రిజిస్ట్రేషన్ చట్టం అమలులో ఉంది. ఈ చట్టం ప్రకారం నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్ల మీద ఆస్తుల వివరాలు రాసి, రిజిస్ట్రేషన్లు చేసే విధానం అమలులో ఉంది. రిజిస్ట్రేషన్ చట్టం సమగ్రత, విశ్వసనీయతను నిలబెట్టడానికి వీలు కల్పిస్తూ, దేశవ్యాప్తంగా సురక్షితమైన సమర్థవంతమైన, పౌర కేంద్రీకృత రిజిస్ట్రేషన్ పద్ధతులను అమలు చేయడానికి 2025 రిజిస్ట్రేషన్ బిల్లు తయారు చేశారు. ఈ ముసాయిదా బిల్లుపై ప్రజల నుంచి సూచనలను ఈనెల 27వరకు కేంద్రం ఆహ్వానించింది. అయితే ఈ బిల్లులో ఆన్‌లైన్



పెన్‌డౌన్ సమ్మె చేస్తాం

కేంద్రప్రభుత్వం నూతనంగా తీసుకొస్తున్న 2025 రిజిస్ట్రేషన్ చట్టంలో కాగితరహిత, వైట్ పేపర్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం. స్టాంపు పేపర్లు వినియోగించి దస్తావేజులు తయారు చేసుకునేలా చట్టంలో అవకాశం కల్పించాలి. లేక పోతే ఈనెల 28 నుంచి పెన్‌డౌన్ సమ్మెచేస్తాం.

- పట్నం దుర్గేష్‌బాబు, అధ్యక్షుడు, జిల్లా దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం

- **స్టాంపులే అందం**

భూములు, స్థలాల విలువలు రూ.లక్షలు, రూ.కోట్లు దాటి పోతోంది. ఆ ఆస్తుల వివరాలను నాన్‌జ్యుడీషియల్ స్టాంపు పేపర్ల మీద రాసుకుంటే ఎంతో అందంగా ఉంటాయి. అవి ధృడమైన పేపర్లు కావటంతో ఏళ్ల తరబడి భద్రపరచుకోవడానికి అనుకూలంగా ఉంటాయి. ఒక రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు ఆస్తికి సంబంధించిన లింకు డాక్యుమెంట్లు అవసరమవుతాయి. వందల సంవత్సరాల పాటు అవి భద్రంగా ఉండాలి. అందుకనే ప్రజలు కాని, దస్తావేజు లేఖర్లు కాని నాన్ జ్యుడీషియల్ స్టాంపులను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం కూడా జెరాక్సు పద్ధతిలో దస్తావేజులు జారీ చేయటంతో ప్రజల నుంచి తీవ్రవ్యతిరేకత వ్యక్తమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాన్ జ్యుడీషియల్ స్టాంపులను అన్నీ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు సరఫరాల చేసింది. దస్తావేజులను స్టాంపు పేపర్ల మీద రాయడానికి కూటమి ప్రభుత్వం అనుమతి ఇవ్వటంతో ప్రజలు ఎంతో సంతోషించారు. తాజాగా కేంద్రం నూతనంగా తెచ్చే రిజిస్ట్రేషన్ బిల్లులో కాగితరహిత, వైట్‌పేపరు దస్తావేజులకు అవకాశం కల్పించనుండటంతో ప్రజల్లో, దస్తావేజు లేఖర్లలో వ్యతిరేకత వ్యక్తం అవుతోంది.

కాగిత రహిత అంశంపై దస్తావేజు లేఖరులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

- **28 నుంచి పెన్‌డౌన్**

కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న 2025 రిజిస్ట్రేషన్ చట్టం ముసాయిదాలోని కాగిత రహిత, వైట్‌పేపర్ విధానంపై దస్తావేజు లేఖర్లులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. దస్తావేజు లేఖరులంతా శనివారం రాజమండ్రిలో సమావేశమై స్టాంపు పేపర్లు వినియోగించి దస్తావేజులు రాసుకొనే విధానం అమలు చేయాలని, లేకపోతే ఈనెల 28 నుంచి పెన్‌డౌన్ సమ్మె చేస్తామని ప్రకటించారు. ఇందుకోసం రాష్ట్రంలోని అన్నీ దస్తావేజు లేఖరుల సంఘాలతో కలిసి లేఖరులంతా జేఏసీగా ఏర్పాటయ్యారు. నూతనంగా ఆమోదించే రిజిస్ట్రేషన్ బిల్లులో నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్లను వినియోగించేలా చూడాలని వారు కోరారు. .



కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ విధానంలో ఆధునిక సాంకేతికతను తీసుకురావటానికి 2025 రిజిస్ట్రేషన్ ముసాయిదా బిల్లు సిద్ధం చేసింది. అయితే ఈ బిల్లుపై ఈ నెల 27వరకు అభ్యంతరాలకు అవకాశం కల్పించింది. ఈ బిల్లు ఆమోదం పొందితే ఆధునిక ఆన్‌లైన్ పద్ధతిలో, జెరాక్సు పద్ధతిలో దస్తా వేజులు వస్తాయి. దీన్ని వ్యతిరేకిస్తూ నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్ల మీదే దస్తావేజు రిజిస్ట్రేషన్లు చేయాలని కోరుతూ దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ సమ్మె చేయడానికి సిద్ధమవుతున్నారు.



సింహ వాహనంపై చాముండేశ్వరి

ఇందుకూరుపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : భక్తులపాటిల కల్పవల్లిగా పేరొందిన గంగపట్నంలోని చాముండేశ్వరి అమ్మవారు సోమవారం రాత్రి సింహవాహనంపై కొలువుదీరి ఊరేగారు. ఇక్కడ జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన ఈ వేడుకను కనులారా వీక్షించేందుకు భక్తజనం భారాగా తరలివచ్చింది. కాగా, ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఈవో తాతా శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ సభ్యులు గుండాల కృష్ణారెడ్డి, కొండూరు వెంకటరమణారెడ్డి, అవినాష్‌రెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా యోగాంధ్ర కార్యక్రమాలు



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

నెల్లూరు(విద్య), జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలని ఇన్చార్జి కలెక్టర్ కె.కార్తీక్ అన్నారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని వార్డు, గ్రామ సచివాలయ పరిధిలలో యోగా ర్యాలీలు ఉత్సాహంగా జరిగాయి. నగరంలోని ముత్తుకూరు సెంటర్ నుంచి చిల్డ్రన్స్ పార్కు వరకు జిల్లాస్థాయి యోగా ర్యాలీని ఇన్చార్జి కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరిగే మెగా యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అలాగే ఉదయగిరి పాత రంగనాయకుల గుడి వద్ద, 16న పెంచలకోనలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, జడ్పీ సీఈఓ విద్యారమ, ఎస్ఈలు వెంకటరమణ, విజయన్, గంగాధర్, డ్వామా పీడీ గంగాభవాని, డీసీఓ గురప్ప, డీఎస్‌డీఓ యతిరాజ్, విద్యార్థులు, యోగా గురువులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100) : 550

మట్టి మాఫియాకు ఇరిగేషన్ అధికారుల అండ : సర్పంచు

కందుకూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండికందుకూరు గ్రామ చెరవులో పంచాయతీ అనుమతులు లేకుండా పట్టపగలే మట్టి మాఫియా చెలరేగి పోతోందని ఆ గ్రామ సర్పంచు కుమ్మర బ్రహ్మయ్య చెప్పారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కందుకూరు ఇరిగేషన్ డీఈ, మండలస్థాయి అధికారులు మామూళ్ల తీసుకుంటూ మట్టి మాఫియాకు అండదండలు అందిస్తున్నారని ఆరోపించారు. గ్రామంలోని గంగకుంటలో మట్టి తవ్వకాలు జరపబోగా గ్రామస్థులు, తాను అడ్డుకున్నామన్నారు. మళ్లీ చెరువులో మట్టి తవ్వకాలు జరుపుతుండగా గ్రామస్థులు అడిగితే ఎవ్వరికీ పోవాల్సినవి వారికి పంపామని, ఇంక ఎవ్వరు అడ్డుకుంటారో చూస్తామని దురుసుగా ప్రవర్తించారని అన్నారు. తాను ఈ విషయాన్ని కార్యాలయం వద్దకు వెళ్లి ఫోన్‌లో డీఈని సంప్రదించగా, అనుమతుల కాపీ ఉందని, తాను వేరే క్యాంపులో ఉన్నానని సరిగా సమాధానం చెప్పలేదన్నారు. అనుమతి ఉంటే నిబంధనల ప్రకారం అధికారులు మార్కింగ్ ఇచ్చి తవ్వుకోవాల్సి ఉందన్నారు.



మూగజీవాలకు సీజనల్ వ్యాధులు సోకకుండా చర్యలు

● వెంకటేశ్వర నాయక్, సర్వాయపాలెం పశు వైద్యుడు

కావలిరూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మూగజీవాలకు సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తుగా టీకాలు వేస్తూ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని కావలి మండలం సర్వాయపాలెం పశు వైద్యుడు బీ.వెంకటేశ్వరనాయక్ పేర్కొన్నారు.

? కావలి మండలంలో ఎన్ని మూగజీవాలు ఉన్నాయి. పశువులకు రాయితీపై దాణా అందిస్తున్నారా.

! మండలంలో 3,300 ఆవులు, 8,950 గేదెలు, 28,700 గొర్రెలు, మేకలతో కలిపి మొత్తం 40,950 మూగ జీవాలు ఉన్నాయి. ప్రభుత్వం పశువులకు రాయితీపై 5 టన్నులు దాణా పంపింది. 50 కేజీల దాణా బస్తా ధర రూ.1155 కాగా 50 శాతం రాయితీపై రూ.550కి ఇస్తున్నాం.

? వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టారా.

! గొంతువాపు వ్యాధికి పెద్ద పశువులకు, గొర్రెలు, మేకల వంటి సన్నజీవాలకు నీలి నాలుక వ్యాధి, నేలమరక వ్యాధి సోకకుండా టీకాలు అందిస్తున్నాం.

? నట్టల నివారణపై అవగాహన కల్పిస్తున్నారా.

! ఈనెల 15వ తేదీ నుంచి నట్టల నివారణపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తాం. సచివాలయాల్లో 15వ తేదీ నుంచి పశువైద్య సహాయకులచే మందులు పంపిణీ జరుగుతుంది.

? గ్రామీణ ప్రాంతాల్లో సిబ్బంది కొరత ఏమైనా ఉందా.

! కావలి మండలంలో ప్రాంతీయ వైద్యశాల మినహా అన్నగారిపాలెం, సర్వాయపాలెంలో రెండు పశువైద్యశాలలు, గౌరవరంలో ఒక గ్రామీణ పశు వైద్యశాల ఉంది. ప్రతి సచివాలయ పరిధిలో పశువైద్య సహాయకులు ఉన్నారు. సిబ్బంది కొరత లేదు.

జూనియర్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి : ఏఐఎస్ఎఫ్

కందుకూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలోని శ్రీవివేకా జూనియర్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ షరీఫ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కోటారెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గాయత్రి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీషు పేపర్ పరీక్షల కోసం అదే పట్టణంలోని వివేకా జూనియర్ కళాశాలలో సెంటర్ ఇచ్చారని చెప్పారు. అయితే వివేకా విద్యా సంస్థల యాజమాన్యం వారు గాయత్రి కళాశాలలో మెరిట్‌గా చదువుతున్న కొందరు విద్యార్థుల పేర్లను సేకరించి వారు రాసిన ఇంగ్లీషు పేపర్లను ట్యాంపరింగ్ చేశారని ఆరోపించారు. రిజల్టు అనంతరం విద్యార్థి వారి తలిదండ్రులు కళాశాల యాజమాన్యం వారు ఇంటర్ బోర్డు అధికారులను ఆశ్రయించారని చెప్పారు. దీనిపై ఇంటర్ బోర్డు అధికారులు శ్రీ వివేకా కళాశాలపై నిజనిర్ధారణ కమిటీ వేసి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. కానీ ఈ నిజనిర్ధారణ కమిటీ వారు రావడం, రిపోర్టు ఇవ్వడం జరిగినప్పటికీ ఇప్పటి వరకు శ్రీ వివేకా కళాశాల యాజమాన్యంపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని అసహనం వ్యక్తం చేశారు.. వెంటనే కళాశాల గుర్తింపు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

యోగాతో ఎన్నో ప్రయోజనాలు



కందుకూరు : యోగాంధ్రపై ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, రాజకీయ నేతలు



కావలి : ర్యాలీలో ఆర్డీవో సన్నీ వంశీ కృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్



అల్లూరు : యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, తదితరులు

● కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ

కందుకూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యోగాతో ఎన్నో మానసిక, ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఉన్నాయని కందుకూరు సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ చెప్పారు. సోమవారం కందుకూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి కోవూరు రోడ్డు వరకు యోగాంధ్రపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనూష, పలువురు అధికారులు, యోగా మాస్టర్ ట్రైనర్లు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

● **కావలి :** కావలి పట్టణంలో సోమవారం యోగాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపాల్టీ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీని మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ ర్యాలీలో మున్సిపల్ ప్రత్యేకాధికారి, ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణతో పాటు మున్సిపల్ అధికారులు, యోగా గురువులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పొదుపు గ్రూపులు, సచివాలయ, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు. ఈ ర్యాలీ మున్సిపల్ కార్యాలయం నుంచి రైల్వే రోడ్డు, ట్రంకురోడ్డు మీదుగా స్థానిక ఉదయగిరి బ్రిడ్జిసెంటర్ వరకు సాగింది. ఈ యోగాపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇటీవల కావలి పట్టణ ఐకాన్ సెంటర్‌లో యోగాసనాలు చేయించామని, పట్టణంలో యోగా నేర్చుకునే వారి కోసం ఒక సర్వే నిర్వహించి యోగాపై శిక్షణ ఇస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు.

● **అల్లూరు :** అల్లూరులో అధికారులు యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో రజనీకాంత్, నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావుల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ర్యాలీని రామకృష్ణ విద్యాసంస్థల వరకు సాగింది. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, నగర పంచాయతీ అధికారి వరప్రసాద్, యోగా సాధకులు కొప్పు శ్రీనివాసరావు, బ్రహ్మానందరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

● **బిట్రగుంట :** బోగోలులో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో యోగాంధ్ర అవగాహన ర్యాలీ నిర్వహించారు. బోగోలు బజారు కూడలి నుంచి రైల్వే ఎల్సీగేట్ 144 వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దారు సురేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో సయిమ్‌తాజ్‌హసన్, తదితరులు పాల్గొన్నారు.

● **వలేటివారిపాలెం :** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో నరేంద్రదేవ్ తెలిపారు. మండలంలోని చుండి పోలినేనిచెరువు, అంకభూపాలపురం, వలేటివారిపాలెం, పోలినేనిపాలెం, శామీరపాలెం, కొండసముద్రం, పోకూరు, నూకవరం, బడేవారిపాలెం, నేకునాంపురం, నలదలపూరు, శాఖవరం, కళవళ్ల అయ్యవారిపల్లె గ్రామాలలో సోమవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. అనంతరం ప్రధాన కూడళ్లో మానవహారం ఏర్పాటు చేసి, యోగాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ రమేష్‌బాబు, ఏపీవో దయాసాగర్, సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

● **కావలి రూరల్ :** వ్యాయామంతో ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని ఇన్‌చార్జి ఎమ్పీడీవో శ్రీదేవి పేర్కొన్నారు. స్థానిక ఎమ్పీడీవో కార్యాలయంలో సోమవారం యోగాంధ్ర కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో యోగాసనాలు వేసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బిట్రగుంట : యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో, తహసీల్దారు



వలేటివారిపాలెంలో యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్న అధికారులు



కావలి రూరల్ : ఎమ్పీడీవో కార్యాలయ ప్రాంగణంలో యోగాసనాలు నిర్వహిస్తున్న సిబ్బంది

అసంపూర్తి గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

● హౌసింగ్ డీఈఈ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కందుకూరు హౌసింగ్ డీఈఈ పీవీ నారాయణరెడ్డి

లింగసముద్రం, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : కందుకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఎన్టీఆర్, పీఎంఏవై పథకాల కింద నిర్మిస్తున్న అసంపూర్తి పక్కా గృహాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కందుకూరు హౌసింగ్ డీఈఈ పీవీ నారాయణరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని హౌసింగ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గంలో 725 పక్కా గృహాలు మంజూరయ్యాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గత నెల 31వ తేదీ నాటికి అన్ని గృహాల నిర్మాణాలను పూర్తి చేసి, లబ్దిదారులచే గృహ ప్రవేశాలు చేయించాల్సి ఉందన్నారు. కానీ వీటిలో 628 గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయని, 97 గృహాల నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయని చెప్పారు. వీటిని త్వరగా లబ్దిదారులచే పూర్తి చేయించాలని అధికారులను, సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన పెదపవనిలో నిర్మిస్తున్న పక్కా గృహాలను పరిశీలించి, తగిన సూచనలు చేశారు. ఆయన వెంట మండల ఏఈఈ జే.నాగరాజు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ నిర్మల ఉన్నారు.

వందేభారత్ రైలు ఢీకొని మహిళ మృతి

కావలి రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వందేభారత్ రైలు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన సోమవారం కావలి కళుగోళమ్మ గుడి వెనుక జరిగింది. జీఆర్పీ ఎస్ఐ రమాదేవి వివరాల మేరకు.. సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయస్సుగల గుర్తు తెలియని మహిళ దిగువ మార్గంలోని రైలు పట్టాలు దాటుతుండగా వందేభారత్ రైలు ఢీకొని మృతి చెందింది. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యంకాలేదు. మృతురాలి రెండు చేతులపై ట్యాటు మార్కులు ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆ జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలి



కావలి : డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ మహిళా నేతలు



కొండాపురం : తహసీల్దారు కోటేశ్వరావు, పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

● కావలి డీఎస్పీకి ఫిర్యాదు చేసిన మహిళలు

కావలి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలతో అవమానించిన జగన్ రేత మీడియా, జర్నలిస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలని కావలి పట్టణ టీడీపీ అధ్యక్షురాలు అర్షియాబేగం కోరారు. ఈ మేరకు మహిళలతో కలిసి సోమవారం కావలి డీఎస్పీ పీ.శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మీడియా వేదికగా లైవ్‌లో రాష్ట్ర రాజధాని అమరావతి మహిళల గౌరవ మర్యాదలకు భంగం వాటిల్లేలా అనుచిత వాఖ్యలు చేసిన జర్నలిస్ట్ కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు, మీడియా యాజమాన్యంపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

● కొండాపురం : అమరావతి మహిళలను కించపరచేవిధంగా మాట్లాడిన జర్నలిస్టులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల నాయకులు సోమవారం తహసీల్దారు కోటేశ్వరారవుతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీనియర్ జర్నలిస్టులైనప్పటికీ ఎటువంటి ఆధారాలు లేకుండా మీడియాలో రాజధాని ప్రాంత మహిళలను అసభ్య పదజాలంతో మాట్లాడటం క్షమించరాని నేరమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పోలినేని చంద్రబాబునాయుడు, రైతు కార్యదర్శి పోలినేని రమేష్, తెలుగుయువత అధ్యక్షుడు దాసరి అశోక్, వి.బాలకృష్ణ, పీ.చైతన్య, ఎం.మాధవ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-2047 చంద్రబాబు లక్ష్యం

● ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి



నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికపై ఆర్డీవోతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 2047కి వందేళ్ల పూర్తి కానున్న నేపథ్యంలో ఆ సమయానికి స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్రప్రదేశ్-2047ను లాంఛనంగా ప్రారంభించా రని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్‌లో అధికా రులతో కలసి ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపటమే లక్ష్యంగా సీఎం అడుగులు వేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రగతి, ఖ్యాతి, ప్రజల మౌలిక సదుపాయాలు, ఆర్థిక వ్యవస్థ, విద్యావిధానం, పారిశ్రామిక ప్రగతి అన్నింటిని కలగలిపి భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలపడానికి చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఒక డాక్యుమెంట్‌ను రూపొందించి అందులో సుమారు 10 అంశాలు 10 రకాల పారా మీటర్స్‌ను తీసుకుని భవిష్యత్తులో ఏవిధంగా ప్రతి డిపార్ట్‌మెంట్‌ను అభివృద్ధి చేస్తే 2047కు స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చుకోవచ్చన్నారు. కావలి ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆర్డీవో ఆధ్వర్యంలో డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్న వారి టీమ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కావలి నియోజకవర్గం భవిష్యత్తులో పారిశ్రామికవాడ, ఎయిర్‌పోర్టులకు, ఫిషింగ్ హార్బర్, రామాయపట్నం పోర్టు ఇలా అన్నింటిని అనుసంధానం చేసుకుంటూ పారిశ్రామిక, వ్యవసాయ, విద్యాపరంగా ముందుకు పోవడానికి మంచి డాక్యుమెంట్ తయారు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం. సన్నీ వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు

కొండాపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన 5 మంది విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ అవార్డులు అందజేసినట్లు ఎంఈవో కె.రవికుమార్ తెలిపారు. ఈమేరకు సోమవారం నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో సాయిపేట దామా చినబాబు మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తన్నీరు మణితేజ, కొప్పోలు దివ్యసాహితి, ఆదర్శ పాఠశాలకు చెందిన దొడ్ల దేవిశ్రీ, ఎస్.మనోజ్ఞ, కొండాపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన గణపతిరాజు వేద విద్యాధరిలకు ఒక్కొక్కరికి రూ. 20వేల, ప్రశంసాపత్రం, మెడల్ అందజేశారు.

● **లింగసముద్రం :** నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రం ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో మండలానికి చెందిన 4 విద్యార్థినులు ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ నుంచి షైనింగ్ స్టార్స్ అవార్డులు అందుకున్నారు. అవార్డులు అందుకున్న వారిలో లింగసముద్రం కేఆర్ జడ్పీ హైస్కూల్‌కు చెందిన కంచరగుంట మహాలక్ష్మి, పతకమూరి సుష్మ, పెదపవని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలకు చెందిన ఎస్ కవిత, ఎం శ్రావణిలు ఉన్నారు. వీరిని డీఈవో బాలాజీరావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు యు మాధవరావు, ప్రిన్సిపాల్ కె స్నేహలత అభినందించారు.

● **వలేటివారిపాలెం :** మండలంలోని చుండి, పోకూరు, వలేటివారిపాలెం, కేజీబీవీ స్కూల్లో 10 తరగతిలో ఉత్తమ ప్రతిభ కబరిచిన 7గురు విద్యార్థులు, షైనిక స్టార్స్ అవార్డులు అందుకున్నారు. వారిలో పోకూరు సాయి సిద్దార్ధ హైస్కూలుకు చెందిన మేకనబోయిన రక్షిత, గడ్డం రాహుల్, చుండి మోడల్‌స్కూల్‌కు చెందిన బోడా మల్లికార్జున, వీరమోసు జయసంహిత, వలేటివారిపాలెం హైస్కూల్‌కు చెందిన గొట్టిపాటి లక్ష్మీ, పోకూరు హైస్కూల్‌కు చెందిన జడా మహల్య, కేజీబీవీలో విద్యార్థిని పేరం మహిత ఉన్నారు.

'ఉపాధి' అవకతవకలకు పాల్పడితే ఇంటికే..



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

లింగసముద్రం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే సిబ్బందిని తొలగిస్తామని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు చెప్పారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో ఉద్యోగులకు, ఇతర ప్రాంతాలలో ఉన్న వారికి, చదువుకుంటున్న వారికి మస్టర్లు వేస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతిరోజూ పనులను టీఏలు, ఏపీవో, ఈసీ, తాను తనిఖీలు చేస్తామన్నారు. మండలానికి మంజూరైన 32 నీటితొట్ల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతి పనికి మూడు దశల్లో ఫొటోలు తీయాలన్నారు. అలాగే ఫారం పాండ్లను కూడా త్వరగా నిర్మించాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున మొక్కలు నాటించాలన్నారు. ఉద్యానవన పంటలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో దయాసాగర్, ఈసీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పనులకు ఒకరికి బదులు మరొకరు రావద్దు

లింగసముద్రం, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనులకు ఒకరికి బదులు మరొకరు రాకూడదని ఏపీవో దయాసాగర్ చెప్పారు. సోమవారం మండలంలోని ఎర్రారెడ్డిపాలెంలో జరుగుతున్న పనులను టీఏ జీ వీరరాఘవులతో కలిసి తనిఖీ చేశారు. కూలీల మస్టర్లను పరిశీలించారు. ఒకరికి బదులు మరొకరు పనులకు వస్తే వారిని పరిగణలోకి తీసుకోమన్నారు. జాబ్ కార్డు కుటుంబానికి ఒకటి మాత్రమే ఇస్తారని చెప్పారు. అలాగే 18 నుంచి 70 ఏళ్ల వయస్సు వరకు కూలీలు రూ.20 ప్రీమియం చెల్లిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా సౌకర్యం ఉంటుందన్నారు. అలాగే 18 నుంచి 50 ఏళ్ల వయస్సు కల వారు రూ.436 ప్రీమియం చెల్లిస్తే సాధారణ మరణానికి రూ.2 లక్షలు బీమా వస్తుందని చెప్పారు.

సచివాలయ ఉద్యోగికి ఆర్థిక సాయం



మహేష్ తండ్రి శ్రీహరికి చెక్కు అందజేస్తున్న సాయిపేట గ్రామస్థులు

కొండాపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్లపల్లి సచివాలయంలో ట్రాన్స్‌కో జేఎల్‌ఎంగా పనిచేస్తున్న బ్యగుమళ్ల మహేష్‌కు సోమవారం పలువురు దాతలు సుమారు రూ.3.61 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. సాయిపేటకు చెందిన మహేష్ ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై రెండు చేతులు కోల్పోయాడు. దీంతో స్పందించిన పలు గ్రామాల ప్రజలు అతని వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. ఈ క్రమంలో మహేష్ స్వగ్రామం సాయిపేట గ్రామస్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు రూ.1,98,117, భీమవరప్పాడు గ్రామస్థులు, ఆ గ్రామంలోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు రూ.1,63,100లకు సంబంధించిన చెక్కును బాధితుడి తల్లిదండ్రులకు అందజేశారు. తమ కుమారుడిని ఆదుకునేందుకు ముందుకువచ్చిన ప్రతి ఒక్కరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.

పైపులైన్ పనుల ప్రారంభం

బిట్రగుంట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని స్కిల్ డెవలప్‌మెంట్ విద్యార్థుల అవసర్థాం రూ.5.50 లక్షలతో మంజూరైన పైపులైన్ పనులను ఎంపీడీవో సుబ్రహ్మణ్యం సోమవారం పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మంచి సమస్యను గుర్తించిన కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోయి వెంటనే నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దగదర్తి మండల ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రవీంద్రనాథ్, డిప్యూటీ ఎంపీడీవో నయిమ్‌తాజ్ హసన్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రతాప్, అజయ్, టీడీపీ నేతలు నాగేశ్వరరావు, ప్రభాకర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి, గ్రావెల్ తరలిస్తే చర్యలు

బిట్రగుంట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అధికారుల అనుమతులు లేకుండా మట్టి, గ్రావెల్ తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ భోజ్యా సోమవారం అన్నారు. బోగోలు మండలం చెంచులక్ష్మీపురం దక్షిణాన బోగోలు చెరువులో ఆదివారం రాత్రి అక్రమంగా మట్టి, గ్రావెల్ తరలిస్తున్న ఎక్స్‌కవేటర్, రెండు ట్రాక్టర్లను తిప్ప పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో అక్రమ గ్రావెల్ తరలింపుపై నిఘా ఉంచామన్నారు. పోలీసుల అదుపులో ఉన్న వాహనాలను మండల తహసీల్దారుకు అప్పగించి ఆయన ఆదేశాల మేరకు జరిమానా విధించనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

99 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు మొత్తం 354 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 255 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-70, ఆర్ఆర్-6, సీఆర్-14, జంపింగ్‌లాట్స్-9 కారణాలతో 99 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.180, సగటు ధర రూ.243.71గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టి ఇసాక్‌స్వరన్‌దత్ తెలిపారు.

ఇక నుంచి మూడు రోజులు..

వలేటివారిపాలెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) వలేటివారిపాలెం గ్రంథాలయంలో ఇక నుంచి వారంలో మూడు రోజులు సోమ. బుధ, శనివారాల్లో పాఠకులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయినట్లు ఇన్‌చార్జి గ్రంథపాలకుడు ఎల్.ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు గుడ్లూరు రెగ్యులర్ గ్రంథపాలకుడుగా ఉంటూ ఒక రోజు వలేటివారిపాలెం ఇన్‌చార్జి గ్రంథపాలకుడుగా పని చేశానని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలతో ఇక నుంచి వలేటివారిపాలెంలో మూడు రోజులు విధులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కందుకూరు ఎస్ఐగా శివనాగరాజు



ఎస్ఐ శివనాగరాజు

కందుకూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : కందుకూరు పట్టణ ఎస్ఐగా శివ నాగరాజు నియమితులయ్యారు. సోమవారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ, పట్టణంలో శాంతిభద్రతలకు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

పీజీఆర్ఎస్‌కు నాలుగు అర్జీలు

కందుకూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కందుకూరు మున్సిపల్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 4 అర్జీలు వచ్చినట్లు కమిషనర్ కె అనూష తెలిపారు. ప్రతి సోమవారం జరిగే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

చైర్మన్ సీతారామయ్యకు అభినందనలు

కందుకూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ కామేపల్లి సీతారామయ్యకు ప్రకాశం జిల్లా మాజీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి తానికొండ అంజనేయులు సోమవారం పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

తైక్వాండో క్రీడాకారులకు అభినందన

కందుకూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : గత నెల 28 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రంలోని కటక్ పట్టణంలో జరిగిన 8వ ఓపెన్ తైక్వాండో జాతీయస్థాయి చాంపియన్ షిప్‌లో కందుకూరుకు చెందిన పలువురు క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించడంతో జిల్లా కార్యదర్శి మాస్టర్ షేక్ అబ్దుల్ సలాం సోమవారం వారిని అభినందించారు.

ఉత్సాహంగా సౌత్‌జోన్ మహిళా క్రికెట్

ఐదు జిల్లాల క్రీడాకారిణుల హాజరు

నెల్లూరు(విద్య), జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుజబుజ నెల్లూరులోని సీఏ క్రీడామైదానంలో సోమవారం అండర్-15 మహిళల ఏసీఏ సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాలకు చెందిన క్రికెట్ క్రీడాకారిణిలు ఈ పోటీలకు హాజరయ్యారు. వారంపాటు పోటీలను నిర్వహించ నున్నారు. తొలిరోజు పోటీల్లో చిత్తూరు, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు నిర్ణీత 25 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 288 పరుగులు సాధించింది. ఈ జట్టులోని ఈ.గేయకీర్తి 120 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 24.3 ఓవర్లలో పది వికెట్లు కోల్పోయి 118 పరుగులకే అలౌట్ కావడంతో చిత్తూరు జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో అనంతపురం, కర్నూలు జట్లు తలపడగా, టాస్‌గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం జట్టు 16 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 78 పరుగులు మాత్రమే సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 21.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 81 పరుగులతో విజయం సాధించింది. తొలిరోజు ఈ పోటీలను ఎన్‌డీసీఏ అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి కే.శ్రీనివాసులరెడ్డి, జనరల్ మేనేజర్ పీ. భాను ప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర జూనియర్ సెలక్షన్ కమిటీ సభ్యులు బీ.లీలామోహన్‌రెడ్డి, ఏసీఏ అంపైర్స్ పవన్‌కిషోర్, త్రినాథ్ పర్యవేక్షించారు.



పోటీల ప్రారంభోత్సవంలో ఎన్‌డీసీఏ ప్రతినిధులు, క్రీడాకారిణులు



కోన హుండీల ఆదాయం రూ.88 లక్షలు


రాపూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోన ఆలయాల హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. స్వామి వారి, అమ్మవారి, ఆంజనేయ స్వామి వారి ఆలయాల ముందు ఉన్న హుండీలు లెక్కించగా, గత 34 రోజులకుగాను రూ.88,44,153 రాబడి వచ్చింది. దీనితో పాటు 103 గ్రాముల బంగారం, 4.02 గ్రాముల వెండి, పలు దేశాల కరెన్సీ నోట్లు ఉన్నాయి. ఈ హుండీల లెక్కింపును దేవదాయ శాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్ ఎం సుధీర్ కుమార్ పర్యవేక్షించారు. రాబడిని పెంచలకోన ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో జమ చేసినట్లు ఆలయ ఉప కమిషనర్ పొరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

● వెంగమాంబ హుండీలతో రూ.12 లక్షలు

దుత్తలూరు(ఉదయగిరి) : నర్రవాడ వెంగ మాంబ పేరంటాలమ్మ అమ్మవారి ఆలయ హుండీలను సోమవారం లెక్కించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి వెట్టిగుంట ఉషశ్రీ ఆధ్వర్యంలో నెల్లూరు శ్రీహరిహరనాథస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి యూ జానకమ్మ పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. ఈ ఏడాది మే 13 నుంచి సోమవారం వరకు భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.12,10,630 రాబడి వచ్చింది. ఈ కార్యక్రమంలో నర్రవాడ ఏపీజీబీ సిబ్బంది, విశ్రాంత ఎస్‌బీఐ ఎంప్లాయీస్ అసోసియేషన్ బృందం, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిట్'లెస్'!

- ● బడిబస్సుల కండీషన్ బాగుందా!?
- ● ఎఫ్‌సీకి దూరంగా విద్యాసంస్థల వాహనాలు
- ● స్పెషల్ డ్రైవ్‌కు అధికారుల సన్నద్ధం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : చుట్టూ కిటికీలకు గ్రిల్స్ ఉండవు.. పుస్తకాలు పెట్టుకునే అమరికలూ అంతంతే.. అసలు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుతామా!? లేదా అన్న అనుమానం. ఇవీ విద్యాసంస్థలకు పిల్లలను తీసుకువెళ్లే వాహనాల దుస్థితి. విద్యాసంస్థలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లాలో పదుల సంఖ్యలో ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన బస్సులు ఫిట్‌నెస్‌కు దూరంగా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఇంటర్ కళాశాలలు ప్రారంభం కావడం, ఈ నెల 12 నుంచి స్కూళ్లు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యం ఫిట్‌నెస్ లేని వాహనాలలో పిల్లల్ని తరలించేందుకు సిద్ధమవుతూ విద్యార్థుల జీవితాలతో చలగాటం ఆడనుంది.

● ఫిట్‌నెస్‌కు దూరంగా ఉన్న బస్సులెన్నో..

జిల్లాలోని నెల్లూరు, కావలి, కందుకూరు, ఆత్మకూరు ఆర్టీవో కార్యాలయాల పరిధిలో 1,130లకుపైగా విద్యాసంస్థలకు చెందిన బస్సులు ఉన్నాయి. ప్రతి సంవత్సరం విద్యాసంస్థలకు చెందిన బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను రవాణా శాఖ అధికారులు మంజూరు చేస్తారు. నిబంధలన్నీ పక్కాగా ఉంటేనే సర్టిఫికెట్ అందజేస్తారు. అయితే, జిల్లాలో వందలాది బస్సులు ఫిట్‌నెస్‌కు దూరంగా ఉన్నట్లు సమాచారం.

● నిబంధనలు ఇలా...

విద్యార్థుల భద్రత దృష్ట్యా విద్యాసంస్థల బస్సులకు అనేక నిబంధనలు ఉన్నాయి. మోటారు వాహనాలు-ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మోటారు వాహనాల చట్టం 1989, రూల్ 185, జీవో నెంబరు 35లో మార్పులు చేర్పులు చేసిన తర్వాత విద్యాసంస్థల బస్సులకు అనేక నింబధన లు అమల్లోకి వచ్చాయి. ఈ నిబంధనలు పాటించిన వాహనాలకే రవాణా శాఖ అధికారులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను జారీ చేస్తారు.

- బస్సు డ్రైవర్ వయసు 60 సంవత్సరాలు మించి ఉండకూడదు. డ్రైవర్‌కు హెల్త్‌కార్డును నిర్వహించాలి. ప్రతి మూడు నెలలకు విద్యాసంస్థల యాజమాన్యం తమ సొంత ఖర్చుతో డ్రైవర్‌కు ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెల్త్‌కార్డులో పొందుపరచాలి.
- డ్రైవింగ్‌లో కనీసం ఐదేళ్ల అనుభవం కలిగి ఉండాలి. డ్రైవర్ నియామకం గురించి పేరెంట్స్ కమిటీకి తెలపాలి.
- వాహనం కండీషన్ తెలుసుకునేందుకు బస్సుకు సంబంధించిన బాహ్య పరికరాలు, విండ్ స్క్రీన్, లైటింగ్ వంటి వాటి మెకానికల్ కండీషన్, పని తీరును నెలకొకసారి ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ బస్సును తనిఖీ చేయాలి.
- ప్రతి వాహనంలో అవసరమైన మందులు, పరికరాలతో కూడిన ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉంచాలి.
- బస్సు ఇంజన్ కంపార్ట్‌మెంట్‌లో ఒక అగ్నిమాపక యంత్రం, పొడి అందుబాటులో ఉండాలి.
- పిల్లల బ్యాగులను ఉంచుకొనేందుకు సీట్ల కింద అరలు ఏర్పాటు చేయాలి.
- పరిమితికి మించి పిల్లల్ని బస్సులో ఎక్కించకూడదు. డ్రైవర్‌తోపాటు సహాయకుడు తప్పనిసరిగా ఉండాలి.
- బస్సులో అక్కడక్కడ నిలువు స్తంభాలను ఏర్పాటు చేయాలి. ఇలా 32 నిబంధనలు విద్యాసంస్థల బస్సులు పాటించాల్సి ఉంటుంది.

స్పెషల్ డ్రైవ్ చేస్తాం!



విద్యాసంస్థలు ప్రారంభమవుతున్న సమయం లో ఆ సంస్థలకు చెందిన ప్రతి బస్సు ఫిట్‌నెస్‌తో ఉండాలి. అలాలేని బస్సులను సీజ్ చేయడం, ఆ విద్యాసంస్థలపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది. పాఠశాలలు ప్రారంభమైన తర్వాత విద్యాసంస్థల బస్సులపై స్పెషల్ డ్రైవ్ ప్రారంభిస్తాము. నిబంధనలు పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాము.

- బి చందర్, డీటీసీ

సోషల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్ సరెండర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు (హరనాథపురం), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో సూపరిం టెండెంట్‌గా పనిచేస్తున్న వై లూకాస్‌ను సరెండర్ చేయాలని సోషల్ వెల్ఫేర్ డైరె క్టర్ లావణ్యవేణి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాడేపల్లిలోని సోషల్ వెల్ఫే ర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆమె ఆదేశించారు. ఇటీవల సోషల్ వెల్ఫే ర్ డిపార్టుమెంట్ బదిలీలలో జరిగిన అక్ర మాలపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాల కు స్పందించిన డైరెక్టర్ ఆయన్ను సరైండ ర్ చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.

బీసీ సంక్షేమంలో బదిలీలు

- ● 15 మంది హెచ్‌డబ్ల్యూవోల బదిలీ
- ● ఉత్తర్వులు జారీ చేసిన ఇన్‌చార్జి కలెక్టర్

నెల్లూరు (హరనాథపు రం), జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ శాఖలో హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, దిగువ స్థాయి ఉద్యోగుల బదిలీల ఫైల్‌కు ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ సోమవారం రాత్రి ఆమోదం తెలిపారు. ఈ శాఖలో 15 మంది హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, 49 మంది క్లాస్ ఫోర్ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మి ఇటీవల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ ఫైల్ డీఆర్‌ఓ ఉదయభాస్కర్ రావు పరిశీలించాక ఇన్‌చార్జి కలెక్టర్ వద్దకు సోమవారం చేరింది. ఫైల్‌లో పేర్కొన్న వారి బదిలీలు, నిబంధనల ప్రకారం ఉన్నాయో లేవో పరిశీలించి ఆమోదం తెలిపారు. అయితే వెంకటగిరి బీసీ సంక్షేమ కాలేజీ హాస్టల్‌లో పని చేస్తున్న ప్రవల్లిక అనే హాస్టల్ సంక్షేమాధికారి నెల్లూరుకు బదిలీ చేయించుకోడానికి ప్రయత్నించారు. అక్కడ ఆమె ఐదేళ్ల పనిచేయటంతో తప్పనిసరి బదిలీ కావాల్సి ఉంది. దీంతో ప్రవల్లిక జిల్లా బీసీ సంక్షేమాధికారిని కలిసి తనను నెల్లూరులోని ప్రీ మెట్రిక్ హాస్టల్‌లో హెచ్‌డబ్ల్యూఓగా నియమించాలని కోరినట్లు స మాచారం. కాలేజీ హాస్టల్ హెచ్‌డబ్ల్యూఓను ప్రీమెట్రిక్ హాస్టల్‌లో నియమించడానికి నిబంధనలు ఒప్పుకోవని ప్రవల్లికకు చెప్పినట్లు తెలిసింది. ఈ విషయాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ దృష్టికి తీసుకెళ్లగా నెల్లూరులో ఖాళీ లేనందున వెంకటగిరి పక్కనే ఉన్న బంగారుపేట బాలికల ప్రీమెట్రిక్ హాస్టల్‌కు ప్రవల్లికను ఇన్‌చార్జి హెచ్‌డబ్ల్యూఓగా నియమించారు. తదుపరి బదిలీల్లో ప్రవల్లికకు స్థానచలనం కల్పించను న్నట్లు తెలిసింది.


బదిలీ ఉత్తర్వులు అందచేస్తున్న బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మి

సూపరింటెండెంట్ బదిలీ

బీసీ సంక్షేమశాఖ జిల్లా ప్రధాన కార్యాలయం సూపరింటెండెంట్ ఎం.శాంసన్‌ను గుంటూరు జిల్లా బీసీ సం క్షేమశాఖ కార్యాలయానికి బదిలీ చేశారు. ఈ మేరకు ఆ శాఖ డైరెక్టర్ మల్లికార్జున సోమ వారం ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన్ను బదిలీ చేశారు.

అర్జీలకు త్వరగా పరిష్కారం చూపండి

● డీఆర్వో ఉదయభాస్కర్‌రావు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు సమర్పించే అర్జీలకు త్వరగా మెరుగైన పరిష్కారం చూపాలని డీఆర్వో ఉదయభాస్కర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ఆయన మాట్లాడారు. నిర్దిష్ట గడువు లోగా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. ప్రతి అర్జీని కూడా క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు.

● మొత్తం 383 వినతులు

ఈ కార్యక్రమంలో అర్జీదారులు 383 వినతులను అధికారులకు అందచేశారు. వీటిలో రెవెన్యూవి 132 అర్జీలు, మున్సిపాలిటీవి 35, సర్వేవి 28, పంచాయతీరాజ్‌శాఖవి 34, పోలీసుశాఖవి 63, సివిల్ సప్లయిస్‌కి సంబంధించిన 16 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ గంగాభవాని, హౌసింగ్ పీడీ వేణుగోపాల్‌రెడ్డి, సర్వేశాఖ ఏడీ నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


డీఆర్వో ఉదయభాస్కర్‌రావుకు సమస్యలు మొరపెట్టుకుంటున్న కలువాయి ప్రజలు

● కుల ధ్రువీకరణ రద్దు చేయాలి

హిందూమతం నుంచి క్రైస్తవమతంలోకి మారిన రేవూరి యానాదయ్యకు ఇచ్చిన ఎస్సీ కుల ధ్రువీకరణపత్రాన్ని రద్దు చేయాలని కలువాయి గ్రామ వాసులు డీఆర్వోకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కలువాయికి చెందిన రేవూరు యానాదయ్య ఎస్సీ వర్గానికి చెందినవాడని చెప్పారు. క్రైస్తవమ తంలోకి మారి, చర్చికి పోతున్నాడని వివరించారు. కావున విచారణ జరిపి ఆయనకు ఇచ్చిన ఎస్సీ కులధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేయాలని వారు కోరారు.

సీఐ వేధిస్తున్నాడని మహిళ ఆత్మహత్యాయత్నం

● సెల్ఫీ వీడియోలో ఆరోపణలు

చేజర్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలం విషయంలో సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి వేధిస్తున్నాడంటూ చేజర్ల మండలం ఆదురుపల్లికి చెందిన జమీలా అనే మహిళ సోమవారం సాయంత్రం ఆత్మహత్యకు యత్నించింది. సేకరించిన సమాచారం మేరకు.. ఆదురుపల్లికి చెందిన మక్బూల్ జాన్, జమీలా కుటుంబాల మధ్య ఇంటి విషయంలో కొంతకాలం గా వివాదం నడుస్తోంది. సోమవా రం మక్బూల్ జాన్ వివాదాస్పద ఇంటిలోకి సామాన్లు తీసుకొని ప్ర వేశించింది. ఈ విషయం తెలుసుకున్న జమీలా ఆత్మహత్యకు య త్నించింది. అంతకు ముందు సెల్ఫీ వీడియో ద్వారా సీఐ ఆరోపణలు చేసింది. తన తల్లి పేరిట ఉన్న ఆ ఇల్లు తనదని, అయితే సంగం సీఐ ఆ ఇంటి తాళాలు పగల గొట్టి మక్బూల్ వాళ్లని ఇంటిలోకి పంపించాడని ఆరోపించింది. ఇంటి విషయమై ఎనిమిది నెలల నుంచి సీఐ చుట్టూ తిరిగినా తమకు న్యాయం చేయలేదని, తన చావుకు కారణం సీఐ వేమారెడ్డే అని సెల్ఫీ వీడియోలో పేర్కొంది. జమీలాను కుటుంబ సభ్యులు ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. ఈ ఘటన పై చేజర్ల ఎస్‌ఐ తిరుమలరావుని సంప్రదించగా విచారిస్తున్నట్లు తెలిపారు.

కాలువలో వ్యక్తి మృతదేహం

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలో బుచ్చి-జొన్న వాడ మార్గంలోని పెట్రోలు బంకు పక్కనే ఉన్న సెంట్రల్ ఛానల్ కాలువలో ఓ వ్యక్తి మృతదేహాన్ని సోమవారం స్థానిక ప్రజలు గుర్తిం చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు బుచ్చి ఖాజానగర్‌కు చెందిన షాకీర్(40)గా గుర్తించినట్టు ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

బినామీ మస్టర్లపై విజిలెన్స్ విచారణ

● ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వివాదం ● పోలీసుల జోక్యం

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో బినామీ మస్టర్లపై సోమవారం జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఉదయగిరి ఏపీడీ మృదుల విచారణ చేపట్టారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులు, కూలీలతో కలిసి పోలీసుల సమక్షంలో బహిరంగ విచారణ నిర్వహించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ నర్రవాడలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో బినామీ మస్టర్లు అధికంగా నమోదువుతున్నాయని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టామని చెప్పారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, గ్రామంలోని లేనివారు.. ఇలా 60 మందితో బినామీ మస్టర్లు వేశారని ఫిర్యాదు చేశారన్నారు. విచారణకు కొందరు కూలీలు హాజరు కాగా, మరికొందరు అందుబాటులో లేరన్నారు. విచారణకు హాజరైన కూలీలు పనులకు వెళుతున్నారా, లేదా అని విచారించి చేసి సంతకాలు సేకరించడం జరిగిందన్నారు. విచారణకు హాజరు కాని వారి వద్ద నుంచి సంతకాలు సేకరించాలని సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. మస్టర్ల ఆన్‌లైన్ విచారణ సైతం చేపట్టి కలెక్టర్‌కు తుది నివేదిక అందజేస్తామన్నారు. కాగా, విచారణ సమయంలో పంచాయతీకి చెందిన ఇరువర్గాల మధ్య పలుమార్లు తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకొంది. పోలీసులు కలుగజేసుకుని సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో ఏపీవో బ్రహ్మయ్య, సిబ్బంది, కూలీలు తదితరులు పాల్గొన్నారు.


విచారణ జరుపుతున్న విజిలెన్స్ అధికారులు

ఇరువర్గాలకు సర్ది చెబుతున్న పోలీసులు

ప్రేమజంటపై యువతి బంధువుల దాడి

● అడ్డుకున్న స్థానికులు, పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

కలిగిరి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఓ ప్రేమ జంటపై యువతి బంధువులు దాడి చేసిన ఘటన కలిగిరిలో సోమవారం జరిగింది. వివరాల మేరకు.. నెల్లూరులోని వీఆర్ లా కాలేజీలో చదువుతున్న ఓ యువతి, యువకుడు ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో ఆ యువతికి కుటుంబ సభ్యులు వేరొకరితో వివాహ ప్రయత్నాలు ప్రారంభించగా ప్రేమికులు భైరవకోనలో వివాహం చేసుకుని నెల్లూరుకు తిరుగు ప్రయాణమయ్యారు. కలిగిరి హైస్కూల్ సమీపంలో కారు నిలిపి టీ తాగేందుకు కారు దిగగా గుర్తించిన యువతి బంధువులు ఆ యువతిని బలవంతంగా తీసుకెళ్లడానికి ప్రయత్నించారు. దీనిని ఆ యువకుడు అడ్డుకోవడంతో అతనిపై దాడి చేశారు. స్థానికులు అడ్డుకోవడంతో యువతి బంధువులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రేమ జంటను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

'సాక్షి' కార్యాలయం ముట్టడి

నెల్లూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : సాక్షి చానెల్‌లో అమరావతి రాజధానిపై దుష్ప్రచారం చేస్తూ మహిళలను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసినందుకు టీడీపీ మహిళా విభాగం చేపట్టిన ఆందోళనలు వరుసగా రెండో రోజు సోమవారం కొనసాగాయి. తొలిరోజు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించగా, రెండో రోజు జాతీయ రహదారి మీదనున్న సాక్షి కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించారు. వీరిని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. లోపలకు వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు సర్దిచెప్పడంతో తెలుగు మహిళలు కార్యాలయం ఎదుట బైఠాయించారు. సాక్షి యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 'మన స్సాక్షి లేని సాక్షిపై కేసు నమోదు చేయాలి' అంటూ డిమాండ్ చేశారు. తల్లి వంటి మహిళలను కించపరుస్తూ మాట్లాడడం సిగ్గు చేటన్నారు. అనంతరం సాక్షి పేపర్లను తగలబెట్టారు. ఈ నిరసనలో తెలుగు మహిళా విభాగం నెల్లూరు నగర అధ్యక్షురాలు కప్పిర రేవతి, అంచూరు జానకి, విజయ తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌ఎస్‌లో జామాయిల్ కర్ర మాయం

- ● రహస్యంగా తరలించి సొమ్ము చేసుకున్న ఎఫ్‌బీవో
- ● ఎఫ్‌ఆర్‌వోకు వీఎస్‌ఎస్ సభ్యుల ఫిర్యాదు.. విచారణ


ఉదయగిరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి అటవీ శాఖలో అవినీతి షరా మామూలై పోయింది. వివిధ అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను వనసంరక్షణ సమితుల(వీఎస్‌ఎస్) పేరుతో తూతూమంత్రంగా చేసి రూ.లక్షలు స్వాహా చేస్తున్నారు. తాజాగా వీఎస్‌ఎస్‌లో నరికిన జామాయిల్ కర్రను గుట్టుచప్పుడు కాకుండా తరలించి సొమ్ము చేసుకున్న సంఘటన సోమవారం వెలుగుచూసింది. జిల్లాలో గత కొన్ని నెలలుగా వీఎస్‌ఎస్‌ల ఆధ్వర్యంలో పెంచిన జామాయిల్ కర్రను టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ కూలీల చేత నరికిస్తున్నాడు. ఉదయగిరి మండలం శకునాలపల్లి బీట్ పరిధిలోని వీఎస్‌ఎస్‌లో జామాయిల్ కర్రను నరికి లారీల్లో తరలించగా కొంత కర్రను అక్కడే వదిలేశారు. దానిని అటవీ శాఖలోని ఓ అధికారి గుట్టుచప్పుడు కాకుండా రాత్రికిరాత్రే ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి కడప జిల్లా బద్వేల్ సమీపంలో ఉన్న పరిశ్రమకు తరలించి సొమ్ము చేసుకున్నాడు. ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న వీఎస్‌ఎస్ వైస్ చైర్మన్, సభ్యులు శనివారం ఉదయగిరి రేంజ్ అధికారి బీఎస్ కుమార రాజాను కలిసి ఎఫ్‌బీవోపై ఫిర్యాదు చేశారు. దీంతో రేంజ్ అధికారి వీఎస్‌ఎస్ వైస్ చైర్మన్, సభ్యులు, కర్రను తరలించిన ట్రాక్టర్ వ్యక్తిని కార్యాలయానికి సోమవారం పిలిపించి దుత్తలూరు డీఆర్వో మురళీ, ఉదయగిరి ఎఫ్‌ఎస్‌వో చినవెంకటయ్యల ద్వారా నివేదిక నమోదు చేయించారు. ఒక ట్రాక్టరు కర్రను తరలించినట్లు అధికారులు చెబుతుండగా స్థానికులు మాత్రం కొన్ని ట్రాక్టర్ల కర్ర అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నట్లు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజాను వివరణ కోరగా వీఎస్‌ఎస్ సభ్యులు ఒక లోడ్ జామాయిల్ తరలించారని ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయంపై సభ్యుల స్టేట్‌మెంట్ తీసుకుని ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. వారి ఆదేశాల మేరకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

ఎస్పీ పీజీఆర్‌ఎస్‌కి 88 ఫిర్యాదులు

వినతుల్లో ఎన్నో వేదనలు, వెతలు !

నెల్లూరు(క్రైం), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమ వారం జరిగిన పీజీఆర్‌ఎస్‌కు జిల్లా వ్యాప్తంగా 88 మంది అర్జీదారులు తరలివచ్చి వారి సమస్యలను ఎస్పీతోపాటు ఇతర పోలీసు అధికారులకు విన్నవిం చుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ జీ కృష్ణకాంత్ మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

- ఉలవపాడుకి చెందిన ఓ మహిళను నాయుడుపేటకి చెందిన సైపుల్లాఖాన్ పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. తన తండ్రి బ్రెయిన్ డెడ్ అయి వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడని సైపుల్లాఖాన్ చెప్పి ఆ మహిళ కుటుంబ సభ్యుల వద్ద నుంచి రూ.18 లక్షలు తీసుకున్నాడు. ఆ తర్వాత పెళ్లికి నిరాకరించాడు. అంతేకాక అతడితోపాటు అతడి కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని బాధితురాలు ఫిర్యాదు చేసింది.
- పొదుపు గ్రూపులో ఉన్న వీవోఏ సునీత పాత కక్షలు మనసులో పెట్టుకొని, తన అనుచరులతో దాడి చేయించిందని, ఆ దాడిలో తీవ్రగాయాలు అయ్యాయని టీపీ గూడూరుకి చెందిన మహిళ ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితులపై చిన్న కేసు నమోదు చేశారని, దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని కోరింది.
- నవాబుపేటకి చెందిన అన్వేష్ మైక్రో ల్యాండ్ కంపెనీ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. వేదాయపాలెం ప్రాంతానికి చెందిన ఓ యువకుడికి ఉద్యోగం ఇప్పిస్తానని రూ.5.70 లక్షలు తీసుకొని మోసం చేశాడు. న్యాయం చేయాలని బాధితుడు ఫిర్యాదు చేశాడు.
- వలేటివారిపాలెంకి చెందిన ఇద్దరు వ్యక్తులకు చెందిన రూ.5 లక్షల విలువచేసే గొర్రెలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారని, న్యాయం చేయాలని బాధితులు కోరారు.
- జలదంకికి చెందిన ఓ వృద్ధుడు (70) తాను క్యాన్సర్‌తో బాధపడుతున్నానని, కుమారుడు, భార్య పట్టించుకోకుండా ఇళ్లు, పొలాలను ఆక్రమించుకొని ఇబ్బంది పెడుతున్నాడని ఫిర్యాదు చేశాడు.
- కావలి రూరల్ పరిధికి చెందిన ఓ మహిళ కుమార్తె మే నుంచి కన్పించడం లేదని, ఆచూకీ కనుగొని అప్పగించాలని కోరింది.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్